తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
02.04.2026 గురువారం | సంపుటి : 12 సంచిక : 253 | పేజీలు : 12 వెల : రూ. 4/-
తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# లెఫ్ట్, రైట్‌కు తేడా ఏముందీ..?
# పినరయ్, మోడీ ఒక్కటే

## కేరళంలో సమస్యలకు ఈ ఇద్దరే కారణం

### మతతత్వ శక్తులను ఓడించండి

- కేరళం రోడ్ షోలో సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు
- సోనియా వల్లే తెలంగాణ అభివృద్ధి అని వ్యాఖ్యలు





**తిరువనంతపురం ఏప్రిల్ 1 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోడీకి, పినరయి విజయన్‌కు తేడా ఏమీ లేదని, కేరళంలో సమస్యలకు ఈ ఇద్దరే కారణం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధ వారం కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ తరపున రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ముట్టతార వద్ద నిర్వహించిన రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేరళం ప్రజలు తెలివైన వారు, చదువుకున్న వారు. ఇక్కడి ప్రజలు ప్రజలు మతతత్వ శక్తులను ఎప్పటికీ అనుమతించరన్నారు. మతతత్వ శక్తులు కేరళం లోకి ప్రవేశించకుండా ఇక్కడి ప్రజలు లక్ష్మణ రేఖ గీశారన్నారు.

నరేంద్ర మోడీ, పినరయి విజయన్ ద్వారా కేరళం భవిష్యత్‌ను అపహరించాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ నాయకులు తమ ఓటు బ్యాంకును పినరయి విజయన్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చేస్తూ కేరళంలో కాంగ్రెస్ మిత్రపక్షాలు గెలవకూడదని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి.. కేరళంను అభివృద్ధి చేసేవారికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సోనియా గాంధీ తెలంగాణను దత్తత తీసుకున్నారని ఆమె చొరవ వల్లే ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోగలుగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ ఆశీర్వాదం ఆమె మద్దతుతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఇది కేరళం ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం అని వచ్చిందన్నారు.

### ఎన్నికల ప్రచారం సీఎం రేవంత్ బిజీబిజీ

కేరళం ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. బుధవారం ఉదయం ఉదయం 9.30 గంటలకు ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు జరిగే రోడ్ షోలో పాల్గొన్న ఆయన.. 11 గంటలకు త్రివేండ్రంలోని భారతన్నూర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ కు హాజరయ్యా రు. మధ్యాహ్నం 12 గంటలకు పూవాచల్ వద్ద (కట్టక్కడ నుండి పూవాచల్, వెల్లండ్ వరకు) రోడ్ షోలో పాల్గొనను న్నారు. సాయంత్రం 4 గంటలకు అలప్పుజ వద్ద కార్నర్ మీటింగ్‌కు హాజరై అనంతరం ఎర్నాకులం వెళ్లారు.



# అమరావతికి చట్టబద్ధత

## బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు
- వైకాపా సభ్యుల వాకౌట్

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

2




# సర్కారుకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే అంతే..

## సోషల్ మీడియాలో మితిమీరి ప్రవర్తిస్తే ఇక చర్యలే..

### బిల్లు తీసుకు రాబోతున్న కేంద్ర ప్రభుత్వం

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది.

2

# జూన్ వరకు ఎండలు

- పగటి ఉష్ణోగ్రతల సగటు కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం
- భారత వాతావరణశాఖ హెచ్చరిక
- వాతావరణ పరిస్థితులపై ఐఎండీ బులెటిన్ విడుదల



# భూ భారతి షురూ

- నేటి నుంచి ప్రయోగాత్మకంగా ఐదు మండలాల్లో..
- పోర్టల్ ప్రారంభంపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్1 (జనంసాక్షి) :** తెలంగాణలో భూ భారతి కార్యక్రమం నేటి నుంచి షురూ కానుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంద న్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

# కల్తీ ఆహారంపై కొరడా

## కుళ్లిన మాంసం పెద్దఎత్తున పట్టివేత

- హోటళ్లకు చచ్చిన మేకల మాంసం సరఫరా
- మంగళ్‌హాట్ గోదాముపై దాడి

12



*నగరం కల్తీమయంగా మారుతున్నట్టు తెలుస్తోంది. రోజుకోచోట ఆహార వస్తువులను నకిలీగా గుర్తిస్తున్న అధికారులు బుధవారం కూడా దాడులు కొనసాగించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు.*

# కోయిల్ సాగర్ ఆయకట్టు రైతులను ఆదుకోండి

- తక్షణమే నీటిని విడుదల చేయండి
- కర్నాటక మంత్రితో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అడుగంటుతున్న జూరాల ప్రాజెక్టు.. ఆందోళనలో రైతాంగం

12





# తేయాకు తోటల్లో మోడి ప్రచారం

## మళ్లీ గెలిపించండి.. సివిల్ కోడ్ అమలు చేస్తాం

- ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమే..
- రాహుల్ గాంధీని ఎద్దేవా చేస్తూ ప్రధాని వ్యాఖ్యలు

లోపలి పేజీలో

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

## విభజన హామీలు అమలు చేయడం లేదు

- పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ఆవేదన
- ప్రజల కష్టాలను పట్టించుకోండి.. బకాయిలు చెల్లించండి
- పార్లమెంట్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ




**న్యూఢిల్లీ ఏప్రిల్ 1 (జనంసాక్షి):** తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ఎన్నోసార్లు ఈ విషయం రుజువైందని తెలంగాణకు చెందిన ఎంపీలు మరోసారి ఆరోపించారు. వరదల సమయం లో తెలంగాణకు తగిన సాయం అందించలే దని గుర్తుచేశారు. ఈ మేరకు పార్లమెంట్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మాట్లాడు తూ.. తెలంగాణ హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాల అంశాలపై విస్తృతంగా ప్రస్తావి ంచారు. 1969 తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేస్తూ, అప్పటి పోరాట స్ఫూర్తి ఇప్పటికీ అవసరమేనని అన్నారు. ఆ సమయంలో కాకా వెంకట స్వామి

మిగితా 2లో

# యుద్ధం ముగింపునకు సిద్ధమే...

## కానీ షరతులు వర్తిసాయ్..!

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ వెల్లడి



**టెహ్రాన్,ఏప్రిల్1 (జనంసాక్షి) :** అమెరికా ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు

2



# ఇరాన్‌పై 800సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

**జెరూసలెం ఏప్రిల్1 (జనంసాక్షి) :** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచు కుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది.


2

# నాటో కాగితం పులి

## మేం వైదొలుగుతాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసహనం
- సహకరించని మిత్రపక్షాలు.. దిక్కుతోచని స్థితిలో అగ్రదేశం

నాటో నుంచి తప్పుకునే అంశాన్ని తమ దేశం పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.



### కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

# బ్యాంకు ఖాతాల్లోకే జీతాలు

## ఏప్రిల్ నుంచి మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట

- వేలాది కార్మికులకు పారదర్శక చెల్లింపు
- ఐఎంఎఫ్ఎస్ విధానం వర్తింపు




2

# ఇబ్బందేం లేదు..!

## రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు

- పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ
- గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజీల్ ధరలు పెంచలేదని వెల్లడి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తు న్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధ నం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జా తీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో

మిగితా 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
2 ఏప్రిల్ 2026



# అమరావతికి చట్టబద్ధత

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు
- వైకాపా సభ్యుల వాకౌట్

**న్యూఢిల్లీ,ఏప్రిల్1 :** అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బ్యాంకు ఖాతాల్లోకే జీతాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి):** తెలంగాణలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధుల్లో ఉన్న సుమారు ఐదు లక్షల మంది ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి వార్త అందించింది. ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరి జీతాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గత కొన్ని సంవత్సరాలుగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వేతనాల జాప్యం, ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా జరుగుతున్న కమిషన్ కట్‌లు, మధ్యవర్తుల అక్రమాలకు ఈ నిర్ణయంతో పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయనుంది. ప్రస్తుతం ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎంఎఫ్‌ఎస్) ద్వారా జీతాలు జమ అవుతున్నట్లుగానే, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ఈ విధానాన్ని వర్తింపజేస్తోంది.

మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖతో సహా వివిధ శాఖల్లో పనిచేస్తున్న వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు, ఇతర సిబ్బందికి ఈ నిర్ణయం ప్రత్యక్ష లాభం చేకూర్చనుంది. ఇప్పుడు ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానం పూర్తి చేసి, అన్ని జిల్లాల నుంచి డేటా సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ నెల జీతాలు నుంచి నేరుగా ఖాతాల్లో జమ కావడంతో పారదర్శకత పెరిగి, కార్మికులు సకాలంలో వేతనాలు అందుకోవడం ఖాయమని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు జమ అయ్యే అవకాశం ఏర్పడింది. ఈ నిర్ణయం ఉద్యోగుల్లో సంతోషం నింపింది. మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తగ్గి, కార్మికులు మెరుగైన జీవనం సాగించేందుకు దోహదపడనుంది.

# తేయాకు తోటల్లో మోడీ ప్రచారం

- మళ్లీ గెలిపించండి.. సివిల్ కోడ్ అమలు చేస్తాం
- ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమే..
- రాహుల్ గాంధీని ఎద్దేవా చేస్తూ ప్రధాని వ్యాఖ్యలు

దిస్పూర్ (జనంసాక్షి) : అస్సాంలో భాజపా మూడోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోదీ అస్సాంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోగముఖ్ లో జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. 'అస్సాం మాజీ సీఎం సర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ప్రస్తుత సీఎం హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం చాలా అభివృద్ధి చెందింది. ఈసారి కూడా ఎన్డీయే ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. అలాగే కాంగ్రెస్ కూడా వరుసగా మూడోసారి ఓటమి చవిచూడాల్సి వస్తుంది. ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం భాజపా విడుదల చేసిన మ్యానిఫెస్టో గురించి ప్రధాని ప్రస్తావించారు. అస్సాంలో



ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలుచేస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడతామన్నారు.

**తేయాకు తోటలో మోదీ సెల్ఫీ**

అంతకుముందు దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు కూడా దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

## క్రిమియాలో కుప్పకూలిన రష్యా సైనిక విమానం

**ప్రమాదంలో 29 మంది మృతి**

**మాస్కో, ఏప్రిల్ 1 (జనంసాక్షి):** రష్యా సైనిక రవాణా విమానం క్రిమియా ద్వీపకల్పం పైన కుప్పకూలి 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆంటోనోవ్-26 (ఏఎన్-26) మోడల్ విమానం మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో (మాస్కో సమయం) సముద్రం మీదుగా వెళ్తూ రాడర్ సంబంధాలు కోల్పోయింది. తర్వాత ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారని, వారందరూ స్థలంలోనే మృతి చెందినట్లు మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది. సెర్చ్ అండ్ రెస్క్యూ బృందం ప్రమాద స్థలాన్ని గుర్తించి, మృతదేహాలను సందేహాస్పదంగా బయటపెట్టినట్లు వెల్లడించింది. ప్రాథమిక అంచనా ప్రకారం సాంకేతిక సమస్య కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు రష్యా అధికారులు అంటున్నారు.

# నాటో కాగితం పులి

వాషింగ్టన్ (జనంసాక్షి) : ఇరాన్‌పై యుద్ధంలో నాటో దేశాలు తమకు సహకరించడం లేదని ట్రంప్ ఆరోపించారు. ఈ మేరకు నాటో నుంచి అమెరికా వైదొలిగే ఆలోచనలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్యకు మిత్రదేశాలు మద్దతు ఇవ్వడం లేదని.. వాళ్లు విఫలమైనందు వల్లే ఆ



అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. నాటో కూటమిని కాగితపు పులిగా అభివర్ణించారు. ఈ విషయం రష్యాకూ తెలుసునని చెప్పారు. ఆ కూటమి మాటలకు తానెప్పుడూ ప్రభావితం కాలేదన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని చేసిన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై నాటో దేశాలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్న ట్రంప్.. వాళ్లు పిరికివాళ్లంటూ ఇటీవల విమర్శించిన విషయం తెలిసిందే. రష్యాతో నాలుగేళ్లుగా ఉక్రెయిన్ చేస్తున్న యుద్ధానికి తాము మద్దతుగా నిలిచినప్పటికీ.. ఇరాన్ విషయంలో నాటో మిత్రదేశాలు అమెరికాకు తోడుగా రావడం లేదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దీన్ని తాను ఊహించలేదన్నారు. ఉక్రెయిన్‌తో తమకు సంబంధం లేకున్నా.. వారికి అండగా నిలిచామన్నారు. అయినప్పటికీ వాళ్లు తమతో కలిసి రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాటో విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో చాలా సందేహాలు ఉన్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా బ్రిటన్ యుద్ధనౌకల దుస్థితిపై ట్రంప్ నేరుగా విమర్శలు గుప్పించారు. 'మీకు నావికాదళమే లేదు. మీరు చాలా పాతబడిపోయారు. పైగా మీ వద్ద పనిచేయని విమాన వాహక నౌకలు ఉండేవి' అని ఎద్దేవా చేశారు. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ రక్షణ వ్యయాన్ని పెంచాలా? అని సదరు రిపోర్టర్ ప్రశ్నించగా.. తానేమీ సలహా ఇవ్వనని, ఆయనకు నచ్చింది చేసుకోవచ్చన్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలపై యూకే ప్రధాని స్పందన**

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌ను సదరు పత్రిక ప్రశ్నించగా.. నాటోకు తమ దేశం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. నాటో కూటమిని ఇప్పటివరకూ ప్రపంచం చూసిన అత్యంత సమర్థవంతమైన ఏకైక సైనిక కూటమిగా ఆయన అభివర్ణించారు. కొన్ని రోజులుగా తనపై, నాటో దేశాలపై ఎంతో ఒత్తిడి ఉందన్నారు. తాను తీసుకునే ఏ నిర్ణయమైనా బ్రిటిష్ జాతీయ ప్రయోజనాల కోసమే అని స్టార్మర్ స్పష్టం చేశారు.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే..

ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై 800సార్లు యుద్ధ విమానాల దాడి

ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

## జూన్ వరకు ఎండలు

**హైదరాబాద్,ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకు గాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తట స్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్ (నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌ని నో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

## కొత్త పట్టాదారులకు ఊరట..
## రైతు భరోసా పథకం వర్తింపు

**ఈ సీజన్‌లో రూ.9,000 కోట్లు పంపిణీ లక్ష్యం**

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి):** తెలంగాణలో కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ఊరట ఇచ్చింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకు మాత్రమే అమలవుతున్న రైతు భరోసా పథకాన్ని కొత్త పట్టాదారులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా. వీరిలో ఇప్పటికే 62 వేల మంది రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ శాఖ ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను సరిచూస్తోంది. అర్హులైన రైతుల తుది జాబితాను వారం నుంచి పది రోజుల్లో సిద్ధం చేసి, ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఈ సీజన్‌లో మొత్తం రూ.9,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది.

# కాంబోడియా సైబర్ ముఠా గుట్టురట్టు

## టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్



**హైదరాబాద్: ఏప్రిల్1 (జనంసాక్షి) :** అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాతో చేతులు కలిపి, అమాయక భారతీయ పౌరుల నుంచి కోట్ల రూపాయలను కొల్లగొడుతున్న భారీ ముఠాను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్బి) ఛేదించినట్లు డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. కాంబోడియా కేంద్రంగా సాగుతున్న ఈ సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌తో సంబంధాలు కలిగి ఉండి, వారికి అక్రమంగా సిమ్ కార్డులు సరఫరా చేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిజ్వాన్ (29), హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్ అలీ (30), సయ్యద్ సోహైల్, అతీక్ అహ్మద్‌తో పాటు హన్మకొండలోని ఎయిర్‌టెల్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ టీమ్ లీడర్ నూనె అశోక్ ఉన్నట్లు వివరించారు. గత నెల 31వ తేదీన శంషాబాద్ విమానాశ్రయం నుంచి 198 భారతీయ సిమ్ కార్డులతో కాంబోడియాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న అష్రఫ్ అలీని ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకోగా, ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని ఆమె తెలిపారు.

ఈ ముఠా కార్యకలాపాలపై లోతుగా దర్యాప్తు చేయగా, 2023 నుంచి ఇప్పటివరకు ఆరు వేర్వేరు విడతల్లో సుమారు 600కు పైగా సిమ్ కార్డులను అక్రమంగా విదేశాలకు తరలించినట్లు తేలిందని శిఖా గోయల్ వెల్లడించారు. నిందితుడు అష్రఫ్ 2023లో దుబాయ్‌లో హోటల్ పనిచేస్తున్న సమయంలో, అక్కడ గేమింగ్ కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న రిజ్వాన్‌తో పరిచయం ఏర్పడిందని, భారతీయ సిమ్ కార్డులు సరఫరా చేస్తే భారీగా డబ్బు ఇస్తామని అతను ఆశ చూపినట్లు పేర్కొన్నారు. దీంతో అష్రఫ్ స్థానిక పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్ల సహాయంతో అమాయకుల వ్యక్తిగత పత్రాలను ఉపయోగించి సిమ్ కార్డులను సేకరించడం ప్రారంభించాడు. అరెస్టయిన సోహైల్ జియోలో ప్రమోటర్‌గా, అతీక్ మరియు అశోక్ ఎయిర్‌టెల్ ఏజెంట్లుగా ఉంటూ తమకున్న అధికారంతో నకిలీ పత్రాల ద్వారా ఈ కార్డులను యాక్టివేట్ చేసి సరఫరా చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ అక్రమ సిమ్ కార్డులను కాంబోడియాలోని నేరగాళ్లు ఫిషింగ్, గుర్తింపు దొంగతనం, బెదిరింపులు వంటి నేరాలకు వాడుతూ భారతీయ పౌరులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నారని శిఖా గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కొరియర్‌గా వ్యవహరిస్తున్న అరవింద్ కుమార్ అలియాస్ షాహిద్ పరారీలో ఉన్నాడని, అతనితో పాటు విదేశాల నుంచి ఈ నెట్‌వర్క్‌ను నడిపిస్తున్న మాస్టర్ మైండ్‌ను పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఇటువంటి చర్యలు దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, నిందితులపై ఐటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత మరియు టెలికమ్యూనికేషన్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత పత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, 'సంచార్ సాథి' వెబ్‌సైట్ ద్వారా తమ పేరిట ఉన్న సిమ్ కార్డుల వివరాలను తనిఖీ చేసుకుని, ఏవైనా అనుమానాస్పద కార్డులు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష



సహా అనేక మంది నాయకులు తెలంగాణ కోసం చేసిన త్యాగాలను స్మరించారు. 'నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందనే కారణంతోనే ఉద్యమం జరిగింది. కానీ ఈ రోజు వరకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు కాలేదు' అని ఆయన పేర్కొన్నారు. నీటి అంశంలో ముఖ్యంగా కృష్ణా నది మరియు గోదావరి నది నీటి నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదిత బంకచర్ల ప్రాజెక్టు అమల్లోకి వస్తే, తెలంగాణకు హక్కుగా రావాల్సిన సుమారు 200 టీఎంసీల నీరు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీని ప్రభావంతో ఉత్తర తెలంగాణ, ముఖ్యంగా పెద్దపల్లి ప్రాంతం ఎండబారే పరిస్థితి తలెత్తుతుందని రికార్డులో ఉంచాలని కోరారు.

కేంద్ర నిధుల కేటాయింపులో అసమానత ఉందని విమర్శిస్తూ, తెలంగాణను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రైల్వే ప్రాజెక్టుల కేటాయింపులో కూడా నిధుల పంపిణీ సమానంగా జరగడం లేదని పేర్కొన్నారు. విమానాశ్రయాల విషయంలో కూడా తీవ్ర అసమానత ఉందని ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉండగా, తెలంగాణలో మాత్రం పరిమిత సదుపాయాలే ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా పెద్దపల్లి ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు డిమాండ్ చేసినప్పటికీ పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల్లో వెనుకజల సమస్యలు తీవ్రమవుతున్నాయని, దాదాపు రెండు లక్షల మంది ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల విషయంలో పరిశ్రమల మార్గం, అర్ధవాహక తయారీ కేంద్రం వంటి ప్రాజెక్టులు తెలంగాణకు రావాల్సి ఉండగా ఇతర ప్రాంతాలకు మళుతున్నాయని అన్నారు. రైతులు, ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. 'తెలంగాణ హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి' అని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పార్లమెంట్‌లో స్పష్టం చేశారు.

కిషన్ రెడ్డికి కౌంటర్ ఇచ్చిన చామల

ఏపీ పునర్విభజన చట్టం బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాను ఉన్నాను అని చెప్పుకునే ప్రయత్నం చేశారని, కానీ తెలంగాణను పదేళ్లు దోచుకున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పుడు తెలంగాణలో ఆర్.ఆర్ ట్యాక్స్ నడుస్తోందని అన్నారు. బిఆర్ఎస్, కేసీఆర్ కుటుంబం దోచుకుంటుంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఏం చేశారు. కేసీఆర్ కుటుంబంతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారా అని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి తెలంగాణలో ప్రేక్షక పాత్రకు పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు.

## సర్కారుకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే అంతే..

**న్యూఢిల్లీ,ఏప్రిల్1 (జనంసాక్షి) :** అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేం దుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే




అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్లు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# ఇబ్బందేం లేదు..!

ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించి ందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగు దల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ అందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్లకు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ల్పీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మాగటింగ్ కంపెనీలకు ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు. 2023లో ఓఎంసీలకు రూ.22,000 కోట్లు కేటాయించగా, 2025-26లో సుమారు రూ.30,000 కోట్లకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఏ ఒక్క గ్యాస్ ఏజెన్సీ నుంచి స్టాకు లేదనే సమాచారం లేదని, మంగళవారంనాడు కూడా 60 లక్షల సిలెండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు.


## ప్రథమిక ప్రకటన
(నోటిఫికేషన్)

(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పట్టణాభివృద్ధి శాఖ గారి మేమో నెం. 15576/పిల్ జి.II/2023, తేది. 02.03.2024 చూడుము)

**తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ శాఖ**

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం :జి/1064/2026 — తేది : 24. 03.2026
ఆర్.డి.ఓ. ఫైల్ నెం. బి/1508/ బీబీనగర్/2025, — తేది : 23. 02.2026
గెజిట్ నంబర్: 15/2026 — తేది : 30. 03.2026

ఈ దిగువ నిర్దిష్టపరచిన యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీనగర్ మండలము, బీబీనగర్ గ్రామములో విస్తీర్ణం ఎకరాలు. 0.2631 గుంటలు భూమి ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా "యం.యం.టి.ఎస్. దశ- II విస్తరణ ఘటకేసర్ - రాయిగిరి (యాదాద్రి) - పగిడిపల్లి (8.5 కి.మీ) వద్ద రైలు ఓవర్ రైలు మార్గంపై ప్రతిపాదిత నిర్మాణము కొరకు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (కట్టడాలు - II), సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ గారు రిక్విజేషన్ ఇచ్చినందున దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున, భూమిని ప్రజాప్రయోజనం నిమిత్తము ఈ ప్రాజెక్టు గూర్చి అవసరము అవుతున్నది.

ఇట్టి భూసేకరణ గురించి తెలంగాణ గాణ రాష్ట్ర ప్రభుత్వము మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పట్టణాభివృద్ధి శాఖ గారి మేమో నేం.15571/ పిఎల్ జి.II/2023, తేది. 02.03.2024 ప్రకారము ప్రజా ప్రయోజనం అనగా మల్టీ-మోడల్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ (యం.యం.టి.ఎస్.,) ఫేజ్-II ప్రాజెక్ట్ ఘటకేసర్ నుండి యాదాద్రి (వంగపల్లి) వరకు, మేడ్చల్ మల్కాజ్ గిరి మరియు యాదాద్రి భువనగిరి లో వొచ్చే గ్రామాలు భూమి భూసేకరణ సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస ,పునరాశ్రయ హక్కు చట్టం, 2013 లో, చాప్టర్ II సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక, చాప్టర్ III లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములను మినహాయించనైనది.

ఇట్టి ప్రాజెక్ట్ పునరావాసం మరియు పునరుపాది కల్పనకు రాజస్వ మండలాధికారి, భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్) గా నియమించనైనది. కావున యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీనగర్ మండలము, బీబీనగర్ గ్రామములో విస్తీర్ణం ఎకరాలు. 0.2631 గుంటలు గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వానిని భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం. ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

**షెడ్యూలు**

గ్రామము : బీబీనగర్ — మండలము : బీబీనగర్ — జిల్లా : యాదాద్రి భువనగిరి

| [illegible] | సర్వే నెంబర్ | భూమి స్వభావం | భూమి రకం | పేరు | విస్తీర్ణం ఎకరాలు, గుంటలు | [illegible] |
|---|---|---|---|---|---|---|
| I | II | III | IV | V | VI | VII |
| 1 | 190 | పట్టా | మెట్ట | దేవరాయ యాదయ్య, దేవరాయ ఆంజనేయులు, దేవరాయ రమేశ్ | 0.0336 | |
| 2 | 194 | మాఫీ ఇనాం | మెట్ట | పరాంకుశం శేషాచారి, పి. సింహాద్రి | 0.0441 | |
| 3 | 195 | పట్టా | మెట్ట | పరాంకుశం శేషాచారి, పి. సింహాద్రి | 0.0396 | |
| 4 | 198 | పట్టా | మెట్ట | పొద్దుటూరి రాజేశ్వర్, పొద్దుటూరి నాగయ్య, పొద్దుటూరి గౌరీశంకర్, బెల్ది సువర్ణ, పొద్దుటూరి గోవర్ధన్, పొద్దుటూరి లక్ష్మి, పొద్దుటూరి రాఘవేందర్, తాటికొండ ధనలక్ష్మి, పొద్దుటూరి మంగ | 0.0656 | |
| 5 | 199 | పట్టా | మెట్ట | పరాంకుశం శేషాచారి, పి. సింహాద్రి | 0.0307 | |
| 6 | 200 | ప్రభుత్వ భూమి | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.0495 | |
| | | | | మొత్తం | 0.2631 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు తెలంగాణ సవరణ ( చట్టం, ) 2016 చట్టం ( 2017/21 ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు ) 2013 కేంద్ర చట్టం ( 2013/30 యొక్క సెక్షన్ (1) 11 యొక్క నిభందనలను అనుసరించి సంబధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు రాజస్వ మండలాధికారి, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, రాజస్వ మండలాధికారి, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ (4)11 ప్రకారం జిల్లా కలెక్టర్ , యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి) 60 అరపై (దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును .

సం/-
భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి భువనగిరి

సం/-
అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి

సం/-
జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR No.1360/LA-PP/Advt/Agency/2025-26

# పాతబస్తీలో హైడ్రా భారీ ఆపరేషన్

## క్రీడామైదానంలో అక్రమ కట్టడాల తొలగింపు

- 5 నిర్మాణదశలో ఉన్న భవనాల కూల్చివేత
- రూ. 100 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 01 (జనంసాక్షి)** : పాతబస్తీ మైలర్దేవుపల్లిలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. 6500 గజాల క్రీడమైదానాన్ని కాపాడింది. దీని విలువ రూ. 100 కోట్లవరకు వుంటుందని అంచనా. హెచ్ఎండీఏ అనుమతి పొందిన లేఔట్లో స్పష్టంగా క్రీడామైదానమని పేర్కొన్నా ఆక్రమణలకు తెగబడిన వారికి కూల్చివేతలతో బుద్ధి చెప్పింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్దేవుపల్లి విలేజ్ శాస్త్రిపురం కాలనీలో హైడ్రా బుధవారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. 188 ఎకరాల హుడా అనుమతి పొందిన లేఔట్లో క్రీడాస్థలం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. జీ ప్లస్ 3 అంతస్తుల నిర్మాణ దశలో ఉన్న భవనాలు ఐదింటిని హైడ్రా తొలగించింది. మరో రెండు సింగిల్ రూమ్ నిర్మాణాలను తొలగించింది. 1800 ల ప్లాట్లకు పైగా ఉన్న ఈ లేఔట్ ప్రకారం 6500 గజాల స్థలాన్ని ప్లే గ్రౌండ్ కోసం కేటాయించారు. క్రీడస్థలానికి కేటాయించిన స్థలం అని తెలిసి కూడా గత 3 సంవత్సరాలుగా నోటరీ మీద స్థానికంగా ఉన్న కబ్జాదారులు ప్లాట్లుగా అమ్మేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ గతంలో నోటీసులు కూడా ఇచ్చింది. 2024లో కూల్చివేస్తామని స్పీకింగ్ ఆర్డర్లు కూడా జారీ చేసింది. అయినా పట్టించుకోకుండా అక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయి. యిదే విషయమై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు జీహెచ్ఎంసీ , రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లేఔట్ ప్రకారం క్రీడాస్థలం కోసం కేటాయించిందని నిర్ధారణ చేసుకుంది. నిర్మాణాలు చేపట్టవద్దని వెంటనే హైడ్రా హెచ్చరించింది. బుధవారం ఉదయం ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 5 నిర్మాణంలో ఉన్న భావనలతో పాటు రెండు చిన్న గదులతో నిర్మించిన వాటిని తొలగించింది. ఇంకో రెండు భవనాల్లో ఇప్పటికే నివాసాలు ఉండడంతో వాటిని మినహాయించింది. క్రీడామైదానం అందుబాటులోకి రావడంతో శాస్త్రిపురం కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆక్రమణలు అడ్డుకుంటే భయపెట్టారని.. హైడ్రా రావడంతో క్రీడాస్థలం కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటం ఫలించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ కబ్జా చేసిన వాళ్లు సామాన్యులు కాదని.. అడ్డుకున్నవాళ్లను బెదిరించారని తెలిపారు. హైడ్రా ఫెన్సింగ్ పని కూడా పూర్తి చేసింది.

# జామియా మిలియాలో 'సివిల్స్'కు ఉచిత శిక్షణ

- మైనార్టీ,ఎస్సీ,ఎస్టీ, మహిళలకు అవకాశం
- దరఖాస్తు కు గడువు తేదీ మే 26
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి)** : దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ' సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా సాగే నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు ఉచిత శిక్షణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2027లో యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరు కానున్న మైనారిటీ, యస్సీ, యస్టీ మరియు మహిళలకు ఈ సువర్ణావకాశం కల్పిస్తున్నట్లు మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు గాను విశ్వవిద్యాలయం వారు జూన్ 6వ తేదీన మన రాష్ట్రంలో హైదరాబాద్ నందు అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, దీంట్లో మెరిట్ సాధించిన వారికి ఒక యేడాది పాటు ఉచిత శిక్షణ, భోజన, వసతితో పాటు పూర్తి స్థాయిలో ఏసీ లైబ్రరీ సౌకర్యం కూడా కల్పించటం జరుగుతుందన్నారు. యూపీఎస్సీ ఈ ఏడాది ప్రకటించిన ఫలితాల్లో జామియా మిలియాలో ఉచిత శిక్షణ పొందిన 100 మందిలో ముస్లింలతో పాటు అన్ని వర్గాలకు చెందిన 38 మంది అభ్యర్థులు పలు సర్వీసులలో నియామకాలు పొందారని అన్నారు. అర్హత మరియు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను https://admission.jmi.ac.in అనే వెబ్సైట్ నందు మే 26 లోపు 1325/- రూపాయలు ప్రవేశ పరీక్ష రుసుము చెల్లించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. ఇట్టి అవకాశాన్ని మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, మరియు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8520860785 అనే నంబర్ కు సంప్రదించాలని అన్నారు.

# నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

## 3వేల మందితో పోలీస్ బందోబస్తు

**హైదరాబాద్, ఏప్రిల్1 (జనంసాక్షి)** : నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు వివాహ నిశ్చితార్థం...

# అంతలోనే రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో యువకుడు మృతి

**ఖమ్మం, ఏప్రిల్1 (జనంసాక్షి)** : జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్మీడియాలో వైరల్గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడె ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గుప్తనిధుల పేరుతో అమాయకులకు గాలం

## బ్లాక్ మ్యాజిక్ విద్యతో పలువురికి కరెన్సీ కట్టలు ఇచ్చినట్లు ప్రచారం

- గోదాముల్లోని అక్రమ కరెన్సీ షిప్టింగ్ అంటూ నమ్మపలికే మోసపు మాటలు
- అమాయకుల నుండి లక్షలు కాజేస్తున్న ఓ మోసగాడు



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 1 (జనంసాక్షి)** : తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకొని కొంతమంది సొమ్ముచేసు కుంటున్నారు. ఈ క్రమంలో నమ్మించి మోసాలకు కూడా పాల్పడుతున్నారు. తీరా బాధితులు మోసపోయామని తెలుసుకునే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. మంచిర్యాల జిల్లాలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాలోని అమాయక ప్రజలను లక్ష్యం చేసుకొని అధిక సంపాదన ఆశ చూపి అందినకాడికి దండుకుంటున్నారు. బాధితులు మోసపోయామని గుర్తించి తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని అడిగితే భయభ్రాంతులకు గురిచేసేంత వరకు వెళుతున్నారు. మరోవైపు కొంతమంది మోసగాళ్లు తమ వద్ద అతీంద్రయ శక్తులు ఉన్నాయని, కష్టపడ కుండానే డబ్బులు సంపాదించి ఇస్తానని ప్రజలను నమ్మిస్తూ అమాయకుల నుండి లక్షలు కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆత్మలలో గుప్త నిధులు తెప్పించి కోటీశ్వరులను చేస్తానంటూ అంటూ ప్రచారం చేసుకొని కొంతమంది దగ్గర లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. భూమిని తవ్వకుండానే పూజలు చేసి గుప్తనిధులు వెలికితీస్తానని చెప్పి డబ్బులు తీసుకొని ఇచ్చిన డబ్బులు అడిగితే బాధితులనే బెదిరించినట్లు సమాచారం . నమ్మించి మోసం చేయడమే లక్ష్యంగా చేసుకొని అమాయకులను అత్యాశ పరులను ఎంచుకొని పూజల పేరుతో లక్షలాది రూపాయలు గుంజూతు నిలువు దోపిడి చేస్తున్న వైనం బహిర్గతమైంది.

అత్యాశా పరులే అతని టార్గెట్ వారికి మాయ మాటలు చెప్పి డబ్బులు వసూలు చేసి నిండా ముం చుతున్నాడు. మొకీలతో (ఆత్మల) తో పట్నం (అచ్చు) పూజ లోకి డబ్బులు, బంగారం తీసుకుని వస్తానంటూ ప్రచారం చేసుకొని పట్నం వేయడానికి పూజ వస్తువుల కొనుగోలు పేరుతో లక్షలు వసూలు చేస్తున్నాడు. అకాల ధనవృద్ధి అంటూ కొంతమందిని సంవత్సరాల తరబడి తనతో తిప్పుకుంటూ మానసిక,ఆర్థిక స్థితి పై దెబ్బ తీస్తున్నాడు. లక్షలు పెడితే వందల కోట్లు అంటూ ప్రచారాలు చేసుకొని అమాయకులను నిండా ముంచుతున్నాడు. ఇతడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వికాస్ నగర్ లో సమీపం లో ఉంటూ వ్యక్తి కష్టపడకుండా డబ్బులు వస్తాయని ,మోసం ఏమి లేదని భూమి లోపల ఉన్న గుప్త నిధుల పేరుతో గోల్ మాల్ కు పాల్పడుతూ తాంత్రిక విద్యలు తెలుసు అంటూ ప్రచారం చేసుకున్న ఆ మాంత్రికుడు మోసాలకు కేరాఫ్ అడ్రస్ గా మారాడు. తనకు తాంత్రిక విద్యలు తెలుసు అని చెపుతూ ఒక వర్గం వారిని లక్ష్యం చేసుకొని లక్షలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నాడు. తన కనికట్టు విద్యతో 10 నుండి 20 సెకన్ల నిడివి ఉన్న వీడియోలో డబ్బుల కట్టలను చూపిస్తారని ఓ ప్రచారం జరుగుతుంది . వారం రోజుల్లో కోట్ల రూపాయలు ఇస్తానని పూజలు చేయడానికి వస్తువులు తేవాలని లక్షలాది రూపాయలు లాగుతాడని చెబుతున్నారు. డబ్బులు తీసుకొని పూజలు అంటూ సంవత్సరాల తరబడి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇతగాడి గత చరిత్ర పరిశీలిస్తే ఈయన ఒకప్పుడు లారీ డ్రైవర్ గా పనిచేసేవాడు. .అనంతరం బెల్లంపల్లి పట్టణానికి చెందిన అతని బంధువు దగ్గర తాయితలు కట్టే ఇతను ఒక గురువు దగ్గర ఉండి నేను తాంత్రిక విద్యలు నేర్చుకున్నాని ప్రచారం చేసుకున్నాడు . ఆయన గారడి విద్యలతో రోడ్ గోల్డ్ ముందే దగ్గర పెట్టుకుని కిలోమీటర్ల దూరంలో ఉన్న గుప్త నిధులను అచ్చు (పట్నం) వేసి డబ్బులు పెట్టుబడి పెట్టిన వారి కళ్ళు కప్పి అచ్చు లోకి బంగారం వచ్చిందని ఆత్మలు తెచ్చాయని ముందే తెచ్చుకున్న రోడ్ గోల్డ్ బిల్లలను అక్కడ పెట్టి మోసం చేస్తాడు . రోడ్ గోల్డ్ ను, గోల్డ్ గా నమ్మించి ఇలా రిటైల్ గా అమ్మితే ఇబ్బందులు ఎదురవుతాయని నేను హైదరాబాద్ లాంటి పెద్ద నగరాలలో ఇలాంటి బంగారం కొనే పెద్ద పెద్ద వ్యాపారులు తెలుసని వారికి అమ్మి డబ్బులు ఇస్తానని నమ్మించి నెల ,రెండు నెలలు అంటూ సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. సంవత్సరాలు గడిచిన ఎవరికి ఒక రూపాయి కూడా ఇవ్వకపోగా డబ్బులు పెట్టుబడి పెట్టిన వాళ్లను బానిసలుగా మార్చి వేదిస్తాడని సమాచారం . ఇంట్లోకి నిత్యావసర సరుకులతో పాటు అన్ని వస్తువులు తెప్పించుకుని వారిని నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. ఇప్పటికే పలువురు దగ్గర 30 నుండి 40 లక్షలు వసూలు చేసినట్టు సమాచారం. పూజల పేరుతో డబ్బులు తీసుకుని సంవత్సరాలు గడిచిన ఇవ్వక పోవడంతో బాధితులు ప్రశ్నిస్తే కోట్లాది రూపాయలు ఇస్తున్నా అని వేలు,లక్షలు పెద్ద లెక్క అని వాళ్ళని నమ్మించి నట్టేట ముంచుతున్నాడు. ఇతని బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బాధితులు వాపోతున్నారు.

# మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను ప్రారంభించండి

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి

- ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డి, దీవకొండ, బండి, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ వినతిపత్రం అందజేత



**న్యూఢిల్లీ /ఖమ్మం (జనంసాక్షి)** : తెలంగాణలోని మహబూబాబాద్లో మంజూరైన మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను తక్షణమే ప్రారంభించాల్సిందిగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) పరిధిలో ప్రస్తుతం అమలుకు సిద్ధంగా ఉన్న కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ అయిన వరంగల్ మహబూబాబాద్ సెక్షన్ కోసం మంజూరైన మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో తన సహచర సభ్యులు కే.ఆర్.సురేష్ రెడ్డి,దీవకొండ దామోదర్ రావు, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ లతో కలిసి మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు వినతిపత్రం అందజేశారు.వారు పార్లమెంటులోని ఛాంబర్ లో బుధవారం సాయంత్రం రైల్వే మంత్రితో సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ రైల్వే అంబ్రెల్లా వర్క్ కింద 908.15 కోట్ల రూపాయల గణనీయమైన బడ్జెట్ కేటాయింపుతో అధికారికంగా మంజూరు చేసిన విషయాన్ని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సదుపాయం భారతీయ రైల్వేకు ఒక వ్యూహాత్మక అవసరమని,ఇందులో ఫ్రైట్ రోలింగ్ స్టాక్ కోసం పీరియాడిక్ ఓవర్హాలింగ్, రెగ్యులర్ ఓవర్హాలింగ్, సిక్ లైన్ రైలు తనిఖీ సౌకర్యాలు చేర్చబడ్డాయన్నారు. ఈ జాతీయ ప్రాధాన్యతకు మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లాలోని అనంతారంలో 409.01 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టిందని వినతిపత్రంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అవసరమైన భారీ మౌలిక సదుపాయాలకు అనువుగా, కొండ, మైదాన ప్రాంతాలు రెండింటినీ కలిగి ఉన్న స్థల ప్రణాళికను సిద్ధం చేశారని తెలిపారు. ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత కలిగి భూమి అందుబాటులో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 2025 నాటికి భూమి కేటాయింపును లాంఛనంగా తెలియజేసినప్పటికీ, అనంతారం సైట్లో ప్రణాళిక దశ నుండి క్షేత్రస్థాయి అమలుకు పరివర్తన స్తంభించిపోయిందని ఎంపీ వద్దిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల ఈ డిపో నిర్మాణాన్ని వేగవంతం చేయడం ప్రధానమంత్రి గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఉందని వినతిపత్రంలో వివరించారు. ఇది అధిక రద్దీ గల ఈ కారిడార్ దేశంలోని సరుకు రవాణా వాహనాలకు నిరాటంకమైన లాజిస్టిక్స్, నిర్వహణను నిర్ధారిస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటులో జాప్యం వల్ల మహబూబాబాద్ స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలతో సహా, ఈ ప్రాంతానికి చేకూరే ముఖ్యమైన సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను నిలిపివేస్తోందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో మాట్లాడుతూ ఎంపీ రవిచంద్ర ఆవేదన వెలిబుచ్చారు. భారతీయ రైల్వేల పరివర్తనలో మీ దార్శనికతను దృష్టిలో ఉంచుకుని, పెండింగ్లో ఉన్న పరిపాలనా అనుమతులను వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ సైట్లో క్షేత్రస్థాయి అమలు, పునాది పనులను ఎటువంటి జాప్యం లేకుండా ప్రారంభించేలా రైల్వే బోర్డును దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను ఆదేశించాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. మహబూబాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఈ ప్రాజెక్టును ప్రగతికి చిహ్నంగా ఎదురుచూస్తున్నారని, మీ మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చుతుందన్న ఆశాభావంతో ఉన్నట్లు ఎంపీ వద్దిరాజు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు చెప్పారు.



# నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి)** : రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. హైదరాబాద్లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కురిసిన వర్షాల వల్ల వరి, మొక్కజొన్న, మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. కల్లాలకు తీసుకొచ్చిన మొక్కజొన్న, వరి కూడా తడిసి తీవ్రంగా నష్టం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ, వ్యవసాయ శాఖ నష్టాన్ని అంచనా వేసి వాణిజ్య పంటలకు ఎకరానికి 50 వేల రూపాయలు, ఆహార ధాన్యాలకు ఎకరాకు 25 వేల రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది.

**మహిళా రైతుల రాష్ట్ర కన్వీనర్ గా కందాల ప్రమీల**

మహిళా రైతుల రాష్ట్ర కన్వీనర్ గా కందాల ప్రమీల, కో కన్వీనర్లుగా శీలం పకీరమ్మ, కొప్పుల రజిత, చీరిక అలివేలు ఎన్నికయ్యారు.మరో 15 మంది సమ్మక్క, భూక్యా శ్రీదేవి,బొంతు సమత,ఉమ,ఊర్మిళ, గింజల లక్ష్మి, పైళ్ల భారతమ్మ,మోకు భవాని, బచ్చు శ్రీలత, నాగలక్ష్మి,అరుణ, రమాదేవి,బొబ్బ లక్ష్మి,పిట్టల సుభద్ర కమిటీ సభ్యులు గా ఎన్నికయ్యారు. మార్చి 31న యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట లో జరిగిన మహిళా రైతుల రాష్ట్ర సదస్సులో ఈ ఎన్నిక జరిగింది. ఏప్రిల్ 13న జరుగు రైతుల ధర్నాలో మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం..

**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 1 (జనం సాక్షి)** : తెలంగాణ ప్రభుత్వం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ హైదరాబాద్ నందు మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు అర్హులైన విధ్యార్థినీల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండజిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ ఒక ప్రకటనలో తెలిపారు. 2026-2027 విద్యా సంవత్సరానికి గాను తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు మరియు ఇతరత్రా కారణాల వలన నిరాశ్రయులైన బాలికలు, చిల్డ్రన్ హటరీం, మహిళా సంస్థలలోని బాలికలు మరియు అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, దివ్యాంగ బాలికల నుండి ఈ క్రింది మూడు సం.ల డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కోర్సులో 60 సీట్లకు గాను మొత్తం 360 సీట్లలో 70% సీట్లు అనాధ బాలికలు, తల్లి లేదా తండ్రి కోల్పోయిన నిరుపేద బాలికలు డెస్టిట్యూట్స్, అక్రమ రవాణా బాధిత బాలికలకు కేటాయించినట్టు తెలిపారు.

# మహనీయులను తలుచుకోవటం జన్మరుణం తీర్చుకోవటమే..

## యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు, మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ చలం



**హైదరాబాద్ (జనంసాక్షి)** : దేశాన్ని అంటరానితనం, అమానవీయతల నుంచి బయటపడేసి మనుషులంతా ఒకటేనని చాటి చెప్పిన మహనీయులను తలచుకోవడం జన్మ రుణం తీర్చుకోవటం లాంటిదేనని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు, మాజీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కె.వి. చలం తెలిపారు. కులాలుగా వర్ణాలుగా వర్గాలుగా విడిపోయిన సమాజాన్ని ఒకటి చేసి దేశ సమైక్యతను కాపాడేందుకు జీవితాలను అంకితం చేసిన పోతులూరి వీరబ్రహ్మం, మహాత్మ జ్యోతిబాపూలే బాబాసాహెబ్ అంబేద్కర్, దొడ్డి కొమరయ్య గౌతు లచ్చన్న లాంటి మహనీయులు ఏప్రిల్ మాసంలోని జన్మించారన్నారు. బుధవారం నాడు విశాఖపట్నంలోని కోర్టు దగ్గర మహాత్మ జ్యోతిబాపూలే గౌతు లచ్చన్నల విగ్రహాల వద్ద "బడుగు యోధుల మహనీయుల మాసం" గోడ పత్రికను తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ సభ్యులు నరసింహ చారితో కలిసి కె.వి. చలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.వి. చలం మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మము , జ్యోతిబాపూలే, అంబేద్కర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పి.శివశంకర్, గౌతు లచ్చన్న వంటి బహుజన యోధుల శోభాయాత్రలు ప్రతీ పట్టణంలో నిర్వహించాలని పేర్కొన్నారు. ఇంతవరకు బీసీలకు రాజకీయ రేజర్వేషన్లు ఇవ్వలేదని, మహిళల కు 33% రేజర్వేషన్లలో బీసీ మహిళల వాటా తేల్చాలన్నారు. దీనికోసం బీసీలు ఏకమై పోరాడాలన్నారు. బీసీలకు చట్ట సభల్లో రేజర్వేషన్లు ఆర్థిక, రాజాకీయ, సామాజిక రంగాల్లో రేజర్వేషన్లు ఇవ్వాలన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, బహుజన ఉద్యమ కవి జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ఉన్నత మానవీయ సమాజం కోసం తపించి జాతిని జాగృతం చేసిన యోధులు జన్మించిన ఏప్రిల్ మాసాన్ని బడుగు యోధుల మహనీయుల మాసంగా జరుపుకోవడం స్ఫూర్తిదాయకమైందని తెలిపారు. స్వాతంత్రం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా సగం దేశంగా ఉన్న బీసీలకు నేటికీ చట్టసభల్లో సమ వాటా లభించలేదన్న ఆవేదనను వ్యక్తం చేశారు. బీసీలకు ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయం నేటికీ దక్కలేదన్నారు. కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపజేసే రంపం, కొడవలి, గొడ్డలి, నాగలి సహస్రవృత్తుల సమస్త చిహ్నాలను తన కవిత ఖడ్గాలను చేసిన శ్రీ శ్రీ కూడా ఏప్రిల్ మాసంలోనే జన్మించారని గుర్తు చేశారు. ఈ దేశంలో జరగాల్సింది వర్గ పోరాటాలు కాదు, వర్ణ పోరాటాలని తేల్చి చెప్పారు. జగన్నాథ రథచక్రాలను తయారు చేసిన చేతులకు రాజ్యాధికారం దక్కాలని బహుజన కవులు ,బహుజన ప్రస్థానాలను రాస్తున్నారని చెప్పారు. స్వాతంత్రం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా బడుగులు తమ హక్కులను అడగటం ఈ శతాబ్ద విచారకరమన్నారు. బడుగుల కోసం గొంతెత్తడాన్ని కులకోణం నుంచి కాకుండా సామాజిక కోణం నుంచి చూస్తే దశకు సమాజం ఎదగాలన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారమే అసలు తాళం చెవి అని, అది బడుగుల చేతికి వచ్చినప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంబేద్కర్ చెప్పిన దారిలోనే సామాజిక ఉద్యమాలు జరుగుతున్నాయని వివరించారు. బీసీలకు చట్టబద్ధ హక్కుల కోసం ఉద్యమ ఉత్తేజంతో సాగుతున్న ఈ తరుణంలో బడుగు మహనీయుల మాసంను ప్రతి ఊరు ప్రతి వాడలో జరుపుకుంటూ సాంస్కృతిక, సామాజిక ఉద్యమాలను కొనసాగించాలని జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ సభ్యులు నరసింహాచారి మాట్లాడుతూ విశాఖ నగరంలో భారీగా పోతులూరి వీరబ్రహ్మం శోభాయాత్ర జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ అంబేద్కర్ భవన్ అధ్యక్షులు వి. కల్యాణరావ్ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జె.వి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
02 ఏప్రిల్ 2026

# ప్రభుత్వ సంస్థల్లో తాత్కాలిక ఉద్యోగాలు

**భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితం హామీ ఇస్తుంది. విద్య, వైద్యం, ఉపాధి ఇవి కేవలం హక్కులు మాత్రమే కాదు, సమానత్వ సమాజానికి పునాదులు. ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నారు. గత కొంత కాలంగా ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని ప్రైవేట్ పరం చేస్తున్నారు.**

మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థల్లోనే తాత్కాలిక ఉద్యోగాలను నియమించి ప్రైవేటీకరణకు తెరతీస్తున్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ విధానం ఇందుకు కారణం. దీంతో ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీన పరుస్తున్నారు. ఈ విధానం ప్రారంభమైనప్పటి నుండి వేలాది మంది యువతకు ఉపాధి ఒక మాయమృగంలా మారింది. శ్రమ దోపిడి పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో 1990 దశకంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానం ప్రారంభమైనది. ఇప్పుడు తెలంగాణలో కూడా కొనసాగడంతో ఆందోళన మొదలైంది.



### కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాల వల్ల నష్టాలు

భారతదేశంలో ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ ఒక ఆర్థిక విధాన మార్పు ఫలితం. 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల తర్వాత, లిబరలైజేషన్, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ (ఎల్‌పీజీ) విధానాలు దేశ ఆర్థిక దిశను పూర్తిగా మార్చాయి. ప్రభుత్వ రంగాన్ని తగ్గించి, ప్రైవేట్ రంగానికి ప్రాధాన్యం పెరిగింది. ప్రభుత్వం ఖర్చులను, పరిపాలనా భారాన్ని తగ్గించుకోవడం కోసం ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా తాత్కాలిక ఉద్యోగాలు నియమించి నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ వంటి తాత్కాలిక ఉద్యోగ నియామకాలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో, పథకాల నిర్వహణకు తాత్కాలిక ఉద్యోగులను నియమించుకుంటున్నారు. ముఖ్యంగా క్లీనింగ్, భద్రత, డేటా ఎంట్రీ, ఆరోగ్యం, విద్య వంటి అనేక రంగాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం కొనసాగుతుంది. గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుల నుంచి యూనివర్సిటీ ప్రొఫెసర్ల వరకు ఇదే విధానం కొనసాగుతుంది. వీరిలో అత్యధిక బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల వారే. వీరి జీవితం అగమ్యగోచరంగా మారింది. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం అంటే భద్రత, గౌరవం, పెన్షన్ వంటి హామీలు ఉండేవి. ఔట్సోర్సింగ్ విధానం కాలక్రమేణా ఉద్యోగ నిర్మాణాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ విధానంలో ఉద్యోగ భద్రత కరువైనది. ఉద్యోగ అస్థిరత, శాశ్వత ఉద్యోగులతో పోలిస్తే చాలా తక్కువ జీతం, భవిష్యత్తుపై నమ్మకం సన్నగిల్లి, మానసిక ఒత్తిడి పెరుగుతుంది. మధ్యవర్తిగా ఆధిపత్య వర్గాలకు చెందిన ఏజెన్సీలు కొనసాగడంతో కార్మిక హక్కులు బలహీనపడ్డాయి. మరోవైపు రాజ్యాంగ హామీలకు విరుద్ధంగా నియామకాల్లో రిజర్వేషన్ రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారు. సామాజిక న్యాయం కోసం ఏర్పడిన రిజర్వేషన్ విధానాన్ని పక్కన పెట్టడం ద్వారా, అణగారిన వర్గాలకు మరింత అన్యాయం జరుగుతోంది. మధ్యవర్తుల పెత్తనం, ఏజెన్సీల ద్వారా వేతనాలు ఇవ్వడం వల్ల జీతంలో కోతలు పెరుగుతున్నాయి. అదనపు పనిభారం పెరిగింది. అంతిమంగా సామాజిక సంఘర్షణకు దార తీస్తున్నాయి.

### కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నీళ్లు, నిధులు ,నియామకాలు అనే నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించిన తెలంగాణలో కూడా అవుట్సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ విధానం కొనసాగడం గమనార్హం. ఉద్యోగాల కోసం కొట్లాడిన తెలంగాణలో ఈ విధానం మరింత విస్తరించి, దాదాపు ఐదు లక్షల మంది జీవితాలను ప్రభావితం చేస్తోంది. వీరంతా ప్రభుత్వ పనులను నిర్వర్తిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేదు. ఉద్యోగ భద్రత లేదు. ఏజెన్సీల ఆధీనంలో పనిచేస్తూ, మధ్యవర్తుల దోపిడీకి గురవుతున్నారు. రోజూ కష్టపడుతూ, నెలాఖరులో జీవనోపాధికి సరిపోని జీతంతో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. వారి జీవితం ఆధునిక వెట్టి చాకిరిగా మారింది. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు అవకాశాలు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో మొన్న ధర్నా చౌక్(ఇందిరా పార్క్ దగ్గర) వద్ద పెద్ద ఎత్తున ఉద్యమించారు. గౌరవప్రదమైన జీవితం కోసం, ఉద్యోగ భద్రత కోసం, రాజ్యాంగ హక్కుల సాధన కోసం గళమెత్తారు.

కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి ప్రజా ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు మద్దతుగా నిలిచారు. తెలంగాణ ఎస్సీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పక్షాన మాట్లాడారు. కల్వకుంట్ల కవిత మిలియన్ మార్చ్ తరహాలో 5 లక్షల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఆఫ్ మిలియన్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. విశారదన్ మహారాజ్ అవుట్సోర్సింగ్ మరియు కాంటాక్ట్ ఉద్యోగుల సమస్యలో భాగమై పోరాడుతామని పిలుపునిచ్చారు. ఇప్పటికే డాక్టర్ విశారదన్ జేఏసీ ఆధ్వర్యంలో అనేక ప్రజా సమస్యలపై ఉద్యమించారు.

ఇటీవల కుమ్మెర ఘటన, వెలుగుమట్ల భూదాన్ సమస్యపై పోరాడారు. ఇప్పుడు ఈ ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలని విశారదన్ మరియు కవిత పోరాటం ఆ ఉద్యోగుల్లో ఆశలను రేకెత్తిస్తుంది. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ విధానాన్ని సమీక్షించాలి. ఉద్యోగులకు కనీస హక్కులు, సముచిత వేతనం, స్థిరత్వం కల్పించాలి. లేకపోతే ఈ విధానం సమాజంలో అసంతృప్తి, అసమానతలను మరింత పెంచుతుంది. ఉద్యోగం అంటే కేవలం జీవనోపాధి కాదు. అది మనిషి గౌరవానికి ప్రతీక. ఆ గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత. ఇది రాజ్యాంగ మౌలిక హక్కు. సమాన పనికి సమాన వేతనం, కనీస భద్రత, ఉద్యోగ గౌరవం కల్పించడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది.

**సంపతి రమేష్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428**



# సర్టిఫికెట్ సంస్కృతా VS జ్ఞాన సంభాషణా?

## భారతీయ యూనివర్సిటీల్లో 'సెమినార్ల' నిర్వహణ తీరుతెన్నులు



భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో ఇటీవల పెరుగుతున్న ఒక ప్రమాదకర ధోరణి అకడమిక్ సెమినార్లు (సదస్సులు) అసలు ఉద్దేశ్యాన్నే ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి అనే పేరుతో నిర్వహించే అనేక సెమినార్లు వాస్తవానికి జ్ఞాన వినిమయం కోసం కాకుండా "సర్టిఫికెట్ సంపాదన" కోసం జరిగే యాంత్రిక కార్యక్రమాలుగా మారుతున్నాయి. ఒకే రోజులో తొంభై మంది ప్రసంగకులు, ఒక్కొక్కరికి రెండు నిమిషాల సమయం, చివరికి ఒక సర్టిఫికెట్ అనే నామాకార్థం తంతు జరుగుతుంది. ఈ మోడల్ ను అనుసరించటం వల్ల శాస్త్రీయ చర్చకు, విమర్శాత్మక ఆలోచనకు, కొత్త పరిశోధనల అభివృద్ధికి చోటే ఉండటం లేదు. ఇది కేవలం సమయం, డబ్బు, మానవ వనరుల వృథా మాత్రమే కాకుండా, అకడమిక్ ప్రమాణాల పతనానికి సంకేతంగా మారుతుంది.

సెమినార్ అనే పదం సారాంశం లోతైన చర్చ, ఆలోచనల పరస్పర మార్పిడి, పరిశోధనల విమర్శనాత్మక సమీక్ష. కానీ ప్రస్తుతం జరుగుతున్న అనేక సదస్సుల్లో ఈ మూల స్ఫూర్తి కనిపించడం లేదు. పేపర్ ప్రెజెంటేషన్ అనేది రెండు నిమిషాల్లో ముగిసే ప్రసంగం కాదు. అది నెలల తరబడి చేసిన పరిశోధనకు ప్రతిఫలం. అలాంటి పేపర్‌కు కనీసం ఇరవై ఐదు నిమిషాల సమయం కేటాయించి, తర్వాత ప్రశ్నలు, విమర్శలు, సూచనలు తీసుకోవడం అనేది ప్రపంచవ్యాప్తంగా అనుసరించే సాధారణ ప్రమాణం. కానీ మన దేశంలో అనేక చోట్ల ఈ ప్రమాణాలు పూర్తిగా విస్మరించబడుతున్నాయి.

ఇక్కడ ప్రధాన సమస్య ప్రేరణలలో ఉంది. చాలా మంది పరిశోధకులు, అధ్యాపకులు తమ సీవీ (కరికులంలో వేయిటీజీ)లో పాయింట్లు పెంచుకోవడానికి, ప్రమోషన్ల కోసం, లేదా యూజీసీ (యూని వర్సిటీ గ్రాంట్స్ కమీషన్) మార్గదర్శకాల ప్రకారం అవసరమైన "పార్టిసి పేషన్" సర్టిఫికెట్ల కోసం పరిశోధక విద్యార్థులు, ఇంతర అకాడమీ షన్లు ఈ సదస్సులకు హాజరవుతున్నారు. ఇదే అవసరాన్ని కొందరు నిర్వాహ కులు వ్యాపారంగా మార్చుకుని, తక్కువ సమయంలో ఎక్కువ మందిని "సర్దుకోవడం" ద్వారా ఆదాయం పొందుతున్నారు. ఫలితంగా సెమినార్ అనే అకడమిక్ వేదిక, ఒక ప్రొసీజరల్ ఫార్మాలిటీగా మారిపోతోంది.

అంతర్జాతీయంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు నిర్వహించే సదస్సులలో ప్రమాణాలు చాలా కఠినంగా ఉంటాయి. మొదటగా, పేపర్ల ఎంపిక కఠినమైన పీర్ రివ్యూ (Peer Review) ప్రక్రియ ద్వారా జరుగుతుంది. రెండవది, ఒక సెషన్‌లో సాధారణంగా మూడు లేదా నాలుగు పేపర్లకే అవకాశం ఇస్తారు, ప్రతి పేపర్‌కు 20--30 నిమిషాల ప్రెజెంటేషన్, అదనంగా 10--15 నిమిషాల చర్చ సమయం ఉంటుంది. మూడవది, సెషన్ చైర్, తన సుదీర్ఘ అనుభవంతో ఆ సెమినార్ లో వచ్చిన పేపర్లు లో ఉన్న లోపాలు,మంచి సుగుణాలు తెలిపి తగిన సూచనలు, సలహాలు ఇస్తారు.అతను పేపర్ నాణ్యతపై లోతైన విమర్శాత్మక విశ్లేషణ చేస్తారు. ఈ విధానం ద్వారా మాత్రమే నిజమైన జ్ఞాన సంభాషణ సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో భారతదేశంలో తక్షణ మార్పులు అవసరం. ముందుగా, యూజీసీ వంటి నియంత్రణ సంస్థలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే సెమినార్లకు తగిన ముందొస్తు "స్పష్టమైన మార్గదర్శకాలు" రూపొందించి, వాటి అమలును కఠినంగా పర్యవేక్షించాలి. ఒకరోజు సదస్సుల్లో పాల్గొనే వారి సంఖ్యకు పరిమితి విధించాలి. ప్రతి పేపర్‌కు కనీస సమయం, చర్చకు కేటాయించాల్సిన సమయం వంటి అంశాలను నియమాలుగా నిర్దేశించాలి. అలాగే, సెమినార్ కు సంబంధించిన "సర్టిఫికెట్లకు విలువ" ను కేవలం సదస్సు లో "పాల్గొనడం" మే కాకుండా, "నాణ్యత" ఆధారంగా నిర్ణయించే విధానాన్ని అమలు చేయాలి.

విశ్వవిద్యాలయాల బాధ్యత మరింత ముఖ్యమైనది.ఒక డిపార్ట్మెంట్ లో ఒక అకాడమిక్ ఇయ్యర్ లో ఎన్ని సెమినార్లు నిర్వహించారు? అనే సంఖ్యాపరమైన విజయాల కంటే, ఏలాంటి నాణ్యతాపరమైన ప్రమాణాలతో నిర్వహించారు అనే విషయాలకు ప్రాధాన్యతగా ఇవ్వాలి. సెమినార్ నిర్వహణలో ప్రారంభ సమావేశాల (Inaugural sessions) సమయాన్ని తగ్గించి, ప్రధాన అకడమిక్ చర్చలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతి సెషన్‌కు ఒక స్పష్టమైన థీమ్ ఉండాలి, సంబంధిత పేపర్లను మాత్రమే ఆ సెషన్‌లో చేర్చాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మోడళ్లను సమన్వయం చేసి, ప్రపంచవ్యాప్తంగా నిపుణులను చర్చలో భాగం చేయాలి. ఇంకా ఒక ముఖ్యమైన అంశం "అకడమిక్ నైతికత" (అకడమిక్ ఎథిక్స్). పరిశోధకులు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా, నిజమైన జ్ఞానం కోసం సదస్సులకు హాజరవ్వాలి. నాణ్యతలేని సదస్సులను నిరాకరించడం కూడా ఒక రకమైన అకడమిక్ నిరసనగా మారాలి. ఇదే విధంగా, అధ్యాపకులు తమ విద్యార్థులకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలి. మొత్తంగా చూస్తే, సెమినార్ వ్యవస్థలో మార్పు అనేది కేవలం నియమాల మార్పు కాదు. అది ఒక సాంస్కృతిక మార్పు. "సర్టిఫికెట్ సంస్కృతి" నుంచి "జ్ఞాన సంస్కృతి" వైపు ప్రయాణం ప్రారంభమవ్వాలి. లేకపోతే, అకడమిక్ రంగం క్రమంగా తన విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంది. నిజమైన పరిశోధనకు, లోతైన చర్చలకు, సృజనాత్మక ఆలోచనలకు వేదికగా సెమినార్లు మళ్లీ మారాలంటే ఇప్పుడే యూజీసీ వంటి సంస్థలు, యూనివర్సిటీలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## ఆటలమడుగు

బంతి బ్యాటు...
చూడ ముచ్చట పడ...

సరదా ఆట
పొట్టిక్రికెట్టు ఆట
కాలంపై వేటు
విద్యకు చేటు

రోజుల తరబడి
వలపుల మరువంపు తడి
కొట్టుడు పట్టుడు
కప్పు చే పట్టుడు

డబ్బుల వరదా
ఉన్నోడి సరదా
సమయ పరిమితి
ఉంటేనే ఉన్నతి

సాగుతుంది కదా
విద్యా ప్రగతి
లేదా కలల సాకార అధోగతి

**రేడియమ్**
**9291527757**

# తెలంగాణ రైతు భరోసా - వ్యవసాయ స్థిరత్వం పెట్టుబడి భద్రత

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక-సామాజిక నిర్మాణంలో వ్యవసాయం కేవలం ఒక జీవనాధార రంగం మాత్రమే కాదు; అది గ్రామీణ సమాజానికి ప్రాణనాడి. రైతు పంట వేసే ముందు నుంచే అప్పు, విత్తన వ్యయం, ఎరువుల ధరలు, కార్మిక వ్యయం, నీటి అనిశ్చితి, మార్కెట్ ఒడిదుడుకులు అతనిపై ఒత్తిడిని పెంచుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి సమయానుకూల పెట్టుబడి మద్దతు అందడం అంటే రైతుకు కేవలం నగదు సహాయం కాదు; సాగు ప్రారంభించడానికి ధైర్యం, అప్పు బారం తగ్గించుకునే వీలు, పంటపైన నమ్మకం, కుటుంబ ఆర్థిక ప్రవాహానికి ఒక స్థిర మద్దతు. తెలంగాణలో రైతు బంధు తర్వాత రైతు భరోసా రూపంలో సాగుతున్న ఈ మార్పు, ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న వ్యవసాయ నిర్ణయాల క్రమంలో చూడాల్సిన అంశం.

మొదట సంఖ్యల విషయానికి వస్తే, అధికారిక పత్రాల్లో 26-01-2025 న రైతు భరోసా పథకం ప్రారంభించబడినట్లు, ఈ పథకం కింద ఎకరానికి సంవత్సరానికి ?12,000 చొప్పున పెట్టుబడి మద్దతు అందిస్తున్నట్టు 2025-26 బడ్జెట్ ప్రసంగం స్పష్టం చేసింది. అమలుకు ?18,000 కోట్లు కేటాయించినట్టు కూడా అదే పత్రం చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వ జిల్లా స్థాయి అధికారిక సమాచారం ప్రకారం ఈ మొత్తం సీజన్‌కు ?6,000, అంటే ఖరీఫ్‌కు ?6,000, రబీకి ?6,000 చొప్పున నిర్మితమైంది. ఈ నేపథ్యంలో, "70 లక్షల మందికి ?9 వేల కోట్లు" ఉదాహరణకు 70 లక్షల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి భారీ స్థాయిలో చెల్లింపు జరిగినట్టయితే మొత్తం పరిమాణం రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ స్థాయిని దాటి చాలా పెద్దదైపోతుంది. అందువల్ల నిష్పక్షపాత విశ్లేషణలో నిర్ధారిత సంఖ్యలనే ఉపయోగించడం అవసరం.

తెలంగాణ వ్యవసాయ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే 2014 తర్వాతి మార్పులను కూడా చూడాలి. రాష్ట్ర సామాజిక-ఆర్థిక అవలోకనం ప్రకారం 2014-15లో రాష్ట్ర మొత్తం ప్రస్తుత ధరల జీఎస్వీఏలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 16.3% ఉండగా, 2022-23 నాటికి అది 18.2% కు పెరిగింది. ఇది చిన్న విషయం కాదు. ఒక రాష్ట్ర ఆర్థిక నిర్మాణంలో వ్యవసాయ రంగం వాటా పెరగడం అంటే గ్రామీణ ఉత్పత్తి సామర్థ్యం, సాగు విస్తీర్ణం, నీటి అందుబాటు, మద్దతు విధానాలు, మార్కెట్ చలనం వంటి అనేక అంశాల కలయిక. ఇదే నివేదిక ప్రకారం 2014-15 నుండి 2022-23 మధ్య నీటిపారుదల ప్రాజెక్టులపై ?1.61 లక్షల కోట్లు ఖర్చు చేయగా, స్థూల సాగునీరు లభించిన విస్తీర్ణం 62.48 లక్షల ఎకరాల నుంచి 135 లక్షల ఎకరాలకు పెరిగింది. ఇది 117% పెరుగుదల. వ్యవసాయంలో నగదు మద్దతు ఒకటి అయితే, నీరు, విద్యుత్, మౌలిక వసతులు మరోటి. రైతు భరోసా ప్రభావాన్ని అంచనా వేయాలంటే ఈ విస్తృత నేపథ్యం తప్పనిసరిగా అవసరం.

రైతు మద్దతు పథకాల చరిత్రను చూస్తే తెలంగాణలో 2018లో రైతు బంధు పథకం ప్రారంభమైంది. అధికారిక సామాజిక-ఆర్థిక పత్రాల ప్రకారం ఈ పథకం కింద భూస్వామ్య రైతులకు ఎకరానికి సంవత్సరానికి ?10,000 పెట్టుబడి మద్దతు అందించబడింది. యాసంగి 2021-22 నాటికి సుమారు 63 లక్షల రైతులు ఈ పెట్టుబడి మద్దతు పొందారని ఒక ప్రభుత్వ ఆధార పత్రంలో కనిపిస్తోంది. ఆ పత్రం మరో ముఖ్యమైన వాస్తవం కూడా చెబుతోంది: లబ్ధిదారుల్లో 72.58% మార్జినల్ రైతులు, 18.30% చిన్న రైతులు కాగా, పెద్ద రైతులు కేవలం 0.1% మాత్రమే. ఈ సంఖ్యలు చాలా కీలకం. ఎందుకంటే రైతు మద్దతు పథకాలు పెద్ద భూస్వాములకు మాత్రమే ఉపయోగపడతాయని వచ్చే విమర్శకు ఇవి సమాధానం ఇస్తాయి. వాస్తవానికి తెలంగాణలో లబ్ధిదారుల సామాజిక నిర్మాణం చిన్న, సూక్ష్మ రైతుల ఆధిపత్యంలో ఉందని దీని ద్వారా తెలుస్తోంది.

అయితే రైతు బంధు పథకంపై విమర్శలు కూడా వచ్చాయి. సాగుకు పనికిరాని భూములు, రియల్ ఎస్టేట్ భూములు, వ్యవసాయం చేయని వర్గాలు కూడా పరోక్షంగా లబ్ధి పొందుతున్నాయన్న అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ విమర్శలను 2024-25 తెలంగాణ బడ్జెట్ ప్రసంగం నేరుగా ప్రస్తావించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును రైతు భరోసాగా మార్చిన ఉద్దేశం "నిజమైన రైతుకు" మద్దతు చేరేలా చేయడమేనని తెలిపింది. మొదటి దశలో సంవత్సరానికి ?15,000 ప్రకటించినా, తర్వాత విధివిధానాల రూపకల్పన, భూముల గుర్తింపు, అర్హుల నిర్ధారణ, సాగుభూమి-అసాగుభూమి వేర్పాటు వంటి అంశాల తర్వాత 2025-26 బడ్జెట్‌లో అమలులో ఉన్న చెల్లింపు నిర్మాణం ?12,000 గా నమోదైంది. ఈ మార్పు రాజకీయంగా విమర్శల పాలైనా, పరిపాలనా దృష్టిలో లక్ష్యిత ప్రయోజనం, పబ్లిక్ ఫండ్ దుర్వినియోగం నియంత్రణ, అర్హుల ఎంపిక వంటి కోణాల్లో పరిశీలించాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎన్ని సార్లు ఇచ్చింది అన్న మీ ప్రశ్నకు లభ్యమై ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ఇలా చెప్పవచ్చు. 2024-25 బడ్జెట్‌లో రైతు భరోసా విధాన మార్పు ప్రకటించబడింది, కానీ 15-08-2024 న స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక ప్రసంగంలో ప్రభుత్వం ఇంకా సూచనలు సేకరించి విధివిధానాలు ఖరారు చేసి ప్రారంభిస్తామని పేర్కొంది. అంటే 2024లో అమలు అంతిమ రూపంలోకి ఇంకా రాలేదు. 2025-26 బడ్జెట్ ప్రసంగం మాత్రం 26-01-2025 న రైతు భరోసా ప్రారంభించామని స్పష్టంగా చెబుతోంది. జిల్లా అధికారిక పేజీ ప్రకారం ఈ పథకం సీజన్‌కు ?6,000 చొప్పున ఉండడం వల్ల, అమలు నిర్మాణం ఖరీఫ్, రబీ అనే 2 విడతల చెల్లింపు విధానంలో ఉందని అర్థం అవుతోంది. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో అధికారికంగా రైతు భరోసా అమలులోకి వచ్చిన తర్వాత కనీసం 2 సీజనల్ విడతలుగా చెల్లింపుల నిర్మాణం ఉద్దేశించబడిందని చెప్పవచ్చు. అయితే 22-03-2026 నాటికి ఖచ్చితంగా ఎన్ని విడతలు మొత్తం జమ అయ్యాయి అన్న సంఖ్యకు స్పష్టమైన అధికారిక విడుదల నోట్ నాకు లభించలేదు. అందువల్ల నిర్ధారించని సంఖ్యను చెప్పడం సరికాదు.

ఇప్పుడు రైతు భరోసా వ్యవసాయంపై చూపే వాస్తవ ప్రభావాన్ని పరిశీలిద్దాం. వ్యవసాయంలో ప్రధాన సమస్య "పంట కాలం మొదలవ్వక ముందే డబ్బు అవసరం" అనే దాని చుట్టూ తిరుగుతుంది. రైతు పంట వేయాలంటే విత్తనం, ఎరువు, పురుగుమందు, ట్రాక్టర్ దున్నింపు, కూలి, మోటారు మరమ్మతు, నీటి సరఫరా, పశువుల నిర్వహణ, రవాణా ఖర్చులు వెంటనే వస్తాయి. ఈ సమయంలో ప్రభుత్వం ఇచ్చే డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ సపోర్ట్ రైతును ప్రైవేట్ అప్పుల బారి నుంచి కొంతవరకు తప్పిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ సాహుకారుల వద్ద నెలకు 2% నుంచి 5% వరకు వడ్డీతో అప్పు తీసుకోవాల్సిన పరిస్థితి తగ్గుతుంది. ఉదాహరణకు సంవత్సరానికి ఎకరానికి ?12,000 అంటే సీజన్‌కు ?6,000. 2 ఎకరాల చిన్న రైతుకు సీజన్‌కు ?12,000 వస్తే విత్తనం, ప్రారంభ దున్నింపు, కొంత ఎరువు వ్యయం నిర్వహించగలడు. ఇది మొత్తం సాగు ఖర్చును భరించకపోయినా, ప్రారంభ పెట్టుబడి ఒత్తిడిని తగ్గించే ప్రభావవంతమైన మద్దతు.



తెలంగాణలో రైతు మద్దతు నిర్మాణాన్ని సమగ్రంగా చూడగానే మరొక ఆసక్తికర అంశం కనిపిస్తుంది. 2014 తర్వాత సాగునీటి విస్తీర్ణం 117% పెరగడం, వ్యవసాయ రంగం జీఎస్వీఏ వాటా 16.3% నుంచి 18.2% కు పెరగడం, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి మద్దతులు రావడం వల్ల ఉత్పత్తి స్థాయిలో పెరుగుదల వచ్చింది. అయితే ఉత్పత్తి పెరిగితేనే రైతు ధనవంతుడు అవడంలేదు. మార్కెట్లో ధర పడిపోతే రైతు మళ్లీ నష్టపోతాడు. అందుకే 15-08-2024 అధికారిక ప్రసంగంలో సన్న బియ్యం రకాలపై క్వింటాల్‌కు ?500 బోనస్ ప్రకటించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది రైతు భరోసా పెట్టుబడి మద్దతుకు అదనపు ధర ప్రోత్సాహంగా చూడవచ్చు. ఒకవైపు ఎకరానికి నగదు మద్దతు, మరోవైపు మార్కెట్ ధరకు బోనస్, ఇంకా మరోవైపు రుణమాఫీ ఉంటే రైతు కుటుంబ నగదు ప్రవాహం బలోపేతం అవుతుంది.

రైతు భరోసా నిజంగా రైతును ధైర్యంగా నిలబెడుతుందా? సమాధానం: అవును, కానీ కొన్ని షరతులతో. పెట్టుబడి మద్దతు రైతు మానసిక స్థితిపైనా ప్రభావం చూపుతుంది. పంట మొదలుపెట్టేటప్పుడు అతని చేతిలో నగదు ఉంటే నిర్ణయాలు ఆలస్యం కావు. అతను కనీస అవసరాలు తీర్చుకుని సాగు ప్రారంభించగలడు. భూమిని పడేయకుండా ఉంచే అవకాశం పెరుగుతుంది. బలహీన రైతు కుటుంబంలో సాగు నిలిచిపోకుండా ఉండడం కూడా ఒక పెద్ద సామాజిక ప్రయోజనం. దీనిని గ్రామీణ ఉపాధి, కూలీ మార్కెట్, విత్తన దుకాణాలు, ఎరువు సరఫరా వ్యవస్థ, స్థానిక రవాణా వంటి ఉపరంగాలకూ విస్తరించవచ్చు. ఒక రైతుకు ఇచ్చిన ?12,000 నేరుగా అతని ఖాతాలో పడినా, దాని ప్రసరణ స్థానిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అనేక చలనలు సృష్టిస్తుంది. దీనిని మల్టిప్లయర్ ఎఫెక్ట్ అంటారు. అయితే పరిపూర్ణ వ్యవసాయ సురక్షకు రైతు భరోసా సరిపోదు. తెలంగాణలాంటి రాష్ట్రంలో వాతావరణ మార్పులు, అసమాన వర్షపాతం, భూగర్భ జలాల ఒత్తిడి, మోనోక్రాపింగ్, ధాన్య అధికోత్పత్తి, మార్కెట్ అవ్యవస్థ, ప్రాసెసింగ్ లోటు వంటి సమస్యలు ఉనికిలోనే ఉన్నాయి. అధికారిక ప్రసంగాల్లో పంట వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ ప్రోత్సాహం, నీటి నిర్వహణ, విద్యుత్, కొనుగోలు వంటి అంశాలు రావడం వల్ల ప్రభుత్వం వ్యవసాయాన్ని కేవలం నగదు బదిలీతో కాక విస్తృతమైన వ్యవస్థగా చూడాల్సిన అవసరాన్ని గుర్తించినట్టే కనిపిస్తుంది. రైతు భరోసా ఒక మొదటి దశ. దాని చుట్టూ పంట బీమా, కనీస ధర హామీ, సమయానుకూల కొనుగోలు, నిల్వ గోదాములు, గ్రామస్థాయి ప్రాసెసింగ్ కేంద్రాలు, కౌలు రైతుల చట్టబద్ధ గుర్తింపు, మహిళా రైతుల ప్రామాణిక నమోదు వంటి అంశాలు బలపడితేనే అది సంపూర్ణ ఫలితాన్ని ఇస్తుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన మద్దతును ఒక సమగ్ర క్రమంలో చూస్తే 2024లో రైతు బంధు స్థానంలో రైతు భరోసా విధాన ప్రకటన, అర్హతల పునర్వ్యవస్థీకరణ, 2025 జనవరి 26న పథకం ప్రారంభం, ?18,000 కోట్ల కేటాయింపు, ఎకరానికి సంవత్సరానికి ?12,000 నిర్మాణం, సన్న బియ్యంపై ?500 బోనస్ ప్రకటన, ?2 లక్షల వరకు రుణమాఫీ ద్వారా 25.55 లక్షల మందికి పైగా రైతులకు ?21,000 కోట్ల ఉపశమనం వంటి చర్యలు పరస్పర సంబంధం కలిగిన వ్యవసాయ రాజకీయ-ఆర్థిక ప్యాకేజీగా కనిపిస్తున్నాయి. ఈ చర్యలన్నింటినీ కలిపి చూసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం "వ్యవసాయ పెట్టుబడి ం ధర ప్రోత్సాహం ం అప్పు ఉపశమనం" అనే 3-స్థంభాల నమూనాను నిర్మించే ప్రయత్నం చేస్తోందని చెప్పవచ్చు.

ఆదివారం విడుదల చేసిన రైతు భరోసా నిధుల ప్రాధాన్యాన్ని పరిశీలిస్తే, ఇది కేవలం ఖాతాలో పడే డబ్బు మాత్రమే కాదని అర్థమవుతుంది. రైతు భరోసా అధికారిక పథక వివరణ ప్రకారం ప్రతి పంట చక్రం ఆరంభంలో రైతుకు పని మూలధనం అందించడం దీని ప్రధాన లక్ష్యం. అంటే రైతు విత్తనం కొనాలి, పొలం దున్నించాలి, ఎరువులు వేయాలి, కూలీలకు చెల్లించాలి, నీటి వనరులు సిద్ధం చేసుకోవాలి, పురుగుమందులు తీసుకురావాలి అన్న అవసరాలన్నీ మొదట్లోనే వస్తాయి. అచ్చం ఆ దశలో డైరెక్ట్ నగదు మద్దతు అందితే రైతు ప్రైవేట్ అప్పుదారుడి దగ్గరకు వెళ్లే అవసరం కొంత తగ్గుతుంది. అధికారిక ప్రచార సమాచారంలో ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా కోసం ?18,000 కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొనబడింది. ఈ సంఖ్య వ్యవసాయ రంగంలో ప్రభుత్వం పెట్టుబడి మద్దతును ఎంత ప్రాధాన్యంగా చూస్తోందో చూపిస్తుంది. రైతు ఖాతాలో పడే ప్రతి రూపాయి తర్వాత గ్రామ దుకాణం, ఎరువుల వ్యాపారి, విత్తన కేంద్రం, ట్రాక్టర్ యజమాని, వ్యవసాయ కూలి చేతికి చేరుతుంది. అందువల్ల ఈ నిధులకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విస్తృత ప్రసరణ ప్రభావం ఉంటుంది.

తెలంగాణలో దాదాపు 114.93 లక్షల ఎకరాల నికర సాగుభూమి ఉండగా, అంతటి విస్తీర్ణం ఉత్పాదకంగా నిలబడాలంటే రైతు చేతిలో నగదు ప్రవాహం నిలకడగా ఉండాలి. ఒక ఎకరానికి పెట్టుబడి ఖర్చు పంటనుబట్టి మారుతుందనేది నిజం. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నువ్వులు, నూనెగింజలు అన్నీ ఒకే స్థాయి ఖర్చుతో సాగవు. కానీ ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కనీసం ప్రారంభ దశలో రైతు మనోధైర్యాన్ని పెంచుతుంది. అందుకే రైతు భరోసా వంటి పథకాలను కేవలం ఖర్చు కోణంలో చూడడం సరిపోదు. ఇవి వ్యవసాయ ఉత్పత్తి శక్తిని నిలబెట్టే పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ గా కూడా చూడాలి. ముఖ్యంగా నికర సాగుభూమి 114.93 లక్షల ఎకరాలు ఉన్న రాష్ట్రంలో, స్థూల సాగు విస్తీర్ణం 221.67 లక్షల ఎకరాలకు పెరిగిన సమయంలో, పెట్టుబడి మద్దతు లేకుండా వ్యవసాయ చక్రం నిరవధికంగా సాగడం చాలా కష్టం.

ఇక్కడ మరో ముఖ్యాంశం కూడా ఉంది. సాగుభూమి విస్తీర్ణం ఎంత ఉందనేది ఒక సంఖ్య మాత్రమే. ఆ భూమి రైతుకు లాభం ఇస్తోందా లేదా అన్నదే అసలు ప్రశ్న. చాలా సార్లు భూమి ఉన్నా రైతు బలహీనంగానే ఉంటాడు; కారణం పెట్టుబడి లోటు, అప్పు, మార్కెట్ అనిశ్చితి, ధరల పతనం, ప్రకృతి విపత్తులు. అలాంటి సందర్భంలో రైతు భరోసా నిధులు భూమిని ఉత్పత్తి భూమిగా నిలబెట్టే ప్రారంభ ఇంధనంగా పనిచేస్తాయి. ఒకవేళ ఈ నిధులు సమయానికి పడితే 1 ఎకరం రైతుకైనా, 3 ఎకరాల రైతుకైనా, 5 ఎకరాల రైతుకైనా పంట సిద్ధతలో తేడా వస్తుంది. గ్రామీణ ప్రాంతంలో విత్తనం కొనడానికి నగదు లేక సాగు వాయిదా పడడం సాధారణ సమస్య. అందువల్ల నిధుల విడుదల తేదీకి కూడా వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆదివారం విడుదలను అందుకే ఒక సంకేతాత్మక చర్యగా మాత్రమే కాకుండా, వ్యవసాయ చక్రానికి అనుసంధానమైన ఆర్థిక జోక్యంగా చూడాలి.

చివరగా సారాంశంగా చెప్పాలంటే తెలంగాణలో నికర వ్యవసాయ భూమి సుమారు 114.93 లక్షల ఎకరాలు. అదే సమయంలో పంటల పునర్వినియోగం వల్ల స్థూల సాగు విస్తీర్ణం 2022-23లో 221.67 లక్షల ఎకరాలకు చేరింది. ఇది తెలంగాణ వ్యవసాయ విస్తృతిని తెలియజేసే బలమైన గణాంకం. ఈ విస్తీర్ణం అంతా జీవంతో నిండాలి అంటే రైతు చేతిలో నగదు ఉండాలి. ఆ నగదు సమయానికి చేరాలి. అదే రైతు భరోసా పథకం అసలు ఉద్దేశ్యం. ఆదివారం విడుదల చేసిన నిధులు అందుకే కేవలం బ్యాంకు లావాదేవీ కాదు; రైతు పొలంలో విత్తనంగా మారే సాయం, గ్రామీణ మార్కెట్‌లో చలామణి అయ్యే మూలధనం, వ్యవసాయంపై ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేసే ఆర్థిక ప్రకటన. రైతు నిలబడితేనే భూమి నిలబడుతుంది. భూమి నిలబడితేనే తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఆ దిశగా రైతు భరోసా నిధుల విడుదలను ఒక సాధారణ పథక చెల్లింపుగా కాకుండా, వ్యవసాయ నిరంతరతకు అవసరమైన ప్రజా పెట్టుబడిగా చూడాలి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 న నిర్వహించే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. ఏప్రిల్, 2న నిర్వహించబోయే గ్రామ సభలు, మున్సిపల్ వార్డుల్లో సభల నిర్వహణ పై బుధవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీ ద్వారా సూచనలు ఇచ్చారు. గ్రామ సభలు, మున్సిపల్ సభలు పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామ సభల్లో ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రెండున్నర సంవత్సరాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని, అదేవిధంగా కొత్తగా మరికొన్ని పతాకాలు చేపట్టబోతుంది. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వార ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు, మున్సిపాలిటీలో ఈమేరకు అభివృద్ధి పనులు జరిగాయి, ఖర్చు చేసిన నిధులు తదితర విషయాలను గ్రామ సభ సందర్భంగా ప్రజలకు వివరించాలని సూచించారు. కొత్త పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఇచ్చిన రైతు భరోసా, రుణ మాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు 500 రూపాయల బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందిన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు, 500 రూపాయలకే సిలిండర్, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు తదితర అన్ని వివరాలతో కూడిన కరదీపికలు తయారు చేయించి గ్రామ సభకు వచ్చే ప్రతి ఒక్కరికి అందజేయాలని సూచించారు. లబ్ధిదారుల పేర్లు సైతం చదివి వినిపించాలని చెప్పారు. ఎవరైనా అర్జీలు ఇచ్చేవారు ఉంటే వాళ్లనుండి దరఖాస్తులు తీసుకునేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి అర్జీలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభకు అత్యధికంగా ప్రజలు వచ్చే విధంగా చూడాలని, గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా టెంట్, షామియానా, మంచినీరు, ముఖ్యమంత్రి సందేశం చూసేందుకు టి.వి తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. సభ ఉదయం 10 గంటలకు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, సభ ఏ విధంగా నిర్వహించాలి అనే అంశాలను మినిట్ టు మినిట్ కార్యక్రమాలను వివరించారు. ఈ గూగుల్ మీట్లో అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్య,మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**బెజ్జంకి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** మండలంలోని నరసింహులపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ఆమ్లెట్ విలేజ్ అయినా కొత్తపల్లి లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ముఖ్యఅతిథిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్ పాల్గొని ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సీసీ రోడ్లు ఎంతో అవసరమని,ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించడంలో ఈ పనులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జెట్టి రమేష్, ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు కుంట శ్రీనివాస్, జెట్టి అనిల్, కుంట రాజేశ్వరి, జంగపల్లి శ్రావణ్, గ్రామ పెద్దలు కౌడగాని శ్రీనివాస్, కుంట కనకయ్య, ప్రభాకర్, రాములు, సత్యం, తిరుపతి తదితరులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కుంట హరికృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఏసీబీ దాడులు




**సికింద్రాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలన భవనంలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం యూనివర్సిటీ బిల్స్ సెక్షన్లో పనిచేస్తున్న రమేష్, అరవింద్ అనే ఇద్దరు ఉద్యోగులు రూ.13 వేల లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ ఏసీబీ డి.ఎస్.పి జి. శ్రీధర్ వివరాలు వెల్లడించారు. ఓయూ ఇంజనీరింగ్ సెక్షన్కు చెందిన రిటైర్డ్ మహిళ తన పెన్షన్ ఫైల్ ప్రాసెసింగ్ కోసం చాలా రోజులుగా తిరుగుతుంది. బిల్స్ సెక్షన్ సిబ్బంది పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు బిల్స్ సెక్షన్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అరవింద్ను వసంప్రదించాడు. ఈ క్రమంలో అరవింద్ రూ.15 వేల లంచం డిమాండ్ చేశాడు. అక్కడే సీనియర్ అసిస్టెంట్ గా పనిచేసే మరో వ్యక్తి రమేష్ను సంప్రదించాడు. ఆయనతో రూ.13 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ విషయాన్ని బాధితురాలి కుమారుడు ఐదు రోజుల క్రితం ఏసీబీకి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్న ప్రకారం బుధవారం ఓయూ సమీపంలోని బస్ స్టాప్ వద్ద లంచం తీసుకుంటుండగా రమేష్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అరవింద్ వ్యవహారం బయటపడగా ఆయనను కూడా అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరిని రేపు కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

## జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ప్రతిష్టాత్మక అవార్డులు

● మోతుకుపల్లి గ్రామ పంచాయతీ గుడ్ గవర్నెన్స్ విభాగంలో అవార్డు
● మంత్రి సీతక్క అభినందనలు



**కోట్పల్లి, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ తెలంగాణ రాష్ట్రంలోని పంచాయతీలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు కింద రాష్ట్రానికి చెందిన పంచాయతీలు అవార్డులు సాధించడం విశేషం.ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పరిధిలోని కోట్ పల్లి మండల పరిధిలోని మోతుకుపల్లి గ్రామ పంచాయతీ "గుడ్ గవర్నెన్స్" విభాగంలో అవార్డు సాధించింది. గ్రామ స్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది.దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండు విభాగాల్లో తెలంగాణకు అవార్డులు రావడం పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం గర్వకారణం. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, మహిళా సాధికారత దిశగా మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనం. అవార్డులు అందుకున్న మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇలాంటి విజయాలు ఇతర పంచాయతీలకు స్ఫూర్తిగా నిలుస్తాయి అని తెలిపారు.

## నిషేధిత జాబితా నుండి వక్ఫ్ బోర్డ్ సర్వే నంబర్లను తొలగించాలి

● వక్ఫ్ బోర్డు చైర్మన్తో ఎమ్మెల్యే భేటీ



**మల్కాజిగిరి, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** కొత్తగా చేర్చిన వక్ బోర్డ్ సర్వే నెంబర్లను నిషేధిత జాబితా నుండి తొలగించాలని వక్ బోర్డు కార్యాలయంలో చైర్మన్ అజమతుల్లా హుస్సేన్ ను కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పలు కాలనీల ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నానని తెలిపారు. వక్ఫ్ బోర్డు క్లెయిమ్స్ కారణంగా సర్వే నంబర్లు 3, 103, 104, 105, 144, 145, 146, 147, 148 నుండి 154 వరకు గల భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై బుధవారం వక్ఫ్ బోర్డు చైర్మన్ అజమతుల్లా హుస్సేన్ను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ సర్వే నంబర్లుగల భూములు మల్లాపూర్ గ్రామ పరిధిలోకి వస్తాయని కోర్టు మరియు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయని, ప్రజల వద్ద చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. వీటిని వెంటనే 22-ఎ నిషేధిత జాబితా నుండి తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, అమీనుద్దీన్, భాగ్యనందరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన పకడ్బందీగా చేయాలి

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**టేక్మాల్, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** పకడ్బందీగా జనగణన మొదటి విడతలో చేపట్టే ఇండ్ల గణన బ్లాకుల రూపకల్పన పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తాసిల్దార్లను ఆదేశించారు. బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలోని ఇండ్ల గణన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జన గణన మొదటి దశలో బాగంగా చేపట్టే ఇండ్ల గణన ప్రక్రియ వచ్చే నెల మే 11నుంచి జూన్ 09 వరకు నిర్వహించే ఇండ్ల గణనకు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల గణన జాబితా బ్లాక్ లను తయారు చేయడానికి మండలంలోని ఒక రెవెన్యూ గ్రామాన్ని యూనిట్ గా తీసుకుని గరిష్టంగా 300ఇండ్లు లేదా 800 జనాబా ఉండేటట్లు ఇండ్ల గణన బ్లాక్ లను సి ఎం ఎం ఎస్ పోర్టల్ ద్వారా తయారు చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా పటిష్టంగా జనగణన బ్లాకుల రూపకల్పన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు .ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ తులసి రామ్,ఎంపీడీవో రియాజుద్దీన్, ఆర్ఐ శ్రీకాంత్ అధికారులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ను ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే



**మల్దకల్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా గుర్రంగడ్డ గ్రామందగ్గర పెబ్బేరు మండలంరంగాపురం సమీపంలోని తూం వేణుగోపాల్ రెడ్డి ఏవిఏఐఎల్ నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికిరాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి హాజరయ్యారు. ఏవిఏఐఎల్ వాటర్ ప్లాంట్ ను మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యే బండ కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.రాష్ట్ర మంత్రివర్యులుకి సర్పంచ్ తూంకృష్ణారెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.మంత్రివర్యులుకి,ఎమ్మెల్యే కి ప్రోప్రేటర్ తూం వేణుగోపాల్ రెడ్డి దంపతులకు శాలువా కప్పి జ్ఞాపికను ఇచ్చి ఘనంగాసత్కరించి,మంత్రిఎమ్మెల్యే వాటర్ ప్లాంట్ ను సందర్శించి పరికరాలను పరిశీలించారు.వాటర్ ప్లాంట్ లోనిమొదటమంత్రి ఎమ్మెల్యే వాటర్ ను తాగడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా సీనియర్ నాయకులు సుభాన్,పటేల్ ప్రభాకర్ రెడ్డి,జంబురామన్ గౌడ్,సర్పంచ్ రాజశేఖర్,విజయ్ కుమార్, బండారి భాస్కర్,రాఘవేంద్ర రెడ్డి,చక్రధర్ రెడ్డి,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

● తపస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్




**సంగారెడ్డి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** పిఆర్సిని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ కోరారు. హత్నూర మండల శాఖ అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో తపస్ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇచ్చిన నివేదిక అనేక లోపాలు ఉన్నాయన్నారు. మండలానికి జనాభా ప్రకారం రెండు మూడు పాఠశాలలు ఏర్పాటు చేయాలని చెప్పడం ప్రతి ఆవాసానికి ఒక పాఠశాల ఉండాలన్న విద్యాహక్కు చట్టంకు వ్యతిరేకంగా ఉందన్నారు. బడ్జెట్లో విద్యకు కేవలం 8.2 శాతం నిధులు ఇవ్వడం విద్యారంగం పట్ల చిన్నచూపు చూడడమే అన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయుల బాధలు వర్ణనాతీతమని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జీ ఓ.317 బాధితుల సమస్యను పరిష్కారం లభించలేదన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి వేతన సవరణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ఆముదయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా భారీ ఆపరేషన్

● క్రీడామైదానం రక్షణ



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** హైదరాబాద్లోని రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ మైలార్దేవుపల్లిలో హైడ్రా అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి అక్రమ నిర్మాణాలను తొలగించారు. హెచ్ఎండిఏ అనుమతితో ఉన్న లేఔట్లో క్రీడామైదానం కోసం కేటాయించిన సుమారు 6500 గజాల స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడారు. ఈ భూమి విలువ దాదాపు రూ.100 కోట్లుగా అంచనా. ఈ స్థలంలో అనుమతులు లేకుండా జీం3 అంతస్తుల నిర్మాణ దశలో ఉన్న 5 భవనాలు, అలాగే 2 చిన్న గదులను కూల్చివేశారు. గతంలో జీహెచ్ఎంసి నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్లు ఇచ్చినా పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగించడంతో, స్థానికుల ఫిర్యాదుల మేరకు హైడ్రా అధికారులు జీహెచ్ఎంసి, రెవెన్యూ శాఖలతో కలిసి చర్యలు చేపట్టారు.ఇప్పటికే నివాసాలు ఉన్న 2 భవనాలను మాత్రం మినహాయించారు. క్రీడామైదానం తిరిగి అందుబాటులోకి రావడంతో శాస్త్రిపురం కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న పోరాటం ఫలించిందని, ఆక్రమణదారుల బెదిరింపుల మధ్య కూడా చివరకు న్యాయం జరిగిందని తెలిపారు.

# గిరిజన గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిపై వేటు వేయాలి

● అఖిలపక్ష నాయకుల డిమాండ్



**కౌడిపల్లి, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులపై అమానుషంగా చేయి చేసుకుంటున్న ఉపాధ్యాయుడు ఉదయ్ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ వివిధ పార్టీల నాయకులు, గిరిజన జన సమితి నేతలు పాఠశాల ప్రిన్సిపాల్ను కలిసి డిమాండ్ చేశారు.గత కొద్ది రోజులుగా ఉపాధ్యాయుడు ఉదయ్ విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, ఇష్టానుసారంగా వారిపై చేయి చేసుకుంటున్నారని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడే వారిని భయభ్రాంతులకు గురిచేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్, గిరిజన జన సమితి రాష్ట్ర అధ్యక్షులు వినోద్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామగౌడ్, ప్రిన్సిపాల్తో మాట్లాడుతూ, సదరు ఉపాధ్యాయుడిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, విధులనుండి తొలగించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనంలో విద్యార్థులు భోజనం చేసిన తర్వాత చేతులు కడుక్కోవడం కోసం కూడా కనీస వసతులు లేని అద్దె భవనంలో నడపడం విడ్డూరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్, గిరిజన జన సమితి రాష్ట్ర అధ్యక్షులు వినోద్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామగౌడ్, మాజీ ఎంపీపీ రాజు నాయక్, గిరిజన జన సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు దేవిచంద్ రాథోడ్, మండల గిరిజన జన సమితి అధ్యక్షులు గణేష్ రాథోడ్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కశీచనపల్లి ఉప సర్పంచ్ లక్ష్మణ్, బిజెపి నాయకులు హరీష్ గౌడ్, గోరకంటి విష్ణు, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 968 గజాల పార్కును కాపాడిన హైడ్రా




**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, గ్రామంలోని అక్షయ ఎన్క్లేవ్ పేరుతో1983 వ సంవత్సరంలో 7.12 ఎకరాల్లో లే ఔట్ వేశారు. హుడా అనుమతి పొందిన లే ఔట్లో 968 గజాల మేర ఉన్న పార్కును తప్పుడు పత్రాలతో అబ్దుల్ రెహ్మాన్ అలియాస్ గోపాల్ అనే వ్యక్తి కొట్టేయాలని ప్రయత్నిస్తున్నారని స్తానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఈ ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా అధికారులు పార్కు స్థలంగా నిర్ధారించుకున్నారు. ఇప్పటికే జీహెచ్ ఎంసీ ప్రహరీ నిర్మించి గేటు కూడా పెట్టిన విషయాన్ని గుర్తించారు. 2019లో తప్పుడు పత్రాలతో నిర్మాణ అనుమతులు కూడా తెచ్చుకుని ఆక్రమణలకు సిద్ధం కాగా.. కబ్జాదారులపై జీహెచ్ ఎంసీ అధికారులతో పాటు.. సొసైటీ ప్రతినిధులు కూడా కేసులు పెట్టారు. 968 గజాల పార్కు స్థలంలో కబ్జాదారులు వేసిన సామగ్రిని తొలగించి పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.

# లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలి



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఖండిస్తుందని గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎల్ఐసి గద్వాల బ్రాంచ్ ఆఫీసులో బుధవారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో బ్రాంచి ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల సారాంశాన్ని బట్టి చూస్తే, భవిష్యత్తులో స్థిరమైన ఉపాధి ఏ మాత్రం ఉండదని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ద్వారా ఎంతో నైపుణ్యం కలిగిన నిరుద్యోగులను పేపర్ నాప్‌కిన్ మాదిరిగా పరిమిత కాలానికి ఉపయోగించుకొని సమాజం పైకి విసర్జించే ప్రక్రియగా మనకు అర్థమవుతోందనీ, ఇప్పటికే కెనరా బ్యాంక్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో అప్రెంటిస్‌ల పేరుతో తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు ఊపందుకున్నాయనీ, ఈ లేబర్ కోడ్‌ల ఆగమనం తర్వాత అనేక సంఘటిత రంగాల్లో కూడా ఈ రకమైన నియామకాలు పెరిగే అవకాశం ఉందనీ, తద్వారా సంఘటిత రంగాలన్నీ జవాబుదారీతనం లేకుండా నిర్వీర్యమై పోయే ప్రమాదం కూడా ఉందనీ, కార్మికులు, ఎంప్లాయిస్ అని ఒక విపరీతధోరణితో కొత్తగా నామకరణం చేసి దానికి వేతన పరిమితిని విధించడం వెనుక ఉద్యోగులంతా సంఘటితం కాకుండా ఉండాలనే ప్రతిపాదన స్పష్టంగా కనిపిస్తున్నదనీ ,ఇది పూర్తిగా వ్యతిరేకించదగినదని, కార్మికులకు జన్మహక్కుగా పరిగణించే సమ్మె హక్కును పూర్తిగా కాలరాసి, సమ్మె నోటీసును 15 రోజుల నుండి 60 రోజులకు పెంచి, సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత కూడా కన్సిలియేటరీ మీటింగులని, ఆర్బిట్రేటర్ మీటింగ్‌లోనే పేరుతో కాలయాపన చేస్తూ కార్మికుల హక్కులపై ఏమాత్రం శ్రద్ధ లేకుండా నిర్లక్ష్యం వహించాలనే విధంగా ఈ లేబర్ కోడ్‌లు రూపొందించబడ్డాయనీ, సాంఘిక భద్రత యాజమాన్యమే కల్పిస్తుందంటూ పేపర్‌పైన ప్రకటిస్తూ దాని రూపకల్పనకు నిర్దిష్టమైన ప్రతిపాదనలేవీ చేయలేదనీ, మహిళలకు మేలు చేసేందుకే అన్ని వేళల వారి సేవలు ఉపయోగించుకుంటామని చెప్పే మాట వినక మహిళల పట్ల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తున్నదనీ, రాత్రింబవళ్లు పనిచేయించుకునే సంస్కృతి కేవలం మహిళలకే కాదు మిగతా అందరికి కూడా నష్టదాయకమైనదే, కానీ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగంచేసే ప్రక్రియలో ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందనీ, బాల కార్మిక వ్యవస్థ రద్దు చేయాలని ఒకవైపు డిమాండ్ జరుగుతుంటే 14 ఏళ్ల పిల్లలు కూడా కార్మిక సంఘాల్లో సభ్యులుగా చేరవచ్చని కొత్త నిబంధన తీసుకొచ్చారనీ, అంతేకాకుండా అసంఘటిత రంగ కార్మిక సంఘాలకు నాయకత్వం వహించేవారిలో కనీసం 50% ఆ సంస్థలో పనిచేస్తున్నవారై ఉండాలని నిబంధన ద్వారా తమ వాదనను వినిపించలేని వారి అసహాయతను హేళన చేస్తున్నట్లే,అన్నిటికన్నా ప్రమాదకరమైనది 100 మంది కన్నా ఎక్కువ వర్కర్స్ ఉన్న చోట వర్కర్స్ కమిటీ అని ఏర్పాటు చేస్తారట, 20 మంది కన్నా ఎక్కువ వర్కర్లు ఉన్న చోట గ్రీవెన్స్ రెడ్రెసల్ కమిటీ ఏర్పాటు చేస్తారట, అయితే ఈ రెండింటికీ ఛైర్మన్‌గా మాత్రం యాజమాన్యం తరపు నుండే వ్యవహరిస్తారట, దీన్నిబట్టి లేబర్ కోడ్‌ల ద్వారా ముందుకొచ్చిన సంస్కరణలు ఎవరి ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూన్నాయో స్పష్టంగా అర్థం అవుతలేదనీ, అందుచేత 100 సంవత్సరాలు అనేక మంది త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను పూర్తిగా రద్దుచేసి కేవలం కార్పొరేట్లకు ఉపయోగపడే విధంగా ముందుకు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నిర్ద్వందంగా ఖండిస్తుందనీ ,వ్యతిరేకిస్తుందనీ, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని, ఈరోజు ఏప్రిల్ ఒకటి కాబట్టి ఈరోజును బ్లాక్ డే పాటించాలని బంగి రంగారావు అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్, పద్మావతి, ఉదయ్ కుమార్,రాఘవేంద్ర, మల్లికార్జున్,శివశంకర్, అనిల్,కృష్ణ చైతన్య ,రంగయ్య,సూరజ్, సుదర్శన్ శెట్టి, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



**ఉర్కొండ, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా పర్యవేక్షణ బృందం సభ్యులు అన్నారు. ఊరుకొండ మండలాన్ని సందర్శించిన జిల్లా పర్యవేక్షణ బృందం మండల విద్యాధికారి ఊరుకొండ మండలంలోని జకినాలపల్లి మరియు బొమ్మరాజు పల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా స్థాయి పర్యవేక్షణ బృందం సభ్యులు ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం శివశంకర్ స్కూల్ అసిస్టెంట్ బాలగోపాలం మరియు స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మీ నరసింహారావుతో పాటు మండల విద్యాధికారి అబ్దుల్ రహీం సందర్శించడం జరిగింది. సందర్శనలో భాగంగా పాఠశాలలో నిర్వహించేటువంటి వివిధ రికార్డు రిజిస్టర్ లను తనిఖీ చేయడం జరిగింది. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు విద్యార్థుల యొక్క విద్యా ప్రమాణాలను తరగతుల వారిగా పరిశీలించడం జరిగింది. విద్యార్థులు రాసినటువంటి వర్క్ బుక్స్ ను ఏ విధంగా కరెక్షన్ చేశారు మధ్యాహ్నం భోజనం నిర్వహణ ఎలా జరుగుతుంది గ్రంథాలయ నిర్వహణ ఏ విధంగా జరుగుతుంది వంటి పలు విషయాలను పరిశీలించడం జరిగింది. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు చేత సమీక్ష సమావేశం నిర్వహించి ఎక్కడెక్కడ లోపాలు ఉన్న మరియు ఎలా అభివృద్ధి చేసుకోవాలి వంటి విషయాలను క్షుణ్ణంగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్, రామకృష్ణారెడ్డి, మహేష్ ,కవిత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సేంద్రియ ఎరువుల వాడి భూమిని కాపాడుకోవాలి



**చిలప్‌చేడ్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** మండల పరిధిలోని గంగారం గ్రామంలో గురువారం నాడు కృషి విజ్ఞాన కేంద్రం,తునికి ఆధ్వర్యంలో గ్రామంలోని రైతులతో భూమి సుపోషణ, భూసార పరీక్షణ కార్యక్రమని ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం ,తునికి ఉద్యాన శాస్త్రవేత్త ఎం శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి శ్రీ రాజశేఖర్ గౌడ్, ఏఇవో కృష్ణవేణి.గ్రామ సర్పంచ్ సుధీర్ రెడ్డి ,గ్రామ రైతులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు కింద విషయాలు వివరించడం జరిగింది.వరి కోత తర్వాత కొయ్యకలను కలబెట్టడం వల్ల భూమి సారం తగ్గించడం,సూక్ష్మ జీవులు చనిపోయి దిగుబడి తగ్గుతుంది.కాబట్టి వరి కొయ్యకలను కట్టించే యంత్రాలను ఉపయోగించి నెలలో కలియబెట్టి దునాలని అవగాహన జపించడం జరిగింది. పంటకు ముందు ప్రతి ఎకరానికి 8-10 టన్నుల సేంద్రీయ ఎరువులను వాడాలి అదేవిధంగా జనుము జీలుగా తప్పనిసరిగా భూమిలో వెదజల్లి 50 శాతం పూత దశలో నెలలో కలియబెట్టడం వల్ల దాదాపు 20 టన్నుల సేంద్రీయ ఎరువు భూమిలో తయారు అవుతుందని అదే విధంగా భూమిలో సేంద్రీయ కార్బన్ పెరుగుతుందని వివరించడం జరిగింది. జీవనేరువులను కూడా ఉపయోగించి ,రసాయన ఎరువులను ప్రతి పంటకి సూచించిన మోతాదులో వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడేలా అవగాహన కల్పించారు అదే విధంగా కలుపు మందులను రసాయనిక ఎరువులను మెల్లమెల్లగా పూర్తిగా తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేసి నెల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.

# కర్తవ్య నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం మహేందర్



**మెదక్, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా అదనపు ఎస్పీ సేవలందించిన ఎస్. మహేందర్ పోలీస్ శాఖకు ఒక గొప్ప విలువైన సంపదగా నిలిచారు. ఆయన సేవలు, వ్యక్తిత్వం, విధి నిర్వహణలో చూపిన కట్టుబాటు పోలీస్ వ్యవస్థకు ఆదర్శంగా నిలిచేలా ఉన్నాయి. ఎస్సై స్థాయి నుండి ఎస్పీ స్థాయికి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ప్రస్థానం కేవలం పదోన్నతుల కథ మాత్రమే కాదు, నిబద్ధత, కృషి, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన ఒక ప్రేరణాత్మక ప్రయాణం. 1989లో ఎస్సైగా పోలీస్ శాఖలో అడుగుపెట్టిన మహేందర్ మొదటి నుంచే తన కర్తవ్యాన్ని అత్యంత బాధ్యతతో నిర్వర్తించారు. కరీంనగర్ జిల్లా పలు పోలీస్ స్టేషన్లలో పనిచేసిన సమయంలో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, చట్టాన్ని కాపాడటంలో తన ప్రత్యేక ముద్ర వేశారు. ప్రజలకు చేరువగా ఉండటం, బాధితులకు అండగా నిలవడం ఆయన సేవల ముఖ్య లక్షణాలు. సీఐగా ప్రమోషన్ పొందిన తరువాత కూడా ఆయన సేవల్లో అదే ఉత్సాహం కొనసాగింది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పనిచేసినప్పుడు నేర నియంత్రణలో సమర్థవంతమైన చర్యలు తీసుకున్నారు. కఠిన పరిస్థితుల్లో కూడా శాంతంగా వ్యవహరించడం, సమస్యలను చాకచక్యంగా పరిష్కరించడం ఆయన ప్రత్యేకత. డీఎస్పీ/ఏసిపీగా ఉన్న సమయంలో మామునూర్, హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. ముఖ్యంగా హుస్నాబాద్ డివిజన్‌లో ఆయన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకోవడం ద్వారా పోలీసులపై నమ్మకాన్ని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అడిషనల్ ఎస్పీ తరువాత అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహించినప్పుడు కూడా ఆయన తన పరిపాలనా నైపుణ్యాన్ని చాటుకున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో అడ్మిన్ బాధ్యతలు నిర్వహిస్తూ శాఖలో క్రమశిక్షణ, సమర్థత పెంపొందించడంలో విశేష కృషి చేశారు. మెదక్ జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత జిల్లా పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమైనది. మహేందర్ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అనేక పురస్కారాలతో సత్కరించింది. 2010లో సేవా పథకం, 2018లో ఉత్తమ సేవా పతకం, 2025లో మహోన్నత సేవ పథకం లభించడం ఆయన సేవల గొప్పతనానికి నిదర్శనం. అదనంగా తన సేవా కాలంలో 100కు పైగా రివార్డులు, అవార్డులు అందుకోవడం ఆయన ప్రతిభను ప్రతిబింబిస్తుంది. విధి నిర్వహణలో ఆయన చూపిన సౌమ్యత్వం, నిజాయితీ, నైతిక విలువలు ఆయనను ఇతరులకంటే ప్రత్యేకంగా నిలబెట్టాయి. సహచరులతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం, కిందిస్థాయి సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. కఠిన నిర్ణయాలు తీసుకునే సమయంలో కూడా మానవతా దృక్పథాన్ని కోల్పోకుండా ఉండటం ఆయన వ్యక్తిత్వానికి మరింత విలువ చేకూర్చింది. మొత్తానికి మహేందర్ పోలీస్ శాఖకు ఒక అమూల్యమైన ఆస్తి. ఆయన సేవలు, విలువలు, కృషి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆయన వంటి అధికారులు ఉండటం పోలీస్ శాఖకు గర్వకారణం. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన అనుభవం, మార్గనిర్దేశం సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించాలి.

# సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలి

- ప్రజలతో మంత్రి ముఖాముఖి అధికారులకు దిశానిర్దేశం
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**చిన్నంబావి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** చిన్నంబావి మండల కేంద్రంలోని చిన్నదగడ, అమ్మాయిపల్లి గ్రామాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై మంత్రి స్థానిక అధికారులు, ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ గ్రామ సమస్యలను మంత్రికి వివరించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని సూచించారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కవిత, గంగాధర్, అధికారులు ఆర్టీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, చిదంబర్ రెడ్డి, తూర్పుంటి కురుమూర్తి, బీచుపల్లి యాదవ్, రాజ్ కుమార్, సుధాకర్ నాయుడు, వెంకటేష్, కిరణ్ కుమార్ గౌడ్, ప్రభంజన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ మోసాల ప్రజల్లో అవగాహన కల్పించాలి

- ఇన్వెస్టిగేషన్‌లో వేగం పెంచి బాధితులకు న్యాయం చేయాలి
- రూరల్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహనా కల్పించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. వివిధ నేరాలలో సీజ్ చేసిన వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. స్టేషన్ రికార్డులు జనరల్ డైరీ, హిస్టరీ షీట్లు, పిటిషన్ రిజిస్టర్‌లను తనిఖీ చేస్తూ.. అన్ని రికార్డులు తాజా సమాచారం తో అప్డేట్‌గా ఉంచాలని అన్నారు. పెండింగ్ మరియు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఎస్.హెచ్. ఓ కు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం “అరైవ్ అలైవ్” వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు నిర్మాణంలో లోపాలను, అధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఎన్‌హెచ్ఏఐతో చర్చించి, మరమత్తులు చేయించాలని అన్నారు. తరచూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, నాకాబంది వంటి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అధికారులు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్దతతో నిర్వర్తించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత సమస్యలేమైనా ఉన్నట్లయితే సంబంధిత అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## పేదల ఆకలి తీర్చడంలోనే సంతృప్తి

- వంద వారాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం
- సాహితి ఆసుపత్రి ఎండి రాము సాహితి



**సంగారెడ్డి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** పేదలకు ఆకలి తీర్చడంలోనే సంతృప్తి ఉందని సంగారెడ్డి సాహితీ హాస్పిటల్స్ ఎండి రాము సాహితి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాము సాహితి మాట్లాడుతూ... అయ్యప్ప స్వామి జన్మదినం పురస్కరించుకొని ప్రతి బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సాహితీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అన్న దానం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారు 300 మంది రోగులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. అన్న ప్రసాద వితరణ ప్రారంభించి 100 వారాలు పూర్తయిందని అయ్యప్ప స్వామి కృపతో భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. పేద ప్రజల ఆకలి తీర్చడంలోనే తృప్తి ఉదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చొరవతో న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు ఆమోదం

- న్యాయవాదుల పోరాటం ఫలించింది
- అలంపూర్ న్యాయవాదుల సంఘం ప్రారంభం
- న్యావదుల సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి



**మహాబుహబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** న్యాయవాదులు చేసినటువంటి పాదయాత్ర పై స్పందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువుతో న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును శాసనసభలో ఆమోదించడం జరిగిందని మహబూబ్నగర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు బుధవారం మహబూబ్నగర్ న్యాయవాదుల సంఘ భవనంలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును శాసనసభలో అన్ని పక్షాలు ఆమోదించేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అందరు న్యాయవాదుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు అదేవిధంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని అలంపూర్ న్యాయవాదుల సంఘం సాహసోపేతమైనటువంటి నిర్ణయం తీసుకొని పాదయాత్రని చేపట్టారని నవంబర్ 9 2025 నుండి మొదలైన పాదయాత్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మరియు మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ ల సంయుక్త సహకారంతో నవంబర్ 14 2025 కు పాదయాత్ర భూత్పూర్ చేరుకుందని అన్నారు భూత్పూర్ లో పాదయాత్రకు హాజరైనటువంటి మహబూబ్నగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్ శ్రీనివాస్ రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలు ఆ సమావేశానికి హాజరై దీక్ష విరమించాలని ముఖ్యమంత్రితో చెప్పి తాము చట్టం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఆ తర్వాత గ్రామపంచాయతీ మున్సిపల్ ఎలక్షన్ల కారణంగా ముఖ్యమంత్రిని కలవడం సాధ్యం కాలేదని పేర్కొన్నారు రెండో విడత పాదయాత్ర చేపట్టి అలంపూర్ న్యాయవాదులతో కలిసి భూత్పూర్ నుండి సెక్రటేరియట్ వరకు పాదయాత్ర కొనసాగించడం జరిగిందని అన్నారు ఫిబ్రవరి 27వ తేదీన పాదయాత్ర సెక్రెటరీ వరకు చేరుకుని ముఖ్యమంత్రి కలిసి వినతి పత్రం అందించడం జరిగింది అన్నారు ఈ నేపథ్యంలో కేబినెట్లో లక్షణం చట్టం బిల్లు ఆమోదించారని ఆ తర్వాత శాసనసభలో మార్చి 30వ తేదీన ఆమోదించడం జరిగిందని అన్నారు బిల్లును ఆమోదించేందుకు చొరవ చూపినటువంటి దేవరకద్ర మహబూబ్నగర్ అచ్చంపేట ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్ర మంత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన అన్నారు న్యాయవాదులపై ఎవరైనాఇబ్బందులకు గురిచేసి దాడులను చేసిన వారిపై నాన్బెలబుల్ కేసులు నమోదు అవుతాయని చెప్పారు అదేవిధంగా న్యాయవాదులు ఎవరైనా వారికి రక్షణ కావాలని కోరితే పోలీసులు వారికి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకునే విధంగా చట్టంలో రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు న్యాయవాదులపై దాడులు జరిగినటువంటి కేసులను డిఎస్పీ స్థాయి అధికారి విచారించేలా చట్టం రూపకల్పన జరిగిందని ఆయన అన్నారు శాసనసభలో ఆమోదం పొందినటువంటి బిల్లు గవర్నర్ ఆపదముద్ర తర్వాత అమల్లోకి వస్తుందని ఆయన చెప్పారు సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు ఉపాధ్యక్షుడు వెంకటయ్య సంయుక్త కార్యదర్శి నాగోజి తగిలి కృష్ణ కార్యవర్గ సభ్యుడు రాఘవేందర్ సీనియర్ మహిళ న్యాయవాది ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం.. తండ్లాట!





**మంగపేట, ఏప్రిల్ 01(జనంసాక్షి) :** నాగరిక ప్రపంచం చంద్రుడిపై నీటి కోసం వెతుకుతుంటే, అడవి బిడ్డలు మాత్రం గొంతు తడుపుకోవడానికి అడుగుల కొద్ది భూమిని తవ్వాల్సి రావడం మన వ్యవస్థలోని లోపానికి నిదర్శనం. ప్రస్తుతం వేసవి కాలం సమీపించడంతో గొత్తె కోయగూడెల ప్రజలకు త్రాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదు. మంగపేట గ్రామపంచాయతీ పరిధిలోగల శాంతినగర్ గొత్తే కోయగూడెం వాసులు వారు నివసిస్తున్న చుట్టుపక్కల వాగులు, వంకలు, ఒర్రెలు చుక్క నీరు లేక పూర్తిగా ఇంకిపోయాయి. చేసేది ఏమీ లేక గూడెం వాసులు అంతా కలిసి బావులు తవ్విన ఎక్కడ కూడా కనీసం గుక్కెడు త్రాగు నీరు పడని దుస్థితి నెలకొంది అంటూ గూడెం వాసులు తమ ఆవేదన వ్యక్త పరిచారు. గతంలో ఐటీడీఏ ద్వారా గ్రామంలో బోరు బావి వేశారని తెలిపారు. నీరు ఎర్రగా రావడంతో తాగడానికి పనికి రాలేదని తెలిపారు. గతంలో మాదిరిగానే మళ్లీ ఒర్రెల నుండి నీటిని తెచ్చుకొని వినియోగించుకునే వాళ్ళమని తెలిపారు. కానీ ఎండాకాలం సమీపించడంతో ఒర్రెలలో నీరు కూడా పూర్తిగా ఇంకిపోవడంతో కిలోమీటర్ల కొద్దీ నడక ప్రయాణం కొనసాగిస్తూ గౌరారం వాగుకు త్రాగునీటి కోసం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది అని వారన్నారు. త్రాగునీటి సమస్యపై కనీసం పట్టించుకునే వారు లేక మా బ్రతుకులు దయనీయంగా మారిపోయాయని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాంతినగర్ గ్రామానికి త్రాగునీటి వసతిని కల్పించి సమస్యను పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకున్నారు.

# ఐదుగురు గంజాయి స్మగ్లర్లకు 20 ఏళ్ల జైలుశిక్ష



**ఆత్మకూరు, ఏప్రిల్ 1 (జనం సాక్షి):** ఆత్మకూర్ గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడిన ఐదుగురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి బి. అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు శాయంపేట, ఆత్మకూర్ మండలాలకు చెందిన పావురాల వెంకటేష్, అబ్బోజు వెంకటేష్, పరుపల్లి కార్తీక్, అనంతుల సాంబయ్య, కొక్కరకొండ చంద్రయ్యలు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన నిందితులందరు, ఓ ముఠాగా ఏర్పడి, ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం ప్రాంతంలో పెద్ద మొత్తంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, ఎక్కువ మొత్తంలో మహారాష్ట్రలో విక్రయించేందుకు, రహస్యంగా కార్లో స్మగ్లింగ్ పాల్పడుతున్న ఐదు నిందితులను ఆత్మకూరు పోలీసులు చౌలపల్లి గ్రామ శివారు ప్రాంతంలో అరెస్ట్ చేసి వీరి నుండి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఆత్మకూరు ఇన్స్పెక్టర్ రాజలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాజమల్లారెడ్డి వాదించగా, ప్రస్తుతం ఇన్స్ స్పెక్టర్ ఆర్.సంతోష్, కోర్టు లైజన్ మహిళా ఆఫీసర్ కె. పరమేశ్వరి, కానిస్టేబుల్ ఆర్. ఉమేష్ పలువురు సాక్షులను కోర్టులో హాజరుపర్చారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డే



**కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఏప్రిల్ 01 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2026 ఏప్రిల్ 1న దేశవ్యాపిత నిరసన కార్యక్రమాలో భాగంగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బ్లాక్ రిబ్బన్ లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.త్రివేణి మాట్లాడుతూ 01.04.2026 నుండి కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సంపూర్ణంగా రద్దుచేసి వాటి స్థానంలో 4 కోడ్ లను అమలు చేస్తున్నందుకు బ్లాక్ డే ఇదిఅని 4 లేబర్ కోడ్లు అమలయితే దేశంలోని 47 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులు 25 కోట్ల మంది సంఘటితరంగ ఉద్యోగ కార్మికులు రెక్కలు లేని పక్షుల్లాగా కార్మికులు సరైన చట్టాలు అమలు కాక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి పాలనలో ఆదానీ, అంబానీలకు కారుచౌకగా రైల్వేలు, ఓడరేవులు, బొగ్గుగనులు, చమురు, ఉక్కు రక్షణ, రహదారులు, విమానాశ్రయాలు, బ్యాంకులు, బీమా, టెలికాం, పోస్టల్, అనుశక్తి, విద్యుత్ ఉత్పత్తి, ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించింది అని,పేదలు, కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుంది అని అన్నారు. సిఐటియు సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ కూషణ రాజన్న మాట్లాడుతూ స్థానిక ఎస్ పి ఎం లో లేబర్ కోడ్స్ అమలు కాకా ముందే యాజమాన్యం వాటిని అడ్డు పెట్టొకొని యూనియన్ ఎన్నికలు కాకుండ చేసే ప్రయత్నం చేస్తుంది అని మండిపడ్డారు, లేబర్ కోడ్స్ అమలు అయితే ఎస్ పి ఎం కార్మికులు కట్టు బానిసలు అవుతురు అని అన్నారు. వ్యవసాయకార్మిక సంఘము జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడారు,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం సభ్యులు కోట శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణమాచారి. జిల్లా కోశాధికారి ఈ శంకర్, ఆదివాసీ జిల్లా కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, సీఐటీయూ జిల్లా నాయకులు సంజీవ్, మల్లేష్,అరుణ, మల్లేశ్వరి,నగరం పద్మ, పావని,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి..

**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 1(జనంసాక్షి):** పేదల జీవితాల్లో వెలుగులు నింపడం, సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో మైనాల శ్రావణ్ కుమార్ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. పేదల కళ్లలో ఆనందం నింపడం ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి మరియు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సిపి సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 01 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడుతున్నతమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరి నిందితులనువరంగల్ సిసిఎస్, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు 15 లక్షల 20 వేల రూపాయల విలువగల 95గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ఒక ద్వి చక్ర వాహనం, రెండు సెల్ ఫోన్ల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1)కళ్యాణ సుందరం, వయస్సు 30 సంవత్సరాలు మధురై, తమిళనాడు రాష్ట్రం .2) సెల్వరాజ్, వయస్సు2,8 మధురై, తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలు తెలుపుతూ.. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన కళ్యాణ సుందరం పూల వ్యాపారం నిర్వహించు కుంటూ, వచ్చిన ఆదాయంతో జల్సాలు చేయడంతో పాటు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసగా మారడం అలాగే గంజాయి విక్రయాలకు పాల్పడేవాడు, దీనితో తన జల్సాలకు అవసరమైన డబ్బు కోసం నిందితుడు మొదటిసారిగా సెల్ఫోన్ చోరీ కీ పాల్పడటంతో పాటు తమిళనాడు లోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడటంతో నిందితుడు సుందరంను పోలీసులు పలు మార్లు అరెస్టు చేసి జైలుకు తరలించారు. జైలు నుండి విడుదలైన నిందితుడు కొద్ది రోజులు సెల్ దుకాణంలో సేల్స్ మెన్ గా పనిచేస్తూ ఇదే సమయంలో మరో నిందితుడు సెల్వరాజ్ తో పరిచయం అయింది. వీరి ఇద్దరి మధ్య స్నేహం కుదరడంతో, ఇరువురు కలిసి మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవారు. వీరు చేసే జల్సాలకు వీరికి వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న ఇరువురి నిందితులు, ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలలో బంగారు ఆభరణాలు చోరీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఇద్దరు నిందితులు చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడేందుకు గత నెల వరంగల్ నగరానికి చేరుకున్నారు. అనుకున్న ప్రకారం నిందితులు ఇద్దరు కలిసి ముందుగా మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానిపై ప్రయాణిస్తూ ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, హన్మకొండ, కెయుసి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి చొప్పున అలాగే ఆంధ్రప్రదేశ్ లోని కర్నూల్ మూడవ పట్టణంతో కలుపుకొని మొత్తం ఐదు చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో పోలీసులకు అందుబాటులో ఉన్న టెక్నాలజీ వినియోగించుకొని, నిందితులను గుర్తించడం జరిగింది. వీరి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, నిందితులు మరోమారు ఈరోజు మళ్ళీ చైన్ స్నాచింగ్ లు చేయడానికి మళ్ళీ వరంగల్ వచ్చి మట్టెవాడ లో దొంగిలించన మోటార్ సైకిల్ పై హన్మకొండ బస్ స్టాండ్ నుండి పబ్లిక్ గార్డెన్ వైపు వస్తున్న క్రమశీలో అనుమానంతో ఆపె క్రమములో పారిపోతుండగా పట్టుకొని వారి నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ క్రైమ్ డీసీపీ జి.బాల స్వామి, క్రైమ్ ఏసీపీ పి సదయ్య, హన్మకొండ ఏసీపీ పి.నర్సింహారావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ లు ఏ . రాఘవేందర్, కె .రామకృష్ణ , హన్మకొండ ఇన్స్పెక్టర్ శివ కుమార్ , సుబేదారీ ఇన్స్పెక్టర్ రంజిత్,హన్మకొండ ఎస్.ఐ కిశోర్, ఏఎ ఓ సల్మాన్ పాషా, సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్లు మహేశ్, జంపయ్య, కానిస్టేబుల్లు మధుకర్, చంద్రశేఖర్, హన్మంతు, ఐ టీ కోర్ కానిస్టేబుల్ నగేష్, కెయుసి మరియు హన్మకొండ క్రైమ్ కానిస్టేబుళ్లు జితేందర్, రమణ లను వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించినారు

# సాగు రైతులకు భూ హక్కు పత్రాలు అందజేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులను నిర్ధారణ చేసి గుర్తించి భూ హక్కు పత్రాలు జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి డివిజన్ పరిధిలోని రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాల జారిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలాల వారిగా ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతులు, భూ సమస్యల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారావుపేట గ్రామంలోని రైతులు దీర్ఘకాలంగా సాగు చేస్తున్న భూమిలో సింగరేణి గనులు ఏర్పాటుతో కొందరు రైతులు భూములు కోల్పోయారని వారికి పరిహారం అందించాలని సూచించారు. గనుల ఏర్పాటు తదుపరి, మిగిలిన భూములను సాగు చేస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సింగరేణి గనులు, జెన్కో పరిశ్రమ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న రైతులకు గ్రామ సభలు నిర్వహించడం ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని తెలిపారు. కోర్టు వివాదాల్లో లేని భూముల జోలికి వెళ్లకుండా, ఇతర భూములకు హక్కు పత్రాలు జారీ చేయాలని సూచించారు. దాదాపు 70 సంవత్సరాలుగా సాగులో ఉన్న రైతులకు కోర్టు కేసులు లేని పక్షంలో గ్రామ సభల ద్వారా భూ హక్కు పత్రాలు జారీ చేయాలని తెలిపారు. భూ హక్కు పత్రాలు లేకపోవడం వల్ల రైతులు రైతు భరోసా, రైతు భీమా వంటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కోర్టు వివాదాలు లేని భూములను లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి, అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ, భూపాలపల్లి డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పాముకాటుతో మహిళ మృతి



**మల్హర్, ఏప్రిల్ 01 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన గంగుల రాధ వయసు 46 సంవత్సరాలు ప్రమాద వశత్తు పాము కాటు వేయడం తో మృతి చెందినది. ఉదయం దాదాపు 6గంటల సమయం లో ఇంటిలో విశాపూరిత మైన పాము కాటు వేయడంతో వెంటనే తాడిచర్ల ప్రభుత్వహాస్పిటల్‌కు తీసుకెళ్లగా హాస్పిటల్ లో డాక్టర్ అందుబాటులో లేకపోవడం తో 108కు కాల్ చేసిన ఫలితం లేకపోవడం తో ప్రవేట్ వాహనం లో మంథని ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకవెళ్లగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందినది అని మృతురాలు బంధువులు తెలిపారు.

# నా భూమి నాకు ఇప్పించండి

**వావిలాలలో బడికి తాళం వేసి మహిళ నిరసన**



**పాలకుర్తి, ఏప్రిల్ 01 (జనంసాక్షి) :** మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన దొంగరి శ్రీలత దంపతులతో పాటు వారి పాలివాండ్లు కలిసి వారికి చెందిన 400 గజాలకు పైగా భూమిని రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. దొంగరి శ్రీలత భర్త ఉపేందర్ రావు సమక్షంలోనే ఆ భూమిని పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. ఉపేందర్ రావు మృతి చెందాడు. ఇప్పుడు శ్రీలతకు నిలువ నీడలేకుండా పోయింది. గ్రామంలో ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో ఆవేదన చెందుతుంది. ఇల్లు లేకపోవడంతో బంధువుల ఇంటిలో నిద్రిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో చేసేదేం లేక బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల గేటకు తాళం వేసి నిరసన తెలిపింది. దీంతో ఉపాధ్యా యులు. విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు గేటు బయట వేచి ఉన్నారు. కొద్ది సేపు గేట్ ముందు పడుకొని నిరసన తెలిపింది. ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారులతో మాట్లాడి న్యాయం చేసేలా చూస్తామని ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఆ పాఠశాల ఎచ్ఎం తండ మల్లయ్య హామీ ఇవ్వడంతో నిరసన విరమించింది.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** ప్రభుత్వం మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అలీప్ సంస్థ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తుందన్నారు. రాష్ట్రంలో రాంప్ ప్రాజెక్టు క్రింద స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్ లను ఎంఎస్ఎంఈలుగా మార్చి అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళల సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి మహిళలకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు వివిధ వ్యాపారాలు చేసేందుకు రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబ పోషణకు కృషి చేయాలన్నారు. ఎంచుకున్న రంగంలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి కొరకు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యార్థుల దుస్తుల తయారీకి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో అందించారని వివరించారు. ఎంఎస్ఎంఈ కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహకంలో భాగంగా రాంప్ పథకంలో ఎం ఎస్ ఎం ఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, అలీప్ సంయుక్తంగా రాష్ట్రంలోని మహిళల ఆర్థిక స్వావలంబన కృషి చేస్తున్నాయని తెలిపారు. 1500 స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళల నేతృత్వంలో ఉన్న 500 అంకుర సంస్థల అభ్యున్నతి సాధించాలనే సంకల్పంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ 15 రోజుల పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీపై సివిల్ సప్లై అధికారుల ఉదాసీనత!

- హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ అక్రమ వసూళ్లకు బరితెగింపు...
- ఏజెన్సీ పై సివిల్ సప్లై అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటి...?
- ఇప్పటికైనా గ్యాస్ డీలర్ల అక్రమ వసూళ్లకు సివిల్ సప్లై అధికారులు కళ్ళెం వేసేనా?



**మంగపేట ఏప్రిల్ 01 (జనంసాక్షి) :** వంట గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే మరోవైపు మంగపేట మండల కేంద్రంలోని హెచ్. పి (హిందుస్థాన్ పెట్రోలియం) గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అక్రమ వసూళ్లకు తెర లేపుతూ ప్రజల వద్ద అధిక సొమ్మును తీసుకుంటూ నిలువు దోపిడితో వినియోగదారులను బెంబేలెత్తిస్తుంది. నిబంధనల ప్రకారం సేవలు అందించాల్సిన డీలర్లు, క్షేత్రస్థాయిలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అయితే వీరిని అరికట్టాల్సిన పౌర సరఫరాల శాఖ (సివిల్ సప్లై) అధికారులు మాత్రం 'ఏమి తెలియనట్టు' వ్యవహరిస్తుండటం పై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ (రిఫిల్) బిల్లు ధరలను మాత్రమే వసూలు చేయాలి. కానీ అలాకాకుండా ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా ప్రజలను నిలువు దోపిడికి తెగబడుతూ వినియోగదారుల నుండి సర్వీస్ ఛార్జ్ అనే నెపముతో సుమారు రూ.30 నుండి రూ.50 రూపాయల వరకు అదనంగా వసూళ్లు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. వాస్తవానికి వినియోగదారులకు ఇంటికి అందాల్సిన సిలిండర్ ధరలోనే పూర్తి చార్జీలు కలిసి ఉంటాయి. కానీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కంప్యూటర్ సిలిండర్ బిల్లును ఇవ్వకుండా అసలైన సిలిండర్ ధరను చెప్పకుండా వినియోగదారుల నుండి అదనంగా సర్వీస్ ఛార్జీలు ఉంటాయని బుకాయిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది తెలియని వినియోగదారులు అడిగినంత ముట్ట చెప్పుతున్నారు. ఈ విషయంపై సిలిండర్లపై అధికంగా ఎందుకు వసూలు చేస్తున్నారని వినియోగదారులు నేరుగా డెలివర్ బాయ్స్ ను ప్రశ్నించగా యాజమాన్యం సూచనల మేరకే తీసుకుంటున్నామని వారు తెలపడం గమనార్హం. అంతే కాకుండా అసలు అధికంగా ధరలను ఎందుకు తీసుకుంటున్నారని కొందరు ప్రశ్నించగా గ్యాస్ ఏజెన్సీలో నూతనంగా కొనుగోలు చేసిన వాహనాల యొక్క వాయిదాల ( ఫైనాన్స్ ఈఎంఐ) లను చెల్లింపులు చేయడం కొరకు అదనంగా వసూలు చేయడం జరుగుతుందని తెలపడం విడ్డూరంగా ఉంది. అసలు ప్రజల సొమ్ముతో ఏజెన్సీలు ఇస్తానుసారంగా వ్యవహరించడం ఏంటి అంటూ నిజ నిజాలు తెలిసిన కొందరు ప్రజలు ఏజెన్సీ వ్యవహార తీరుపై మండిపడుతున్నారు. ఇలాంటి వ్యవహారాలు జరుగుతున్న కూడా సంబంధిత సివిల్ సప్లై అధికారులు తనిఖీలు నిర్వహించకుండా నిజ నిజాలను బహిర్గతం అయినా కూడా హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరు పై ఉదాసీనత చూపడం ఆంతర్యం ఏమిటి అని బహిర్గతంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. సివిల్ సప్లై అధికారులు గ్యాస్ గోడౌన్లను, ఏజెన్సీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని ప్రజలు బహిర్గతంగా ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టడంలో విఫలమవుతున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ డీలర్ల ఆగడాలపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఏజెన్సీ వద్ద ధరల పట్టిక ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉండేలా చూడాలని అక్రమాలకు పాల్పడే డీలర్ల లైసెన్సులను రద్దు చేయాలని ప్రజలు బహిర్గతంగా డిమాండ్ చేస్తున్నారు.

# సర్కారీ సంస్థల్లో కలెక్టర్ తనిఖీల పర్వం

**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు నీడతోపాటు, తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ఆదేశించారు.వన మహోత్సవం కింద రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటేందుకుగాను అన్ని గ్రామాలలో మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని, నర్సరీలలో పెంచుతున్న మొక్కల గురించి గ్రామసభలలో ప్రజలకు తెలియజేసి వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, శాలిగౌరారం మండలం, వల్లాల, అడ్లూరు గ్రామాలలో పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను,ప్రభుత్వ పనులను తనిఖీ చేశారు.ముందుగా వల్లాల గ్రామంలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న వనమహోత్సవం నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు,వాటి రకాలు, గ్రామపంచాయతీ ద్వారా వాన కాలంలో నాటనున్న మొక్కల టార్గెట్, మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, గృహాలకు పంపిణీ చేసే మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర వివరాలన్నింటిని ఏపీఎం శంకరయ్య ,ఏపీవో జంగమ్మ, వన సేవకుడు తంబయ్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పోస్తూ సంరక్షించాలని, నర్సరీలో పెంచుతున్న మొక్కల విషయాలను గ్రామసభలో గ్రామస్తులకు చదివి వినిపించి వారి అభిప్రాయం సేకరించి గ్రామానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని, వానకాలంలో నాటనున్న మొక్కలకు ముందే స్థలాలను గుర్తించి ప్రణాళిక రూపొందించాలని, గ్రామానికి నిర్దేశించిన 13800 మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం పక్కనే ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి గ్రామస్తుల ఉదయం నడకకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వల్లాల గ్రామ చెరువులో ఉపాధి హామీ పథకం కింద కూలీలు ఫిష్ పాండ్ తవ్వుతుండగా తనిఖీ చేశారు. కాగా ఉపాధి హామీ పథకం కింద 6 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 3000 పని దినాలు కల్పించేందుకు ఫిష్ పాండ్ పనులు చేపట్టగా, కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతమంది వస్తున్నారని? పని ఎప్పుడు



ప్రారంభించారని మెజర్మెంట్ ఎంత తీసుకున్నారని? అడిగారు. ఎండలకు పనిచేయలేకపోతున్నామని కూలీలు జిల్లా కలెక్టర్‌కు తెలుపగా ఉదయం వచ్చి పని చేసుకోవాలని, తక్కువ పని చేస్తే తక్కువ వేతనం వస్తుందని, అలా కాకుండా ఎక్కువ పనులు చేసుకున్నప్పుడు ఎక్కువ వేతనం వచ్చేలా చూడాలని ఫిష్ పాండ్ తో పాటు, ఫీడర్ ఛానల్ ,ఇతర పనులు చేసుకోవాలని చెప్పారు. గ్రామ సమాఖ్య భవనానికి ఎస్ బి ఎంలో టాయిలెట్లు మంజూరు చేయాలని డిఆర్డిఓ ను కలెక్టర్ ఆదేశించారు.ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసిల్దార్ వరప్రసాద్, వల్లాల పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఎంఈఓ సైదులు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## సెల్ టవర్ నిర్మాణంపై అదనపు కలెక్టర్ విచారణ



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో సెల్ టవర్ నిర్మాణ విషయంలో గ్రామస్థులు అభ్యంతరం తెలుపుతూ ఇటీవల కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ కు ఫిర్యాదు నేపథ్యంలో బుధవారం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాన్ని అదనపు కలెక్టర్ విద్యాచందన సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. సెల్ టవర్ నిర్మాణం ఏర్పాటు చేసే ప్రదేశం వద్ద అందరి అభిప్రాయాలు తీసుకుని నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను వివరించారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం సెల్ టవర్ నిర్మాణం ఉంటుందని, రేడియేషన్ ప్రభావం కూడా ఉండదని చెబుతున్నారని అయితే మండల అధికారుల బృందంచే గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి మరోసారి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటామని తెలిపారు. అయితే ప్రస్తుత పరిస్థితిని కలెక్టర్ కు నివేదిస్తామని తెలిపారు. ఆమె వెంట ఏపీడీ రమణ, ఎంపీడీవో జమలారెడ్డి, ఆడిట్ సెల్ అధికారి సునీల్ శర్మ, సర్పంచ్ బానోత్ సరోజ, కార్యదర్శి స్పందన తదితరులు ఉన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో రివ్యూమీటింగ్



**భువనగిరి, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ మాట్లాడుతూ అన్నీ శాఖ గ్రంథాలయం లో ఉన్న అన్ని సమస్యల గురించి గ్రంథ పాలకులను అడిగి తెలుసుకున్నారు. శాఖా గ్రంథాలయంలో ఉన్న బిల్డింగ్ రిపేర్లను కరెంటు, బాత్రూంలు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో గ్రంథాలయాలు,మండల గ్రామపంచాయతీ గ్రంథాలయాలను సెస్ వసూలు చేయవలసింది గా కోరినారు. శాఖ గ్రంథాలయంలో పాఠకుల ద్వారా సభ్యత్వం కట్టించవాల్సిందిగా తెలియజేసారు. గ్రంథాలయాలు సమయ పాలన పాటించి విధులకు హాజరు కావాల్సినదిగా కోరినారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖ గ్రంథాలయం లను అభివృధి చేస్తానని తెలిపినారు. ఈ సమావేశంలో పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులను సన్మానించడం జరిగినది జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీ ఎం .సుధీర్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్క గ్రంథ పాలకుడు గ్రంథాలయ సెస్ కట్టించవలసిందిగా గ్రంథ పాలకులను కోరినారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మరియు కార్యదర్శి గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసభలపై మండల స్థాయి సమావేశం



**దమ్మపేట ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** దమ్మపేట మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న గ్రామసభలపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామసభల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించారు.ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు,కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్, మహాలక్ష్మి పథకం,చేయూత పెన్షన్లు,రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు,రైతు బీమా,ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాలు,సన్న రకం వరికి బోనస్,గృహ జ్యోతి వంటి పథకాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి,వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామసభలను విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ బి. రవీంద్ర రెడ్డి,తహసీల్దార్ రామ్ నరేష్,ఏఓ చంద్రశేఖర్ రెడ్డి,స్పెషల్ ఆఫీసర్ రవి,ఎంఈఓ పి. జగపతయ్య,పంచాయతీ కార్యదర్శులు,గ్రామ సర్పంచులు,గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా పారదర్శకంగా నిర్వహించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** ఓటర్ జాబితా ప్రత్యేక సమీక్ష ఎస్ ఐ ఆర్ 2025 కార్యక్రమానికి సంబంధించిన ముఖ్య సూచనలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన బుధవారం మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో ఎస్ ఐ ఆర్ 2025 ప్రక్రియలో భాగంగా ఓటర్ల వర్గీకరణ, నమోదు, ధృవీకరణ చర్యలను సమగ్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఓటర్లను నాలుగు ప్రధాన వర్గాలుగా విభజించినట్లు వివరించారు. కేటగిరి ఏ 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, వయస్సు 39 సంవత్సరాల పైబడిన వారు మరియు 2002 ఓటర్ జాబితాలో కూడా నమోదు ఉన్న వ్యక్తులు. కేటగిరి బి 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, వయస్సు 39 సంవత్సరాల పైబడిన వారు అయితే 2002 ఓటర్ జాబితాలో నమోదు లేని వ్యక్తులు.కేటగిరి సి 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, 21 నుండి 38 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లు. కేటగిరి డి 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, 18 నుండి 20 సంవత్సరాల మధ్య వయస్సు గల యువ ఓటర్లు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వర్గానికి చెందిన ఓటర్ల వివరాలను ఖచ్చితంగా సేకరించి, ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ జాబితాను నవీకరించాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. డూప్లికేట్ నమోదు, మరణించిన వారి పేర్లు, చిరునామా మార్పులు వంటి అంశాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. అంతేకాకుండా, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్లు బిఎల్ఎల ను తప్పనిసరిగా నియమించాలని, వారితో సమన్వయం చేసుకుంటూ ఓటర్ జాబితా పరిశీలన, సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బిఎల్ఎలు చురుకుగా పనిచేయడం ద్వారా తప్పులు తగ్గి, ఖచ్చితమైన ఓటర్ జాబితా సిద్ధమవుతుందని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత పెంపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించబడాలని, ప్రతి దశలో స్పష్టత ఉండేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డిఓ ఎన్ వి గిరి, ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోరంపల్లి బంజర్ సంత వేలం రూ.35.61లక్షలుకు ఖరారు

- గతేడాది కంటే రూ.2.11లక్షలు ఆదాయం అధికం



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ పంచాయతీలో వారాంతపు సంత వేలంపాటను భద్రాచలానికి చెందిన చేతన మీ సేవా నిర్వాహకుడు పాటదారుడు భూక్యా రంజిత్ నాయక్ బుధవారం రూ.35.61లక్షలకు కైవసం చేసుకున్నారు. ఎంపీడీవో కుడుముల జమలారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి సమక్షంలో మోరంపల్లిబంజర్, సారపాక, పినపాక పట్టీనగర్ కార్యదర్శులు భవానీ, కంది మహేష్, విజయ్ లు నిర్వహించారు. గత ఏడాది రూ.33.50లక్షలకు కూరగాయలు, పశువుల సంతను దక్కించుకోగా ఈ ఏడాది అదనంగా రూ.2.11లక్షలు పంచాయతీకి ఆదాయం రావడంతో ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. పాటదారుల నుంచి పోటీ పెరగడంతో ఏకంగా రూ.35.61లక్షలకు భూక్యా రంజిత్ నాయక్ సంత వేలాన్ని దక్కించుకోవడంతో సర్పంచ్, ఉపసర్పంచ్, అధికారులు పాటదారుడిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాటదారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వనంలో జలం మోటారు గల్లంతు



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ మండలం ఇరవెండి పంచాయతీ పరిధిలోని పల్లెప్రకృతి 'వనం' లో విద్యుత్ మోటారు గల్లంతవటం గ్రామంలో చర్చి నియాసం అయింది. దీనికి సంబంధించి పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్లు గుండి బాబూరావు, మహంకాళి రామారావులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెప్రకృతివనంలో మొక్కల సంరక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీచేసినట్లు తెలిపారు. దినచర్యలో భాగంగా పల్లెప్రకృతివనంలో మొక్కలకు నీళ్లు పెట్టాలని వెళ్లిన సిబ్బందికి విద్యుత్ మోటారు చోరీకి గురైందని తెలిసి సర్పంచ్, ఉపసర్పంచ్లకు సమాచారం ఇచ్చారు. దీంతోసంఘటనా స్థలానికి వెళ్లి చూడగా విద్యుత్ మోటారు అపహరణకు గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. చోరీకి గురైన మోటారు విలువ రూ.30వేలు ఉంటుందని తెలిపారు.

# ఆసియన్ ట్రాక్ ఛాంపియన్‌షిప్స్‌లో 11 పతకాలు

- కైవసం చేసుకున్న ఆదిత్య మెహతా ఫౌండేషన్ అథ్లెట్లు




హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) : ఫిలిప్పీన్స్‌లోని తగాయ్టే వెలోడ్రోమ్‌లో జరిగిన ఆసియన్ ట్రాక్ ఛాంపియన్‌షిప్స్ 2026లో హైదరాబాద్ కి చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్)లో శిక్షణ పొందిన పారాసైక్లిస్టులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. భారత పారాసైక్లింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వీరు మొత్తం 11 పతకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలలో విశ్వ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఒక కిలోమీటర్ టైమ్ ట్రయల్, ఎలిమినేషన్ రేస్, స్ప్రింట్, స్క్రాచ్ రేస్, ఇండివిడ్యువల్ పర్స్యూట్ విభాగాలలో మొత్తం ఐదు రజత పతకాలు గెలుచుకున్నారు. అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతో లిషా భారత పతకాల పట్టికను మరింత బలోపేతం చేశారు. ఆమె ఎలిమినేషన్ రేస్, స్ప్రింట్‌లో రెండు రజత పతకాలు, ఒక కిలోమీటర్ టైమ్ ట్రయల్, స్క్రాచ్ రేస్, ఇండివిడ్యువల్ పర్స్యూట్‌లో మూడు కాంస్య పతకాలు సాధించారు. పవన్ కుమార్ ఎలిమినేషన్ రేస్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయం భారత పారాసైక్లింగ్ క్రీడాకారుల పట్టుదలకు, ఆదిత్య మెహతా ఫౌండేషన్ అందిస్తున్న శిక్షణకు నిదర్శనంగా నిలిచింది. ఆదిత్య మెహతా ఫౌండేషన్ లో శిక్షణ పొందిన అథ్లెట్లు ఏడు రజత, నాలుగు కాంస్య పతకాల సాధించారు. ఈ పోటీల్లో మొత్తం పదకొండు దేశాలు పాల్గొన్నాయి. అంతర్జాతీయ వేదికపై భారత పారాసైక్లింగ్‌కు ఈ అద్భుత విజయం ఒక ముఖ్యమైన మైలురాయి. భాగస్వాములైన అథ్లెట్లు అత్యున్నత స్థాయిలో రాణించడానికి భాగస్వాముల సహకారం ఎంతో ఉంది. ఇన్వెస్కో, ఆల్కాన్, జీఎంఎంసీఓ, ఎన్టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్, ఫ్లట్టర్ ఎంటర్టైన్మెంట్ ఇండియాకు ఆదిత్య మెహతా కృతజ్ఞతలు తెలిపింది.

## డీసీఎం డ్రైవర్‌పై దోపిడీ

- ఇద్దరు నిందితులు అరెస్ట్



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ప్రకారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మధురానగర్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ వినోద్ కోల్ (29) గత నెల మార్చి31 న ఉదయం బాలానగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్తుండగా, అత్తాపూర్ ఉప్పర్‌పల్లి వద్ద పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం. 173 సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతని వాహనాన్ని అడ్డగించారు. నిందితులు అతన్ని బెదిరిస్తూ రూ. 20 వేలు డిమాండ్ చేశారు. ఈ సమయంలో డ్రైవర్ తన యజమానికి ఫోన్‌లో సమాచారం ఇస్తుండగా, అతని మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు.ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అత్తాపూర్ పోలీసులు, కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సాహిల్ (21), మహమ్మద్ అమాన్ ఉద్దీన్ అలియాస్ అమాన్ (22)లను గుర్తించి అరెస్ట్ చేశారు. అరెస్టు అనంతరం నిందితులను అదే రోజు న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

# దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యటన

- భోజన వసతులపై గురుకుల పాఠశాలలపై ఆగ్రహం



**దమ్మపేట, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహించారు, తహసీల్దార్ కార్యాలయం,పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు,విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు.ముందుగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు.వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి,కుల ధృవీకరణ, ఆదాయ,నివాస ధృవీకరణ,రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.మీ సేవ ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు.భూ సమస్యలు,సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా,ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు.సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై,విద్యుత్,మిషన్ భగీరథ,ఇరిగేషన్, వ్యవసాయం,పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు.గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని,వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు.మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు.విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు.విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా" అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రుచి,నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ,విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి,భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా,వార్డెన్ దుర్గ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం


- సమస్యల పరిష్కారానికి చర్యలు
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ



**భువనగిరి టౌన్, ఏప్రిల్ 1 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ గ్రంథాలయాల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలను గ్రంథపాలకులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా భవన మరమ్మతులు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల లోపాలపై వివరాలు సేకరించారు. మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామపంచాయతీల పరిధిలో గ్రంథాలయ సెస్ వసూలు చేయాలని, పాఠకుల సభ్యత్వాలను పెంచాలని సూచించారు. గ్రంథాలయ సిబ్బంది విధులకు సమయపాలనతో హాజరవ్వాలని ఆదేశించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం సహా అన్ని శాఖ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులను సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. సుధీర్ మాట్లాడుతూ గ్రంథాలయ సెస్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రంథపాలకులకు సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్‌లో 12,000 మంది ఉద్యోగుల తొలగింపు

- ప్రపంచవ్యాప్తంగా 30,000 మందికి ఉద్వాసన పలకనున్న ఒరాకిల్
- వాలంటరీ రెసిగ్నేషన్‌కు 2 నెలల వేతనం అదనంగా పరిహారం




**హైదరాబాద్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (జనంసాక్షి)** :అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ తన భారతీయ ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. దాదాపు 12,000 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇది ఒరాకిల్ ఇండియా ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన సృష్టించింది. ఒరాకిల్ కార్పొరేషన్ ప్రపంచవ్యాప్తంగా సిబ్బందిని తగ్గించుకోవాలనే ప్రణాళికలో భాగంగా మొత్తం 30,000 మంది ఉద్యోగులను తొలగించనుంది. భారత్‌లో మాత్రం దాదాపు 12,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఒరాకిల్ ఇండియాలో ప్రస్తుతం సుమారు 30,000 మంది ఉద్యోగులు ఉన్నారు. పరిహారం ఇలా తొలగించబడే ఉద్యోగులకు కంపెనీ ప్రత్యేక పరిహార ప్యాకేజీ అందించనుంది. వాలంటరీ రెసిగ్నేషన్ ఇచ్చిన వారికి అదనపు శాలరీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ వంటివి ఇవ్వనుంది. ఒక ఏడాది పూర్తి చేసుకున్న ఉద్యోగులకు 15 రోజుల వేతనం, నోటీస్ పీరియడ్‌కు అనుగుణంగా ఒక నెల వేతనం మరియు గరిష్ఠంగా రెండు నెలల అదనపు వేతనం అందించనుంది.

సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ తొలగింపులు చేపట్టినట్లు ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో ఒరాకిల్ స్పష్టం చేసింది. ఇటీవల ఓపెన్‌ఏఐతో కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని నిర్ణయించినట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ఈ తొలగింపులు భారత ఐటీ రంగంలో మరోసారి ఉద్యోగుల్లో ఆందోళన సృష్టించాయి. ఒరాకిల్ ఇండియాలోని ఉద్యోగులు ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ నుంచి మరిన్ని అధికారిక వివరాలు రావాల్సి ఉంది.

# మార్చిలో రూ.2 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు

- గతేడాది కంటే రూ.17,000 కోట్లు అదనం.. 8.8 శాతం వృద్ధి
- దేశీయ విక్రయాలు 5.8%, దిగుమతులు 17.8% పెరిగాయి
- నికర వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మార్చి నెలలో భారీగా పెరిగాయి. 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేరకు వసూళ్లు నమోదయ్యాయి. గతేడాది మార్చి నెలలో జీఎస్టీ వసూ ళ్లు రూ.1.83 లక్షల కోట్లుగా ఉండగా, ఈ ఏడాది రూ.17, 000 కోట్లు అదనంగా వచ్చాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్లు, దిగుమ తుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

**2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం**

2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం జీఎస్టీ వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.22.27 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ విక్రయాలు, దిగుమతులు రెండూ బాగా పెరగడం వల్ల వసూళ్లు ఈ స్థాయిలో ఎగసిపోయాయని అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ భారీ వసూళ్లు దేశ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం మరియు వినియోగం పెరుగుదలను సూచిస్తున్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, రిఫండ్లు, ఇతర సర్దుబాట్ల తర్వాత నికర వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. ఈ సానుకూల పరిణామం కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభానికి మంచి సంకేతంగా భావించవచ్చు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 380 | ₹ 45.60 |
| వరంగల్ | ₹ 382 | ₹45.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్
₹1,51,480 (24 క్యారెట్లు) | ₹1,38,850 (22 క్యారెట్లు)
చెన్నై
₹1,40,500 (22 క్యారెట్లు) | ₹1,53,270 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹2,65,000

# సెమీకండక్టర్ రంగంలో భారత్ పటిష్టమవుతోంది

- కొవిడ్ నుంచి పాఠాలు నేర్చుకుని స్వయం సమృద్ధి వైపు : ప్రధాని మోదీ
- పాక్స్ సిలికాన్ కూటమిలోకి అమెరికాతో భారత్ భాగస్వామ్యం



**సనంద్ (గుజరాత్), మార్చి 31:** ప్రస్తుత యుద్ధం కారణంగా ప్రపంచ సరఫరా వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సెమీకండక్టర్ సరఫరాదారుగా భారత్ తన పాత్రను బలోపేతం చేసుకుంటోందని స్పష్టం చేశారు. గుజరాత్‌లోని సనంద్‌లో కేన్స్ సెమికాన్ అవుట్‌సోర్స్ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కొవిడ్ సంక్షోభంలోనే మన దేశం పటిష్టమైన సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను చురుగ్గా నిర్మిస్తోంది. ముడి పదార్థాల కోసం బలమైన సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం" అన్నారు.

ప్రధాని మోదీ మరింత వివరిస్తూ, కొవిడ్ సమయంలోనే భారత్ సెమీకండక్టర్ల తయారీలో ప్రపంచ కేంద్రంగా మారాలని నిర్ణయించుకుందని తెలిపారు. ప్రపంచ భాగస్వాములతో కలిసి పనిచేస్తూ సురక్షిత సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. సెమీకండక్టర్లు, ఏఐ, అరుదైన భూమూలకాలపై ప్రత్యేక దృష్టితో కీలక సాంకేతిక సరఫరా వ్యవస్థను పటిష్టం చేసేందుకు 2025 డిసెంబరులో అమెరికా నేతృత్వంలో ప్రారంభించిన 'పాక్స్ సిలికాన్' అనే వ్యూహాత్మక కూటమిలో భారత్ చేరిందని వెల్లడించారు.

**జాతీయ కీలక ఖనిజాల మిషన్**

కీలక ఖనిజాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు భారత్ 'జాతీయ కీలక ఖనిజాల మిషన్'ను ప్రారంభించిందని ప్రధాని తెలిపారు. ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి రూ.1,500 కోట్ల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి తీరప్రాంత రాష్ట్రాలను కలుపుకుని ఈ ఏడాది బడ్జెట్‌లో 'రేర్ ఎర్త్ కారిడార్'ను చేపట్టామని పేర్కొన్నారు. ఇది మైనింగ్, రిఫైనింగ్, తయారీ రంగాలను కలుపుతూ ఒక పటిష్టమైన వాల్యూ చైన్‌ను ఏర్పరుస్తుందని వివరించారు.

ప్రధాని మోదీ ఈ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా భారత్ సెమీకండక్టర్ రంగంలో స్వావలంబన సాధించడం దిశగా గణనీయమైన అడుగులు వేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధం, సరఫరా గొలుసు అంతరాయాలు వంటి సవాళ్ల మధ్య కూడా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేసుకుంటోందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ప్లాంట్ ప్రారంభం భారత్‌ను గ్లోబల్ సెమీకండక్టర్ వాల్యూ చైన్‌లో మరింత బలంగా నిలబెట్టడంలో ముఖ్యమైన మైలురాయిగా భావించవచ్చు.

# ఇరాన్‌తో పోరుకు యూఏఈ, సౌదీ అరేబియా

- హర్మూజ్ జలసంధి తెరవడానికి అమెరికాతో చేతులు కలిపిన గల్ఫ్ దేశాలు : వాల్ స్ట్రీట్ జర్నల్
- అమెరికా వినియోగంలోకి సౌదీ అరేబియా వైమానిక స్థావరాలు
- ఐక్యరాజ్యసమితి తీర్మానం కోసం యూఏఈ రహస్య చర్చలు



**టెహ్రాన్/దుబాయ్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :**

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) యుద్ధంలోకి నేరుగా ప్రవేశించేందుకు సిద్ధమైనట్లు 'వాల్ స్ట్రీట్ జర్నల్' సంచలన కథనం ప్రచురించింది. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వల్ల తమ దేశాలు భారీ నష్టపోయాయని, ఇకపై అలాంటి పరిస్థితి రాకూడదనే లక్ష్యంతో యూఏఈ అమెరికాతో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. ఇరాన్ హర్మూజ్‌ను మూసివేస్తే ఆ దేశం యుద్ధంలో నేరుగా పాల్గొన్న మొదటి పర్షియన్ గల్ఫ్ దేశంగా యూఏఈ నిలవనుంది. గతంలో తమ వైమానిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరించిన సౌదీ అరేబియా, ప్రస్తుతం అందుకు అంగీకరించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు తమ దేశం పూర్తి మద్దతు ఇస్తోందని సౌదీ అధికారిక వర్గాలు తెలిపాయి.

**యూఏఈ రహస్య దౌత్యం**

యూఏఈ ఇరాన్‌పై దాడుల కోసం ప్రపంచ దేశాలతో రహస్య చర్చలు జరుపుతోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అవసరమైతే బలప్రయోగం చేసైనా హర్మూజ్‌ను తిరిగి తెరవడానికి ఒక అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేయాలని యూఏఈ దౌత్యవేత్తలు అమెరికా, యూరప్, ఆసియా దేశాలను కోరుతున్నాయి.

ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాదాపు 2,500 క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. తమకు వ్యతిరేకంగా సైనిక చర్యకు మద్దతిచ్చే గల్ఫ్ దేశాల్లోని పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఇరానీయులకు యూఏఈలోకి ప్రవేశం నిషేధించినట్లు విమానయాన సంస్థలు తెలిపాయి. ఆర్థిక పర్యవసానాలు హర్మూజ్ జలసంధి మూసివేయడం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ పతనం వైపు వెళ్తుందని యూఏఈ హెచ్చరిస్తోంది. ఇరాన్ హర్మూజ్‌ను పూర్తిగా తన అధీనంలోకి తీసుకుంటే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని గల్ఫ్ దేశాలు భావిస్తున్నాయి. ఈ పరిణామాలు ఇరాన్-అమెరికా యుద్ధాన్ని మరింత విస్తృతం చేసే అవకాశం ఉంది. యూఏఈ, సౌదీ అరేబియా నిర్ణయాలు గల్ఫ్ ప్రాంతంలోని రాజకీయ-సైనిక సమీకరణాలను పూర్తిగా మార్చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

# సెమాగ్లుటైడ్ ఔషధ ధరల్లో భారీ కోత

- ఊబకాయం, మధుమేహ రోగులకు పెద్ద ఊరట
- నొవో నార్డిస్క్ ఒజెంపిక్ 36%, వెగోవీ 48% తగ్గించింది
- ఇప్పటికే చౌకగా మార్కెట్లోకి దేశీయ జనరిక్స్ కంపెనీలు




**న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 31:** భారత్‌లో ఊబకాయం (ఒబేసిటీ) మరియు టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సెమాగ్లుటైడ్ ఔషధ ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. డెన్మార్క్ కంపెనీ నొవో నార్డిస్క్ తన బ్రాండెడ్ ఔషధాల ధరల్లో భారీ కోత విధించి పోటీని తీవ్రతరం చేసింది. నొవో నార్డిస్క్ తన ఇంజెక్టబుల్ సెమాగ్లుటైడ్ బ్రాండ్లయిన ఒజెంపిక్ ధరను 36%, వెగోవీ ధరను 48% తగ్గించింది. ఓరల్ సెమాగ్లుటైడ్ బ్రాండ్ అయిన రీబెల్సస్ ధరల్లో మాత్రం మార్పు లేదు. ఈ ధరల మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయి. 0.25 ఎమ్జి డోసు ఒజెంపిక్, వెగోవీ నెలవారీ ధరలు రూ.8,800, రూ.10,848 నుంచి రూ.5,660కి తగ్గాయి. ఒజెంపిక్ మూడు డోసుల్లో (0.25 mg, 0.5 mg, 1 mg) ధరలు రూ.8,800-11,175 నుంచి రూ.5,660-9,100కి తగ్గాయి (సగటున 23.8% తగ్గుదల).

వెగోవీ 5 రకాల డోసుల్లో ధరలు రూ.10,850-16,400 నుంచి రూ.5,660-16,400కి తగ్గాయి (సగటున 27% తగ్గుదల). ఒజెంపిక్‌ను మధుమేహ నియంత్రణకు, వెగోవీని ఊబకాయం, బరువు నియంత్రణకు వాడుతున్నారు. దేశీయ కంపెనీలు ఇప్పటికే చాలా తక్కువ ధరల్లో జనరిక్ వెర్షన్లను మార్కెట్లోకి తీసుకొచ్చాయి.

- నాట్కో ఫార్మా పెన్-బేస్డ్ సెమాగ్లుటైడ్ జనరిక్: నెలవారీ రూ.4,000-4,500
- డాక్టర్ రెడ్డీస్ ఇంజెక్టబుల్ పెన్ వెర్షన్ (మధుమేహానికి మాత్రమే): రూ.4,200
- సన్‌ఫార్మా సెమాట్రినిటీ (మధుమేహ నియంత్రణకు): రూ.3,000-5,200

"మా వినూత్న చికిత్సల ధరలను సవరించడం ద్వారా భారత్‌లో మరింత మంది రోగులకు ఈ ఔషధాలు చేరువ కావాలని మేము కోరుకుంటున్నాం" అని నొవో నార్డిస్క్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విక్రాంత్ శ్రోత్రియ తెలిపారు. ఊబకాయం, టైప్-2 మధుమేహం భారత్‌లో వేగంగా పెరుగుతున్న సమస్య. ఇప్పటికే లక్షలాది మంది ఈ ఔషధాలపై ఆధారపడి ఉన్నారు. ధరల్లో ఈ భారీ కోతతో రోగుల ఖర్చు గణనీయంగా తగ్గనుంది. దేశీయ జనరిక్స్ కంపెనీలు ఇప్పటికే చాలా తక్కువ ధరల్లో మార్కెట్లోకి వచ్చినందున పోటీ మరింత తీవ్రమైంది. ఈ మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రావడం వల్ల రోగులు, డాక్టర్లు, ఫార్మసీలు త్వరగా ఈ ధరల మార్పును అనుభవిస్తారు. ఈ పరిణామం భారత ఔషధ మార్కెట్‌లో బ్రాండెడ్, జనరిక్ మధ్య పోటీని మరింత ఉద్దీపనం చేస్తుందని నిపుణులు అంటున్నారు.

## యాపిల్ 50 ఏళ్ల ప్రయాణం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి):** 1976 ఏప్రిల్ 1న కాలిఫోర్నియాలోని లాస్ ఆల్టోస్‌లో స్టీవ్ జాబ్స్ ఇంటి గ్యారేజీలో చిన్నగా ఆవిర్భవించిన యాపిల్ కంప్యూటర్ కంపెనీ, ఈ రోజు ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థల్లో ఒకటిగా మారింది. వ్యక్తిగత కంప్యూటర్లతో ప్రయాణం ప్రారంభించి, మ్యాకింతోష్, ఐపాడ్, ఐఫోన్, ఐప్యాడ్ వంటి వినూత్న ఉత్పత్తులతో లక్షలాది మంది జీవితాలను మార్చిన యాపిల్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సేవల మూడు రంగాల్లోనూ అసాధారణ నాణ్యతతో విజయం సాధించింది. అంతర్జాతీయంగా తయారవుతున్న ఐఫోన్‌లలో సుమారు 25 శాతం భారత్‌లో అసెంబ్లీ అవుతున్నట్లు గమనార్హం. గతేడాది (2025) భారత్‌లో 5.5 కోట్ల ఐఫోన్‌లు అసెంబ్లీ చేశారు. ఇది గత సంవత్సరం కంటే 53 శాతం ఎక్కువ. చైనా నుంచి ఉత్పత్తి వైవిధ్యపరచడంలో భాగంగా భారత్ యాపిల్‌కు కీలక ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోంది. నాణ్యతే ప్రామాణికంగా సాగుతూ, వినియోగదారులకు అత్యుత్తమ అనుభవం అందించడంలో యాపిల్ ఎప్పుడూ ముందంజలో ఉంటోంది. ఈ రోజు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న యాపిల్, చిన్న గ్యారేజీ నుంచి ట్రిలియన్ డాలర్ల సంస్థగా ఎదగడం ప్రపంచ వ్యాపార చరిత్రలోనే అపూర్వమైన కథగా నిలిచింది.

# యూపీఐ సేవలకు తీవ్ర అంతరాయం.. దేశవ్యాప్తంగా ఇబ్బందులు

- ఇబ్బందులు ఎదుర్కొన్న లక్షలాది వినియోగదారులు
- ఎస్‌బీఐలో ఎక్కువగా సమస్య
- షెడ్యూల్డ్ మెయింటెనెన్స్‌కు సమయం పొడిగింపు
- యూపీ లైట్, ఏటీఎం ప్రత్యామ్నాయాలు సూచన





**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపు సేవలకు బుధవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. లావాదేవీలు చేయడానికి ప్రయత్నించిన లక్షలాది వినియోగదారులు ట్రాన్సాక్షన్లు విఫలమవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవల్లో సమస్య ఎక్కువగా కనిపించింది.

ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే వందల సంఖ్యలో ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె, కోల్‌కతా, చెన్నై, గువాహటి వంటి ప్రధాన నగరాలతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల నుంచి యూపీఐ లావాదేవీలు సరిగా జరగడం లేదని, యాప్‌లు లోడ్ కావడం లేదని వినియోగదారులు ఫిర్యాదు చేశారు. కొందరి ట్రాన్సాక్షన్లు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ సమస్యపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అనేక మంది తమ అసహనం వ్యక్తం చేశారు. ఈ అంతరాయం షెడ్యూల్డ్ నిర్వహణ పనుల కారణంగా ఏర్పడినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ముందుగా నిర్ణయించిన సమయాన్ని పొడిగించి, ఏప్రిల్ 1 మధ్యాహ్నం 12:15 గంటల నుంచి 1:00 గంటల వరకు (45 నిమిషాలు) UPI, IMPS, YONO, ఇంటర్నెట్ బ్యాంకింగ్, NEFT, RTGS సేవల్లో అంతరాయం ఉండవచ్చని బ్యాంకు తెలిపింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు UPI Lite మరియు ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది. ఈ సంఘటన డిజిటల్ చెల్లింపులపై ఆధారపడిన ప్రజలలో తాత్కాలిక అసౌకర్యం సృష్టించింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇలాంటి అంతరాయాలు ఎక్కువ మందిని ప్రభావితం చేశాయి. అయితే షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ పూర్తయిన తర్వాత సేవలు సాధారణ స్థితికి వస్తాయని బ్యాంకు అధికారులు భరోసా ఇచ్చారు.

# కాస్తా జోష్ దొరికింది..

- సెన్సెక్స్ 1,187 పాయింట్లు లాభాల్లో స్టాక్ మార్కెట్
- నిఫ్టీ 348 పాయింట్లు లాభపడి 22,679 వద్ద ముగింపు
- ట్రెంట్, ఇండిగో, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్‌బీఐ స్టాక్స్ లాభాలు




**ముంబయి, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1,187 పాయింట్లు లాభపడి 73,134 వద్ద ముగిసింది. నిఫ్టీ 348 పాయింట్లు పెరిగి 22,679 వద్ద ట్రేడ్ అయింది. నేటి ట్రేడింగ్ సెషన్‌లో ఉదయం సెన్సెక్స్ 1,800 పాయింట్లకు పైగా, నిఫ్టీ 550 పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడ్ అయింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇండిగో, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్‌బీఐ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ, సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి.

**లాభాలకు కారణాలు**

- విదేశీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- ముడి చమురు ధరలు తగ్గడం (బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్లు)
- ఇరాన్‌లో తమ సైనిక చర్యను అతి త్వరలో ముగిస్తామని ట్రంప్ సానుకూల ప్రకటన
- అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ఔన్సు 4,736 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

ఈ భారీ లాభాలు గత రోజుల్లో మార్కెట్ ఎదుర్కొన్న నష్టాలను కొంతవరకు భర్తీ చేశాయి. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలు కొంత తగ్గినట్లు ట్రంప్ సానుకూల వ్యాఖ్యలు, చమురు ధరల తగ్గుదల మరియు విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు మార్కెట్‌కు బలం ఇచ్చాయి. అయితే యుద్ధం పూర్తిగా ముగియకపోవడం వల్ల మార్కెట్ ఇంకా అనిశ్చితిలోనే ఉంది. రేపటి ట్రేడింగ్‌లో కూడా ఈ సానుకూలత కొనసాగాలంటే ట్రంప్ మరిన్ని సానుకూల సంకేతాలు ఇవ్వాలి. మొత్తంమీద ఈ రోజు లాభాలు ఇన్వెస్టర్లకు ఊరట కలిగించినప్పటికీ, యుద్ధ పరిస్థితులు ఇంకా స్థిరపడకపోవడం వల్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

# సిలిండర్

## భారీగా పెరిగిన వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర.. రూ.195 పెంపు



- 19 కిలోల సిలిండర్ ఢిల్లీలో రూ.2,078, హైదరాబాద్‌లో రూ.2,320
- గత నెలలో కూడా రూ.155 పెంపు - రెండు నెలల్లో భారీ పెరుగుదల
- గృహ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు
- చమురు ధరలపై ప్రభావం చూపుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :**

పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ ధర భారీగా పెరిగింది. సిలిండర్‌పై రూ.195 పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. ఈ పెంపు నేటి నుంచి అమలులోకి వచ్చింది. గృహావసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.2,078కి చేరుకుంది. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.2,320గా ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో గత నెలలో కూడా గృహ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.155 వరకు ధరలు పెరిగాయి. ఈ క్రమంలో మరోసారి వాణిజ్య సిలిండర్ ధర భారీగా పెంచడం గమనార్హం. ఇది వాణిజ్య రంగం, హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

**ఏటీఎఫ్ ధరలో కూడా భారీ పెరుగుదల**

ఒకవైపు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతుండగా, మరోవైపు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్) ధరలు ఆకాశాన్నంటాయి. దాదాపు 115 శాతం పెరిగిన ఏటీఎఫ్ ధరలో కేంద్రం దేశీయ ఎయిర్‌లైన్స్‌కు పాక్షిక ఊరట కల్పించింది. ఢిల్లీలో కిలో లీటర్ ఏటీఎఫ్ ధర రూ.2,07,341.22కి చేరుకుంది. గతంలో రూ.96,638 ఉండగా, ఇప్పుడు దాదాపు 114.5 శాతం పెరిగింది. ఏటీఎఫ్ ధర రూ.2 లక్షలు దాటడం ఇదే తొలిసారి. అయితే దేశీయ సర్వీసులకు ఏటీఎఫ్ పెంపు 8.5 శాతం మాత్రమే అమలు చేస్తున్నట్లు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దశలవారీగా లీటర్‌కు రూ.15 చొప్పున పెంచనున్నట్లు తెలిపింది. విదేశీ మార్గాల్లో మాత్రం అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా పూర్తి పెంపు అమలవుతుంది.

ఇంధన ధరలు భారీగా పెరగడంతో విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో 40 శాతం ఇంధన ధరలకే వెచ్చించాల్సి వస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో విమాన సర్వీసులు నడుపుతుండటం వల్ల ఎయిర్‌లైన్స్‌పై ఇప్పటికే అదనపు భారం పడుతోంది. ఇప్పటికే పలు విమానయాన సంస్థలు టికెట్లపై ఫ్యూయెల్ సర్‌ఛార్జీలు విధించాయి.

**భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర సవాలు**

పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధరలు 100-103 డాలర్లుకు బ్యారెల్ చేరుకున్నాయి. భారత్ తన అవసరాలలో 85% చమురును దిగుమతి చేసుకుంటుంది కాబట్టి ఈ పెరుగుదల దేశ ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాలపై బహుముఖ ప్రభావం చూపుతుంది. దిగుమతి బిల్లు, కరెంట్ ఖాతా లోటు: ప్రతి ౮10 ధర పెరుగుదలకు దిగుమతి బిల్లు సుమారు రూ.1.4-1.5 లక్షల కోట్లు అదనంగా పెరుగుతుంది. జాఱణ 0.3-0.5% +డిపి వరకు విస్తరించవచ్చు.

**రూపాయి బలహీనత:** రూపాయి ప్రస్తుతం 95 మార్కు దాటి బలహీనపడుతోంది. ధరలు ఎక్కువసేపు ఉంటే 96-98 స్థాయికి చేరవచ్చు.

**ఇన్‌ఫ్లేషన్ పెరుగుదల:** ప్రతి ౮10 ధర పెరుగుదలకు +డిపి ఇన్‌ఫ్లేషన్ 0.55-0.60% పెరుగుతుంది. ప్రస్తుతం 4% చుట్టుపక్కల ఉంటే, ధరలు డాలర్లు100-110 మధ్య ఉంటే 4.5-5.5% వరకు చేరవచ్చు.

**డిపి వృద్ధి మందగమనం:** ౮10 ధర పెరుగుదలకు +డిపి వృద్ధి 0.3-0.5% తగ్గవచ్చు. ౮100 బ్యారెల్ స్థాయిలో ఎఫ్‌వై 27 +డిపి 6.6% వరకు తగ్గవచ్చు.

**స్టాక్ మార్కెట్ ప్రభావం:** ఇంధన ఖర్చులు పెరగడంతో కంపెనీల లాభాలు తగ్గి స్టాక్ మార్కెట్‌లో నష్టాలు వస్తాయి. ఎయిర్‌లైన్స్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, సిమెంట్ రంగాలు ఎక్కువగా ప్రభావితమవుతాయి.

**ప్రభుత్వ ఆర్థిక భారం:** ఇంధన సబ్సిడీలు పెరగడం వల్ల ఫిస్కల్ డెఫిసిట్ పెరుగుతుంది.

ప్రస్తుతం చమురు ధరలు డాలర్లు100-103 స్థాయిలో ఉండటం భారత్‌కు తీవ్ర సవాలుగా మారింది. ఇది ఇన్‌ఫ్లేషన్ పెంచి, రూపాయిని బలహీనపరచి, డిపి వృద్ధిని మందగింపజేస్తుంది. యుద్ధం త్వరగా ముగిసి ధరలు తగ్గితే మాత్రమే ఈ ప్రభావం పరిమితం అవుతుంది. లేకపోతే డిపి వడ్డీ రేట్లు పెంచడం, ప్రభుత్వం ఖర్చులు తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు పెరుగుదలలు (వాణిజ్య ఎల్‌పీజీ , ఏటీఎఫ్) వాణిజ్య రంగం, విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పారిశుధ్య పనులు,నీటి సరఫరా పకడ్బందీగా చేయాలి

- ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వేములవాడ మున్సిపల్ పరిధిలో నిత్యం పారిశుధ్య పనులు,నీటి సరఫరా పనులు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో ఇటీవల మున్సిపల్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు,కరెంట్ బిల్లులు,రుణాల చెల్లింపు,పారిశుధ్య పనులకు చెల్లింపులు,ఇతర ఖర్చులు ఉంటాయని,తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని ఆమె స్పష్టం చేశారు.నర్సరీల నిర్వహణ,మొక్కల పెంపకం, సంరక్షణకు ఖర్చు చేయాలని సూచించారు.మున్సిపల్ మొత్తం బడ్జెట్ లో 1/3 శాతం విలీన గ్రామాలు,వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు.మున్సిపల్ కార్మికులందరికీ వెంటనే బీమా చేయించాలని కమిషనర్ ను ఆదేశించారు. మున్సిపల్ కు రావాల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు తమ పరిధిలో ఇంటి,నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలన్నారు.అన్ని షాపు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపల్ నిధులతో నిర్మించిన భవనాలు అన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని, తడి,పొడి చెత్త వేరు వేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. తడి చెత్తను ఎరువుగా చేసి విక్రయించాలని, పొడి చెత్తను విక్రయిస్తే బల్దియాకు ఆదాయం వస్తుందన్నారు.పార్కులు,వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభానికి సిద్ధం అవుతుందని,నిర్వహణ పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.డీఆర్ సీసీ కేంద్రం పక్కాగా నిర్వహించాలన్నారు. నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్సు యుద్ధ విమానం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా కౌన్సిలర్లు, అధికారులు చూసుకోవాలని, ఏమైనా మరమ్మత్తులు ఉంటే చేయించాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,వైస్ చైర్మన్ నరాల శేఖర్,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కులను ఐక్యంగా సాధించుకోవాలి

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** జర్నలిస్టులు తమ హక్కులను సాధించుకు నేందుకు ఐక్యంగా పోరాటాలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. బుధవారం వేములవాడలోని మున్నూరుకాపు నిత్య అన్నదాన సత్ర భవనంలో టీడబ్ల్యూజేఎఫ్ వేములవాడ నియోజకవర్గ సమావేశనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా జర్నలిస్టులకు కనీసం అక్రెడిటేషన్లు,హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం విచారకరమన్నారు.తెలంగాణ ఉద్యమంలో విరోచిత పాత్ర పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం విస్మరించిందని,ఈ ప్రభుత్వం కూడా రెండేళ్లుగా సమస్యలు పరిష్కరించకుండా తీవ్ర వివక్ష చూపుతుందన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జర్నలిస్టులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇండ్లు ఇండ్లస్థలాలు, హెల్త్ కార్డులు, పెన్షన్ వంటి డిమాండ్ల సాధనకై జర్నలిస్టులు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ కుడితాడు బాపురావు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అన్నారు.జిల్లాలో ఫెడరేషన్ ను బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడురవి అధ్యక్షత వహించగా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, వేములవాడ కన్వీనర్ బిక్షపతి, కొప్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

**వేములవాడ నూతన కమిటీ ఎన్నిక**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వేములవాడ నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా బొప్ప బిక్షపతి,కార్యదర్శిగా గొల్లపల్లి వేణు, ఉపాధ్యక్షులుగా కవ్వాల సురేందర్, కోశాధికారిగా సాహెద్ పాషా, జాయింట్ సెక్రెటరీలుగా ఏం సంజీవ్, చింతల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నడిగట్ల మధు, చక్రహరి దేవేందర్ రాజ, నడికట్ల బిక్షపతి, కొమురవెల్లి మునిష్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భం గా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఫెడరేషన్ రాష్ట్ర నాయకులను, ఎన్నికైన నూతన కమిటీని శాలువాలతో సన్మానించారు.

# డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి

- ప్రజల ఆకాంక్షలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- డంపింగ్ యార్డ్ ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు సంఘీభావం



**హుజురాబాద్, (జనంసాక్షి) :** హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో పది రోజులుగా జరుగుతున్న ఆందోళనలు, దీక్షలకు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ సంఘీభావం ప్రకటించారు. బుధవారం అయన స్థానిక జేఏసీ నేతలతో మాట్లాడారు. డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని విరమించుకుంటున్నట్లుగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అయన డిమాండ్ చేసారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం జరిగితే.. వాతావరణ కాలుష్యం ఈ ప్రాంతంలో పెరిగే అవకాశం ఉందని, ఇతర మున్సిపాలిటీల నుంచి ఇక్కడికి చెత్తను తరలిస్తారని తద్వారా మానవాళికి, పశుపక్ష్యాదులకు, పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని అయన ఆందోళన వ్యక్తం చేసారు. ఒకసారి డంపింగ్ యార్డ్ అండ్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం జరిగితే.. దాని నుండి వెలువడే కాలుష్యం ఆపడం కష్టమని అన్నారు. ప్రతిరోజూ ఇతర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వాహనాలు చెత్తను ఇక్కడకు తీసుకువస్తామని, తద్వారా దుమ్ము, ధూళి అధికమవుతుందని, రైతుల భూముల ధరలు పడిపోతాయని, పిల్లల కు, మహిళలకు, శిశువులకు, వృద్దులకు ప్రాణ హాని ఉంటుందని అయన అన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా సబ్బండ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారని, ఇది హుజురాబాద్ భవిష్యత్తుకు, అభివృద్ధికి, ప్రజల జీవనానికి ముడిపడివున్న సమస్య అని, ప్రజల ఆకాంక్షలను గౌరవిం చాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. తాను కూడా జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షల్లో ఒక రోజు పాల్గొంటానని అయన వివరించారు.

# ప్రజాభవన్‌లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 01 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లక్షా నూటపదహారు రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన కుటుంబాలకు ఈ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. పేద ఆడ పడచులు పెళ్లిళ్లకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నదని ఆయన వివరించారు. ఈ పథకాలు పేదలకు ఎంతోలాభదాయకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల తాహసిల్దార్ కర్ర శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, గొట్టిముక్కల సంపత్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పాలు రాము, రమేష్, నరేందర్ రెడ్డి, చింతల తిరుపతి రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రవీందర్ లక్ష్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఎం జ్యోతి, ఆర్.రమేష్, జీపీఓ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

**మంథని ప్రభుత్వ హాస్పిటల్ తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్ ను బుధవారం మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తనిఖీ చేశారు. హాస్పిటల్ వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ హాస్పిటల్ కి అధిక సంఖ్యలో పేద ప్రజలు వస్తారని వారికీ అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించడం మన భాధ్యత అని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు మారుపాక నిహారిక, ఎల్లంకి వంశీధర్, కాంగ్రెస్ నాయకులు వేముల సమ్మయ్య పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ సరి చేయండి



**ఆర్మూర్, ఏప్రిల్ 1 (జనంసాక్షి):** ఆలూర్ మండలంలోని మిర్దపల్లి రోడ్డులో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీ తీవ్రతరమైంది. గత నెల రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్న అధికారులు పట్టించు కోకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది.పైప్‌లైన్ లీక్ కారణంగా నీరు రోడ్డుమీద ప్రవహిస్తూ బురదమయంగా మారింది. దీంతో ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాలు స్కిడ్ అయ్యి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.మిషన్ భగీరథ నీరు గత కొన్ని రోజులుగా చేరడంతో రోడ్డుపై చిన్నపాటి కుంటలను తలపించేలా నీరు నిల్వవుతోంది. దీని వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.స్థానికులు పలుమార్లు గ్రిడ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం గమనార్హం. మెయిన్ పైప్‌లైన్ లీక్ కారణంగా నీరు పొలాల్లోకి చేరి పంటలకు నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి లీకేజీని తక్షణమే సరిచేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

# ఆర్పీలు అవినీతికి పాల్పడితే సహించేది లేదు

**మున్సిపల్ కమిషనర్ అయాజ్,**

**చైర్మెన్ ప్రశాంత్ కుమార్**



**జమ్మికుంట, (జనంసాక్షి):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అర్పిలు అవినీతికి పాల్పడితే సహించేది లేదని మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌లు అన్నారు.బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అర్పిలతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్ డోర్ చెత్త సేకరణ,మున్సిపల్ అభివృద్ధిలో అర్పిల పాత్ర చాలా కీలకమైనదన్నారు. అర్పిలు సంఘాలకు బ్యాంక్ నుండి లోన్ ఇప్పించడం బాధ్యత అని వారన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.సంఘ సభ్యులు లోన్ ఇచ్చే ముందు డబ్బులు అడుగుతున్నారని మా దృష్టికి కానీ, ఏసీబీ అధికారుల దృష్టికి నేరుగా సమా చారం ఇవ్వవచ్చన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, మెప్మా ఇంచార్జి టి.ఏం.సి మల్లీశ్వరి, సి.ఎల్. అర్పిలు, సమాఖ్య ఓబీలు పలువురు పాల్గొన్నారు.

# గురునాథం చెరువు పనులను వేగిర పరచండి : మియాపూర్ డిసి



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధి అమీన్పూర్ రోడ్డు వైన్డింగ్ లో భాగంగా గురునాథం చెరువు వద్ద నిర్మిస్తున్న ఎస్ఎన్డి పి బాక్స్ డ్రైన్ పనులను మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ బుధవారం పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ మరియు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ సిటి పనులలో భాగంగా అమీన్పూర్ రోడ్ వైన్డింగ్ కార్యక్రమాన్ని మరింత వేగిన పరచాలని సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు సూచించడం జరిగింది. ప్రజలకు రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు వైండింగ్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్ కు ప్రజా అవసరాలను వివరిస్తూ నాణ్యతతో కూడిన పనులను చేపట్టి పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని డిసి కోరారు.

**ఆస్తి పన్నును సకాలంలో సేకరించాలి:డిసి శశిరేఖ**

మియాపూర్ సర్కిల్ పరిధిలో ప్రజల నుండి రావలసిన ఆస్తి పన్నును వీలైనంత త్వరగా సేకరించడం ద్వారా అటు ప్రభుత్వానికి, ఇటు మియాపూర్ సర్కిల్ కార్యాలయానికి లబ్ధిని చేకూర్చాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు గట్టి కృషిని సలపాలని మియాపూర్ సర్కిల్ డిసి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ లు, టాక్సీ ఇన్స్పెక్టర్లు మరియు బిల్ కలెక్టర్ల తో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గత ఆర్థిక సంవత్సరం మిగిలిపోయిన ఆస్తి పన్ను వసూలు, ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో ఎర్లీ బర్డ్ విధానాన్ని సమగ్రంగా అమలు చేస్తూ వీలైనంత త్వరగా ప్రజల నుండి ఆస్తిపన్నులు రాబట్టాలని డిసి సూచించారు.

# మున్సిపల్ యాక్ట్‌కు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వేములవాడ మున్సిపల్ అధికారులు మున్సిపల్ ఆక్ట్ కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరుపై బుధవారం బిజెపి,బిఆర్ఎస్ పార్టీల కౌన్సిలర్లు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశ ఎజెండా కాపీలను కౌన్సిలర్లకు కనీసం వారం రోజుల ముందు ఇవ్వాలన్నారు. మూడు రోజుల ముందు ఎజెండా కాపిలను ఎలా యిస్తారన్నారు. గడువు ఇవ్వకుండా బడ్జెట్ సమావేశాన్ని ఎలా నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు.రాజ్యాంగానికి విరుద్ధంగా బడ్జెట్ సమావేశం నిర్వహించారని,మినిట్ బుక్ లో రాయకుండా సమావేశం తర్వాత రాస్తామని కమిషనర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సమావేశం నిర్వహించడం వారి అసమర్థతకు అర్థం పడుతుందన్నారు.గత సమావేశంలో ప్రజా సమస్యలపై మాట్లాడిన అంశాలను సైతం మినిట్ బుక్ లో నమోదు చేయలేదని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో మినిట్ బుక్ ని కూడా చూపించకుండా, అభ్యంతరాలు నమోదు చేయకుండా నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

# చికెన్ షాపులు బంద్




**గద్వాల టౌన్ ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి చికెన్ షాపుల బంద్‌కు చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.ఈ నేపథ్యంలో గద్వాల జిల్లా కేంద్రంతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చికెన్ షాపులు మూసివేసి యజమానులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా యజమానులు మాట్లాడుతూ పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ మార్జిన్‌ను తగ్గించడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో 1.8 రూపాయలుగా ఉన్న మార్జిన్‌ను ప్రస్తుతం1.5 రూపాయలకు తగ్గించడమే ఈ బంద్‌కు ప్రధాన కారణమని తెలిపారు.తమ డిమాండ్లను ప్రభుత్వం మరియు పౌల్ట్రీ కంపెనీలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ బంద్ చేపట్టినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని చికెన్ షాపుల యజమానులు ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు.మార్జిన్ పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.అలాగే అసోసియేషన్ నిర్ణయాన్ని పాటించకుండా షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# డివిజన్ల సభ నిర్వహణకు చురుగ్గా ప్రణాళిక

**నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**




**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు (ఏప్రిల్ 2న) నగరవ్యాప్తంగా వార్డు / డివిజన్ల సభలను విజయవంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీస్కోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో బుధవారం రోజు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, సానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డు సభ నిర్వహణకు చేపట్టాల్సిన ప్రణాళిక, చేయాల్సిన ఏర్పాట్లు, జన సమీకరణ, ముఖ్య అతిథుల ఆహ్వానం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వార్డు సభల నిర్వహణపై పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వార్డు సభల నిర్వహణకు నగరపాలక సంస్థ నుండి ఇంచార్జ్ అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. నగరవ్యాప్తంగా 66 డివిజన్లలో కార్పోరేటర్ల సహకారం సమన్వయంతో వార్డు సభలు ఏర్పాటుకు చర్యలు తీస్కోవాలన్నారు. ఉదయం 10 గంటలకు వార్డు సభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, మహిళా శక్తి, రైతు భరోసా, మహిళా సంఘాల వడ్డీ రుణాలు తదితర పథకాలను సంబంధిత శాఖల అధికారుల నుండి వివరిం చేలా చర్యలు తీస్కోవాలన్నారు. డివిజన్లవారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, చేయాల్సిన అభివృద్ధి పనులను వివరించాలని, వార్డు సభలో ప్రజల నుండి ఫిర్యాదుల, అభ్యంతరాలు స్వీకరించేలా చర్యలు తీస్కోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, డీఈలు, రెవెన్యూ, సానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు

**ప్రసాదించిన బ్యాంకు మాజీ ఉద్యోగి**



**మంథని (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలో నివసించే జంగపల్లి మల్లయ్య (75) మాజీ బ్యాంకు ఉద్యోగి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఇంటి పెద్ద మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇలాంటి దుఃఖ సమయంలో కూడా మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన కుటుంబం. నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని, మల్లయ్య కళ్ళు సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయని కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కోశాధికారి డా. విజయకుమార్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో భార్య జంగపల్లి లక్ష్మి కుమారులు సత్య నారాయణ, విజయ్ కుమార్ కుమార్తెలు వెంకట్ లక్ష్మి- అల్లుడు పోతరాజు సమ్మయ్య మనవళ్లు మనవరాలు రవళి,యశ్వంత్ సాయి, రిషిత, ప్రియతమ్ అంగీకరించారు. బుధవారం సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, కమాన్ పూర్ మండల అధ్యక్షులు నర్సింహా చారీ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణరెడ్డి కార్యదర్శి నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుని నేత్రాలను సేకరించారు. అనంతరం వాటిని ఎల్వీ ప్రసాద్ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా నేత్రదాత కుటుంబ సభ్యులను కమాన్ పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు సతీష్, శ్రీను అభినందించారు. పార్థివదేహం వద్ద మౌనం పాటించి నేత్రదాతకు నివాళులర్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, వెల్ది కవిత అనంతరాములు, కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కొనియాడారు.

# అప్పుల కిందకు ప్లాట్లు కబ్జా

## ప్రస్తుత బిజినేపల్లి గ్రామ పంచాయతీ సభ్యుడి భాగోతం






**బిజినేపల్లి (జనంసాక్షి) :** మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలోని ఒక సర్వే నంబర్లో అర్హులైన లబ్ధిదారులకు గత కలెక్టర్, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కేటాయించిన ప్లాట్లను ప్రస్తుత గ్రామ పంచాయతీ సభ్యుడు ఒకరు దొంగ చాటుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. గత అధికారులు అర్హులైన లబ్ధిదారుల కోసం అని అయ్యప్ప ఆలయ సమీపంలో 15 మందికి ప్రత్యేక లె అవుట్ వేసి ప్లాట్లు కేటాయించారు. ఆ లబ్ధిదారులు నానా వ్యయ ప్రయాసల కోర్చి గుంతలు, రాళ్ళు, గుట్టలతో ఉన్న ఆ ప్లాట్ల చదును చేసుకున్నారు. అందులో ముగ్గురు ఇండ్లు నిర్మించుకోగా మరో లబ్ధిధారుడు గుడిసె ఏర్పాటు చేసుకున్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుత పంచాయతీ బోర్డులో ఒక కీలక పదవిలో ఉన్న సభ్యుడు అందులో 380 గజాల వరకు రెండు ప్లాట్లను దొంగ చాటుగా పట్టాలు చేసుకున్నాడు. ఈ మధ్య కాలంలో ఒక లబ్దిదారుడు తనకు ఇంటి నిర్మాణ అనుమతి కావాలని అర్జి పెట్టుకోగా అసలు విషయం బయటకు పొక్కింది. ఈ అన్యాయం ఏంటి అని లబ్దిదారుడు గ్రామ పెద్దలను ఆశ్రయించాడు. వారు ఆ సభ్యుడిని పిలిచి ఇదేంటని ప్రశ్నించగా గత సర్పంచి తనకు లక్షల్లో అప్పు ఉన్నాడని, ఆ అప్పు కిందకు ఈ 2 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాను అని చెప్పడంతో అక్కడున్న పెద్దలు ముక్కున వేలేసుకున్నారు. ఒకరికి కేటాయించిన ప్లాట్లు అలా ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటావ్ అని ఆ గ్రామ పెద్దలు ప్రశ్నించగ, అక్కడ ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని చేసుకున్నట్లు చెప్పాడు.

### ఖాళీగా కనిపిస్తే ఖాబ్జానేనా?

ఖాళీగా కనిపిస్తే అప్పుల కిందకు ప్లాట్లు కబ్జా చేస్తామంటే ప్రస్తుతం మండల తహశీల్దారు కార్యాలయంతో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయని వాటిని కూడా కబ్జాలు చేస్తారా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమ అవసరం కోసం ఎవరు ఏది రాసిచ్చిన కబ్జా చేస్తారేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడు పంచాయతీలో కీలక సభ్యుడిగా ఉన్న అతను భవిష్యత్తులో ఇంకెన్ని కబ్జాలకు పాల్పడుతాడో అన్న సందేహాలు ఆ గ్రామ ప్రజల్లో నెలకొన్నాయి.

# పేద ప్రజలకు సొంత గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, (జనంసాక్షి):** పేద ప్రజలకు సొంత గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ 3వ వార్డు దేవుని ఎర్రవల్లిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. పేద వారి సొంత ఇంటి కల నెరవేరిన రోజు మనందరికీ ఆనందకరమైన రోజు అని అన్నారు. పేద ప్రజలకు గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్యంతో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించడం నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. పేద వారి సొంత ఇంటి ద్వారా కుటుంబం సంతోషంగా, సురక్షితంగా జీవించాలని కోరుకుంటున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది. ప్రతి అర్హులైన కుటుంబానికి ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో కూడా ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతవెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల కౌన్సిలర్ మాజీ సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు కరికే మీనాక్షి సత్యనారాయణ, తాళ్లపల్లి నరసింహులు, మద్దెల శ్రీనివాస్, కృష్ణ నాయక్, ముడిమ్యాల మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, గుడిమల్కాపూర్ మాజీ డైరెక్టర్ మంగలి యాదగిరి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరలో హోం గార్డ్ ఆత్మహత్య

**అచ్చంపేట (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలం సలేశ్వరం జాతరలో హోం గార్డ్ ఆత్మహత్య పాల్పడ్డాడు. జిల్లాలోని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెంచుగూడెంకు చెందిన బయన్న(46) కోడేరు పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. సలేశ్వరం జాతర లో బందోబస్తులో ఉన్న బయన్న సలేశ్వరం ప్రాంతంలో పాయిజన్ తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పోలీస్ సిబ్బంది అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతడికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా సలేశ్వరం జాతర సందర్భంగా బందోబస్తు డ్యూటీ పడిన పోలీస్ సిబ్బందికి అచ్చంపేట లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఈ బయన్న గైరాజరైనట్టు తెలిసింది.

# బీజేపీ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష



**మహేశ్వరం,(జనంసాక్షి):** బీజేపీ కార్యకర్తలు అందరూ బీజేపీ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష అన్నారు. బుధవారం మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో కుండే వెంకటేష్ ఫామ్ హౌస్ లో బీజేపీ కార్యకర్తల శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా కొప్పు భాష మాట్లాడుతూ...రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ పై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాపయ్య గౌడ్, మిద్దె సుదర్శన్ రెడ్డి, యాదయ్య గౌడ్, కుండే వెంకటేష్ ,దేశ్యా నాయక్, పోతర్ల సుదర్శన్ యాదవ్, కాసాని వెంకటేష్, బీజేపీ మండల అధ్యక్షుడు యాదిష్, వనంపల్లి శ్రావణ్, ఉపేందర్ పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ల రద్దు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహారణకు డిమాండ్

### బ్లాక్ డేగా సీఐటీయూ ఆందోళనలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, నూతన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఏప్రిల్ 1ను బ్లాక్ డేగా పాటిస్తూ కీసర మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో రాస్తా రోకో, ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించడంతో పాటు ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని కోరారు. కనీస వేతనాన్ని కచ్చితంగా అమలు చేసి కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను ఖండిస్తూ బోగారం, రాంపల్లి, దాయరా, జన్నారం కాలనీ, రాంపల్లి--బోగారం పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృతంగా నిరసనలు నిర్వహించినట్లు తెలిపారు.



# డీఎస్పీ వెంకటేష్‌కు "విశ్వ సేవారత్న" పురస్కారం

**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** పోలీసు శాఖలో నిజాయితీకి నిలువుటద్దంగా చెప్పుకునే డీఎస్పీ వెంకటేష్ కు "విశ్వ సేవారత్న" పురస్కారం లభించింది. ఖమ్మం జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాల్లో పని చేసిన ఆయన ప్రస్తుతం వరంగల్ జిల్లా మామనూరు డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా "విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉగాది పురస్కారాల్లో డిఎస్పి వెంకటేష్ కు "విశ్వసేవ రత్న" పురస్కారం దక్కింది. వివిధ రంగాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్న ప్రముఖులకు "విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్" ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ఈ అవార్డుకు ఎంపికైన వెంకటేష్ కు హైదరాబాదులోని రవీంద్ర భారతిలో మంగళవారం ఈ పురస్కారాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కే ఎం కిరణ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి పాల్గొనగా కమిటీ సభ్యులైన మాజీ స్పీకర్ సిరికొండ మధు సూదనాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆచార్య, ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘాల చైర్పర్సన్ పార్వతమ్మ, ఉభయ రాష్ట్రాల నుంచి వచ్చేసిన విశ్వకర్మ బంధువులు హాజర య్యారు. ఈ పుష్కరానికి తనను ఎంపిక చేసిన విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ కమిటీకి డీఎస్పీ వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇసుక డంపులు సీజ్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వేములవాడలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను బుధవారం రెవెన్యూ అధికారులు గుర్తించి సిజ్ చేశారు. అక్రమ నిల్వ ఉంచిన ఇసుకపై తాసిల్దార్ జయంత్ కుమార్ ను వివరణ కోరగా సుమారు 40 ట్రిప్పుల వరకు ఇసుకను సీజ్ చేశామని వాటిని ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# డంప్ యార్డుకు వ్యతిరేకంగా హుజూరాబాద్‌లో ఉధృతమవుతున్న నిరసనలు

- రోడ్డెక్కి నిరసన తెలిపిన విద్యార్థి లోకం
- ప్లకార్డులు చేతబూని మానవహారంతో నిరసన

**హుజూరాబాద్, (జనంసాక్షి) :** హుజూరాబాద్ మండలం సిర్సపల్లి సరిహద్దులో జనవాసాల మధ్య ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా హుజూరాబాద్ లో నిరసనలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అంబేద్కర్ చౌరస్తాలో అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష పదో రోజుకు చేరింది. బుధవారం డంపింగ్ యార్డు మాకొద్దంటూ విద్యార్థులు కదం తొక్కారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుం డా ప్రజా ఆరోగ్యానికి నష్టం వాటిల్లే డంపింగ్ యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ వందలాది మంది విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేతబూని మానవహారం నిర్వహించారు. మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసనతో జమ్మికుంట, కరీంనగర్, వరంగల్ రహదారుల్లో వాహనాలు, వాహనదారులతో సుమారు గంటకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. డంపింగ్ యార్డ్ వద్దే వద్దు, పర్యావరణాన్ని కాపాడాలి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. చిన్నారులు సైతం డంపింగ్ యార్డ్ వల్ల నష్టాలు కలుగుతున్నాయని భావించి నిరసన తెలుపడానికి వచ్చిన తీరును చూసి ప్రభుత్వ పెద్దలకు ఆలోచన లేకపోవడమేమిటని పలువురు అశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హుజురాబాద్ పరిసరా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్ వల్ల జరుగుతున్న నష్టాన్ని గుర్తించి ప్రజా ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలని హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, రైతు ప్రజా సమితి జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావులు అన్నారు. ఈ సందర్భంగా వారు వేరువేరుగా మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతం లోని భూమి, నీరు, గాలి కలుషితమై ప్రజా ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పల్కల ఈశ్వర్‌రెడ్డి, గుడిపాటి జయపాల్‌రెడ్డి, పోల్సాని రామారావు, బండ శ్రీనివాస్, వేల్పులరత్నం, కట్కూరి మల్లారెడ్డి, చందుపట్ల జనార్ధన్, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, ఖాలీద్‌హు స్సేన్, ప్రభాకర్, కొలిపాక సమ్మయ్య, సందెల వెంకన్న, హనుమంతరావు, బండ సింధుజ , ట్రస్మా నాయకులు వెంకటేశ్వర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు.



# చీటింగ్ కేసుల పురోగతిపై సీపీ సమీక్ష

- హనుమాన్ జయంతి బైక్ ర్యాలీకి పటిష్ట బందోబస్తుకు ఆదేశం
- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం టౌన్ డివిజన్ పోలీసు అధికారులతో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న నేరాల విచారణ, గురువారం నగరంలో జరగనున్న హనుమాన్ జయంతి వేడుకల భద్రత పై కీలక ఆదేశాలు జారీ చేశారు.



### చీటింగ్, ఫోర్జరీ కేసులపై ఆరా

నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్ లో ఉన్న చీటింగ్, ఫోర్జరీ కేసుల పురోగతిని సీపీ సమీక్షించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా విచారణను వేగవంతం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ పక్కా సాక్ష్యాధారాలతో ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### హనుమాన్ జయంతి బైక్ ర్యాలీ

గురువారం రోజు నగరంలో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించ తలపెట్టిన బైక్ ర్యాలీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. ర్యాలీ సందర్భంగా సామాన్య ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని అవసరమైన ప్రాంతాల్లో ముందస్తుగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని టౌన్ ఏసీపీని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

# అమిరెడ్డిపల్లి చిన్నారి దారుణ హత్య

- నగల కోసమా..?ఆస్తి తగాదాలా ..?
- విచారణ చేపట్టిన పోలీసులు

**నారాయణపేట (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా అమిరెడ్డిపల్లిలో దారుణం చోటు చేసుకుంది. అల్లారు ముద్దుగా ఉన్న 5ఏళ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. అమిరెడ్డిపల్లి చెందిన అంజయ్య,శిరీష పొట్టకూటికోసం హైదరాబాద్‌కి వలస వెళ్ళారు. వారికి ఇద్దరు కూతుళ్లు ఉండగా చిన్నకూతురు తేజస్రిని నానమ్మ,తాతయ్య దగ్గరే ఉంచి వెళ్ళారు. ఆచిన్నారి రోజు అంగన్వాడి వెళ్ళేది. మంగళవారం రాత్రి నానమ్మ, తాతయ్య దగ్గర ఆరుబయట నిద్రించింది. అయితే చెరువు వద్ద చిన్నారి శవం బుధవారం తెల్లవారు జామున లభించింది. చిన్నారి శరీరంపై ఉన్న బంగారు,వెండి నగలు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి డిఎస్పీ లింగయ్య, సిఐ శివశంకర్ చేరుకుని విచారణ చేపట్టారు. చిన్నారిని నగల కోసం హత్య చేశారా ఆస్తి తగాదాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# పరిగిలో అక్రమ గ్యాస్ సిలిండర్ల పట్టివేత

- నాసిరకం ఐస్ క్రీ మాంసం దుకాణాలపై దాడులు
- కుళ్ళిన మాంసం కాలం చెల్లిన కల్తీ సామాగ్రి స్వాధీనం





**వికారాబాద్ జిల్లా బ్యూరో (జనంసాక్షి):** పరిగిలో అక్రమ గ్యాస్ సిలిండర్లు, కుళ్ళిన మాంసం , కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రాల పైన టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు చేశారు .వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అన్వర్ పాషా వారి బృందం పరిగి పట్టణ పరిధిలో నిర్వహించిన ఈ దాడులలో అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వ, కుళ్ళిన మాంసం విక్రయం మరియు నిబంధనలకు విరుద్ధంగా ఐస్‌క్రీమ్‌ల తయారీ చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మొదటి ఘటనలో, పరిగి విద్యానగర్ కాలనీకి చెందిన కృష్ణ (35) అనే వ్యక్తి తన నివాసంలో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ తనిఖీల్లో 5 నిండుగా ఉన్న సబ్సిడీ సిలిండర్లు, 4 ఖాళీ సిలిండర్లు , 3 కమర్షియల్ నిండు సిలిండర్లతో కలిపి మొత్తం 12 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రెండో ఘటనలో,పరిగి విద్యానగర్ కాలనీలో నివాసముండే మహ్మద్ ఖలీల్ (34) అనే వ్యక్తి తన మటన్ షాపునకు సంబంధించి సుమారు 35 కిలోల కుళ్ళిన మాంసాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించి, దానిని సీజ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా, పరిగి మెయిన్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా, గడువు ముగిసిన ముడి సరుకులు పారిశ్రామిక రంగులు ఉపయోగించి ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న లిశ్రీ నిత్య ఐస్‌క్రీమ్ యూనిట్‌పై పోలీసులు దాడి చేశారు. దీని నిర్వాహకుడు వికారాబాద్‌కు చెందిన వర్కాల హన్మంతు (45) నుంచి సుమారు కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో సిద్ధార్థ కాలనీకి చెందిన రమేష్ (42) తన నివాసంలోనే తయారీ తేదీ, గడువు తేదీలు లేకుండా మహా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితులం దరినీ తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించి,కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఎటువంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. కేవలం లాభాల కోసం కల్తీ ఆహార పదార్థాలు తయారు చేయడం, గడువు ముగిసిన లేదా కుళ్ళిన పదార్థాలను విక్రయించడం చాలా తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయి. అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ చేయడం కూడా చట్ట విరుద్ధమే కాకుండా, అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇటువంటి నిర్లక్ష్య చర్యలు సమీప ప్రాంత ప్రజల భద్రతకు కూడా ముప్పుగా మారుతాయి. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రత్యేకంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల నాణ్యతపై అధికారులు మరింత కఠినంగా నిఘా ఉంచుతున్నారు. హోటళ్లు, మాంసం దుకాణాలు, ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహించడం లేదా నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉంచడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలపై టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# ఇండ్ల స్థలాల సాధనకు ఆమరణ దీక్షకూ టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధం

- జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏ ఉద్యమమైనా రెడీ
- దశలవారీ పోరాటానికి ఫెడరేషన్ కార్యాచరణ
- అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపైనా పోరాటం



**ఖమ్మం (జనంసాక్షి) :** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనే లక్ష్యంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్- హెచ్ 2843) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దీనిలో భాగంగా ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతోందని వెల్లడించారు. ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఇండ్ల స్థలాల సాధన కోసం దశల వారీ పోరాటాలు చేపడుతామని తెలిపారు. తొలుత సంతకాల సేకరణతో కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని అన్నారు. ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలు, కలెక్టరేట్ ముట్టడి, అంతిమంగా ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. అలాగే అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, స్కూల్, కళాశాలల ఫీజుల్లో రాయితీ...మరోవైపు నిబంధ నల పేరుతో ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల కార్డులు ఉంటే వాటిని 44 వేలకు పెంచుతున్నట్లు ప్రకటిస్తూ... తదితరాంశాలపై కూడా సమావేశం చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న హెల్త్ కార్డులు అత్యవసర పరిస్థితుల్లో ఏరకంగానూ జర్నలిస్టుల కు ఉపయోగపడటం లేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు సైతం హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ల విషయంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక కార్డులు ఇస్తున్నామని ప్రకటిస్తూనే... మరోవైపు నిబంధనల పేరుతో ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల కార్డులు ఉంటే వాటిని 44 వేలకు పెంచుతున్నట్లు ప్రకటిస్తూ... అర్హతలు, నిబంధనల పేరుతో కోత విధించే చర్యలు ఏమాత్రం సహించరానివని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం విషయంలో కొనసాగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ కొనసాగే నిరసన కార్యక్రమాలు అన్నింటికీ జర్నలిస్టులు జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఇండ్ల స్థలా ల కోసం ఇటీవల 14 రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేసిన సంఘం సభ్యుడు కొరకొప్పుల రాంబాబును జిల్లా కమిటీ సన్మానించింది. మరోవైపు నిబంధ నల పేరుతో ప్రభుత్వం కొర్రీలు పెడుతో oదని తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల కార్డులు ఉంటే వాటిని 44 వేలకు పెంచుతున్నట్లు ప్రకటిస్తూ... ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధి కారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ బాలకృష్ణ, నలుబోల మధుశ్రీ,జక్కంపూడి కృష్ణ, కెమెరామెన్ అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి గణేష్, ఖమ్మం నియోజ కవర్గ అధ్యక్షులు తురగ మూర్తి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గుబాటి మాధవరావు, నూకల రామచంద్ర మూర్తి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
2 ఏప్రిల్ 2026

# పేదలను వేధిస్తున్న రేవంత్ సర్కార్

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

- 5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మంగళ్‌హాట్ గోదాంపై దాడి

- హోటళ్లకు చచ్చిన మేకల మాంసం
- కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# రెండు పంచాయతీలకు వికాస్ పురస్కారాలు

## హర్షం వ్యక్తం చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**న్యూఢిల్లీ, ఏప్రిల్1 (జనంసాక్షి) :** గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# తాగునీటి సరఫరాపై ఆన్‌లైన్‌లో డేటా

## 31 మార్చి నాటికి 10,608 జీపీలు నమోదు

- ప్రతిరోజు నివేదికలు.. నిరంతర పర్యవేక్షణలో మంత్రి సీతక్క
- సీతక్క ఆదేశాలతో 'సమ్మర్ స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్' ప్రారంభం
- చేతిపంపుల మరమ్మతులు పూర్తిచేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమగ్ర చర్యలు చేపడుతోంది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి పరిస్థితిపై రోజువారీగా సమీక్ష జరుగుతోంది. జిల్లాల వారీగా ఎన్ని గ్రామాలకు తాగునీరు సమృద్ధిగా అందుతోంది, తాత్కాలిక సమస్యల కారణంగా ఎన్ని గ్రామాల్లో సరఫరా లోపిస్తోంది, ఆ సమస్యలను ఎన్ని రోజుల్లో పరిష్కరించవచ్చన్న అంశాలపై అధికారుల నుంచి మంత్రి సీతక్క ప్రతి రోజు నివేదికలు తెప్పించుకుని, తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యల అమలు తీరును పరిశీలిస్తున్నారు.

### సమ్మర్ స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్

రాష్ట్రవ్యాప్తంగా 12,760 జీపీలుండగా 31 మార్చి 2026 నాడు.. 10,608 జీపీలు తాగు నీటి సరఫరాపై ఆన్ లైన్ లో డేటా నమోదు చేశాయి. ఇందులో 10,432 గ్రామపంచాయతీలకు తాగునీరు సమృద్ధిగా అందుతుండగా, కేవలం 176 గ్రామ పంచాయతీలలో మాత్రమే తాత్కాలిక సమస్యలు ఉన్నట్లు నివేదికలు తెలియజేస్తు న్నాయి. ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి, అన్ని గ్రామాల్లో నిరంతర సరఫరా ఉండేలా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 15 వరకు "సమ్మర్ స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్" ప్రారంభమైంది. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ డ్రైవ్ కొనసాగుతుంది. గ్రామీణ తాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం లక్ష్యంగా చేతి పంపులు, మోటార్లు, పైప్‌లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, నల్లాల మరమ్మతులు వంటి పనులను దశల వారీగా చేపడుతున్నారు.

### ఏప్రిల్ 3 నాటికి పూర్తి చేసేలా..

మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. జిల్లా పరిషత్ సీఈఓలు, ఎంపీడీవోలు, డీపీఓలు, చీఫ్ ఇంజనీర్లు ఫీల్డ్ స్థాయిలో పర్యటిస్తూ పనులను సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం గుర్తించిన చేతి పంపుల మరమ్మత్తులను ఏప్రిల్ 3 నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, ఎక్కడైనా తాత్కాలికంగా నీటి సరఫరా లోపిస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా, అదనపు బోర్‌వెల్‌ల వినియోగం, అత్యవసర మరమ్మత్తులు వంటి ప్రత్యామ్నాయ చర్యలను అమలు చేస్తున్నారు. వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# కోయిల్‌సాగర్ ఆయకట్టు రైతులను ఆదుకోండి

## తక్షణమే నీటిని విడుదల చేయండి

- కర్నాటక ప్రభుత్వ మంత్రితో మాట్లాడిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్.. ఆందోళనలో ఆయకట్టు రైతాంగం



**మహబూబ్‌నగర్, ఏప్రిల్1 (జనంసాక్షి) :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.

# 'కొండగట్టు'లో అపశృతి

- చలువ పందిళ్లు కూలి 15 మందికి గాయాలు

**జగిత్యాల, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

# మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

- సీఐడీ విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు
- కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం
- ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా? : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్1 (జనంసాక్షి) :** రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు.

# మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్, యజమాని అరెస్టు

**మార్కాపురం, ఏప్రిల్1 (జనంసాక్షి) :** మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్ యువరాజు, బస్సు యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమవగా.. మరో 28 మంది గాయపడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరి వైపు వెళు తుండగా ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లో శ్రావణి ట్రావెల్స్ నడుపుతున్న యార్లగడ్డ కోటేశ్వరరావు వద్ద ఓఖీ 20 ఆ 0487 నంబర్ బస్సును సెకండ్ హ్యాండ్‌గా కొనుగోలు చేసి హరికృష్ణారెడ్డి నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం సమయంలో బస్సులో సుమారు 35 నుంచి 41 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు యాంత్రిక లోపాలు కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి పరారీలో ఉండగా.. పోలీసులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

# ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్1 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# రెండు కూటములను సాగనంపండి

- దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న కూటములు
- కేరళ ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పిలుపు



**తిరువనంతపురం, ఏప్రిల్1 (జనంసాక్షి) :** కేరళలోని కష్టజీవులు, నిజాయతీపరులైన ప్రజలను దశాబ్దాలుగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, యునైటెడ్ డెమోక్రటక్ ఫ్రంట్‌లు వంచిస్తున్నాయని, రెండు కూటమిల్లో ఎవరో ఒకరిని ఎంచుకోవడం కాకుండా రెండింటినీ ఇంటికి సాగనంపాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరవూర్ నియోజకవర్గంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ జెండాలు, గుర్తులు వేరైనప్పటికీ వాటి ప్రవర్తన, క్యారెక్టర్ ఒకటేనని చెప్పారు. ఆలోచనా ధోరణి కూడా ఒకటేనన్నారు. సమాజాన్ని విడగొట్టడం, కేరళం ఆర్థిక వ్యవస్థను పతనం చేయడం కోసం పనిచేస్తుంటాయని విమర్శించారు. ఎల్డీఎఫ్ అంటే లూటీలు, విభజనలు, వైఫల్యం(లూట్, డివిజన్, ఫెయిల్యూర్) అని రాజ్‌నాథ్ నిర్వచించారు. యూడీఎఫ్‌ను నమ్మదగని, నిజాయతీలేని, మోసపూరితమైనది (అన్‌ట్రస్ట్‌వర్తీ, డిసానెస్టీ, ఫ్రాడ్)గా రాజ్‌నాథ్ అభివర్ణించారు. రెండిట్లోనూ 'ఎఫ్' అనేది కామన్ అనీ, 'ఫ్రంట్' అంటే కరప్షన్ అని ఘాటుగా విమర్శించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఈ సారి కేరళం ఎన్నికల్లో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు గట్టి సవాల్ విసిరేందుకు ప్రచారం ముమ్మరం చేస్తోంది. సీపీఎం సారథ్యంలోని ఎల్డీఎఫ్ దశాబ్ద కాలంగా అధికారంలో ఉంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సారథ్యంలో ఎల్డీఎఫ్ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు పట్టుదలగా ఉంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పినరయి విజయన్ వైఫల్యాలను ఎండగడుతూ ఈ సారి 100 సీట్లలో తమ గెలుపు ఖాయమంటూ ప్రచారం సాగిస్తోంది. బీజేపీ ఓట్ షేర్ కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిందని, ఓటర్లు ఇప్పుడు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని ఎన్డీయే అభ్యర్థి అనూప్ ఆంటోని తెలిపారు. కాగా, కేరళం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# విభజన చట్టంలోని హామీలు అమలు చేయండి

- అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జనంసాక్షి) :** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిం చారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370